# టు మై కంట్రీ విత్ లవ్

పి. చంద్రశేఖర అజాద్

నవల

# టు మై కంట్రీ విత్ లవ్

మనం రాయవలసిన గీతం

## పి. చంద్రశేఖర అజాద్

నవల

జానకి - అజాద్

ప్రచురణలు

**టు మై కంట్రీ విత్ లవ్**

'ఐ లవ్ మై ఇండియా' అనే పేరుతో ఈ నవల

అక్టోబర్ 1988లో స్వాతి మాసపత్రికలో ప్రచురించారు

రచన:

**పి. చంద్రశేఖర అజాద్**

© అన్ని హక్కులు రచయితవి

వెల: రూ. 100/-

ప్రచురణ:

**జానకి-అజాద్ ప్రచురణలు**

కవర్ డిజైన్:

**సుబ్బరాజు జంపన**

డిటిపి:

**శిరీష జంపన**

e-NOVEL

**చిరునామా:**

ఫ్లాట్ నెం: 909, సఫైర్ బ్లాక్,

మైహోమ్ జ్యూవెల్,

మదీనాగూడ,

మియాపూర్,


హైదరాబాద్ - 049.

ఫోన్: 09246573575

**e-mail: chazadp@rediffmail.com**

**chazadp@gmail.com**

# అంకితం



అత్యంత నిరాడంబరుడూ
నిరంతరం నలుగురికి మంచి జరగాలని తపించేవాడూ
ఓపికున్నంత వరకూ పిల్లలకు భారంగా వుండకూడదని
తనదైన శైలిలో జీవించేవాడూ
తమ ఊరిని గాఢంగా ప్రేమించేవాడూ
చదువుకున్నది కొద్దిపాటి చదువే అయినా ఈ వయసులో ప్రేరణపొంది
తనవాళ్ళందరి జ్ఞాపకాలు రచిస్తున్నవాడూ
మంచితనం హృదయమైనవాడూ
సామాన్యుడు...
ఈ దేశపు దుస్సంఘటనలకి తనలో తాను దుఃఖించేవాడు
మావయ్య **శ్రీ వెలగపూడి పూర్ణయ్య** గారికి హృదయమంతటితో...

–పి. చంద్రశేఖర అజాద్

ఇప్పుడు మావయ్య లేరు
ఆయన జ్ఞాపకాలు ఉన్నాయి

# మీతో...

'ఐ లవ్ మై ఇండియా' అనే పేరుతో ఈ నవల అక్టోబర్ 1988లో స్వాతి మాసపత్రికలో ప్రచురించారు శ్రీ వేమూరి బలరామ్ గారు.

ఈ నవల ఓ ప్రయాణంతో ఆరంభం అవుతుంది. అది నా అనుభవమే.

డిసెంబర్ అయిదున అప్పట్లో నేను మద్రాసు వెళ్లవలసివచ్చింది. అప్పుడు నేను పరుచూరి సోదరుల దగ్గర అప్రెంటిస్‌గా వున్నాను. నేను పరుచూరి వెంకటేశ్వరరావు గారి దగ్గర వుండేవాడ్ని. అప్పటికే నేను కథా, నవలా రచయితగా కాస్త పేరు తెచ్చుకున్నాను.

నాకు కథలు రాయటం, నవలలు రాయటం అలవడింది. అయితే సినిమాకి చెందిన అవగాహనలేదు. సినాప్సిస్ ఎలా రాస్తారు? స్క్రీన్‌ప్లే అంటే ఏమిటి? సంభాషణలు ఎలా రాయాలి? నిడివి ఎంత? దృశ్యం అంటే ఏమిటి? వీటి గురించి తెలియదు. అంతేకాదు 'కథ' ఎలా చెప్పాలి అనేది కూడా ఈ రంగంలో చాలా ముఖ్యం. ఇవన్నీ 'గురువు' దగ్గర నేర్చుకోవాల్సి వుంటుంది. పుస్తకాల నుండి కొంత జ్ఞానం సంపాదించుకోవచ్చు. అయితే ఆచరణలో మాత్రమే ఈ విషయాలన్నింటి మీదా అవగాహనతో పాటు సూక్ష్మ రహస్యాలు, పద్ధతులు తెలుసుకోవచ్చు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే కొంతమందికి 'ఘోస్టు' అనే పదానికి అప్రెంటిస్‌కి తేడా తెలియదు.

మనకి ప్రాక్టికల్‌గా నాలెడ్జి వచ్చాక, స్వంతంగా స్క్రీన్‌ప్లే-సంభాషణలు సమకూర్చగలిగే ఇతరుల పేరు మీద రచనలు చేయటం 'ఘోస్టు'గా పనిచేయటం అవుతుంది. అందుకు అనేక కారణాలు. ఓ రచయిత పేరుకి డిమాండ్ వున్నప్పుడు, మన రచనలు అచ్చుకానప్పుడు, లేదా సినిమాలకు ఒప్పుకోనప్పుడు, డబ్బుల కోసం రాయాల్సి వస్తుంటుంది.

నిజానికి ఏ సినిమాకయినా అయిదారు వెర్షన్‌లు రాయించుకుంటారు. వారిని సహాయ రచయితలు అని పిలవొచ్చు. అందులో పూర్తిగా ఏ ఒక్కరి స్క్రీన్‌ప్లేనో, సంభాషణలో ఉండవు. అలాగే జయాపజయాలు ప్రధాన రచయితకి ఆపాదిస్తారు తప్ప దెయ్యపు రచయితల పాత్ర వుండదు.

ఎక్కువగా నవలా రచనల్లోనే దెయ్యపు రచయితల పాత్ర వుంటుంది.

ఇది 'సినిమా' నేపథ్యంలో ప్రారంభమైన నవల కాబట్టి తెలియని వారి కోసం ఇది రాసాను.

ఆ ప్రయాణంలో నాకు ఎదురయిన అనుభవాలను రాసాను. ఆయా వ్యక్తులని నేను చూశాను. నిజంగానే ఈ దేశంలో పుట్టి రైలు ప్రయాణంలో మన పక్కన ప్రయాణం చేస్తున్న మన సోదరుల్ని, అక్కచెల్లెళ్లని, అలాగే అన్ని వయసుల వారినీ అనుమానంతో చూడాల్సిరావటం ఓ విషాదం. ఈ నవల రాసేటప్పటికీ, ఇప్పటికీ పరిస్థితుల్లో మరింత అభద్రత, అనుమానం వచ్చాయి తప్ప మార్పు రాలేదు.

మన ఊర్లలో, నగరాల్లో క్రైమ్ అనేది సైలెంట్‌గా ఎలా పాతుకుపోతుందో, బంధాలు ఎలా మృగ్యం అవుతున్నాయో ఈ నవలలో చెప్పే ప్రయత్నం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా మనం విభిన్న కులాల, మతాల మధ్య సామరస్యం ఏర్పరుచుకోలేకపోయాం.

అందుకు అంతరాలు పెరగటం, అభివృద్ధిలోని అసమానతలు, ఇంకెన్నో కారణాలు. అవన్నీ రేఖామాత్రంగా చూపించే ప్రయత్నం జరిగింది.

ఈ నవలలోని క్లైమాక్స్ మా ప్రయాణంలో జరిగిందికాదు అయితే అది కోయంబత్తూరులో జరిగింది.

నిజానికి ఓ సునామీనో, ఓ తుఫానో, మరొక ఉపద్రవమో విరుచుకుపడినప్పుడు మాత్రం మనుషులు అందరూ ఏకమవుతారు. అప్పుడే మనందరం ఇది మన దేశం, మన భారతదేశం– 'ఐ లవ్ మై ఇండియా' అంటూ ఉద్వేగంతో అన్ని వర్గాల –వర్ణాల వారంతా కలిసిపోతాం.

ఈ దేశంలో విప్లవం రావాలని కోరుకునే వారిలో కూడా, వారి సిద్ధాంతాలకు రూపకల్పన చేయటంలో విదేశాల తత్వవేత్తల రచనలు– ఆచరణ– అనుభవాలు పునాదులైనా, మనవైన ప్రత్యేక పరిస్థితులకి అన్వయం చేసుకోవాలి. ఏ మతం వారైనా, ఏ ప్రాంతం వారైనా ముందుగా భారతీయులు.

అందుకే దేశాన్ని ప్రేమించే వారందరి కోసం ఈ రచన.

మీకు నచ్చితే, సూచనలు ఇవ్వదలుచుకుంటే మీ అభిప్రాయలను నా మెయిల్‌కి పంపగలరు.

**– చంద్రశేఖరఅజాద్.పి**

# టు మై కంట్రీ విత్ లవ్

**అం**దరూ సీరియస్‌గా ఆలోచిస్తున్నారు.

నాలుగురోజుల నుండి సమస్య ఎంతకూ తెగదు. నిన్న రాత్రి పది గంటలకే గదంతా కోలాహలం. అద్భుతమైన క్లైమాక్స్ వచ్చిందనుకున్నాం. ఉదయం రాగానే వాతావరణం మారిపోయింది. ఎవరో ఏదో అనుమానం వెలిబుచ్చారు. తిరిగి సమస్య మొదటికొచ్చింది.

"కాఫీ చెబుదామా" అన్నారెవరో.

వెంటనే 'రూమ్ సర్వీస్'కి ఫోన్ చేసి చెప్పారు.

క్లైమాక్స్‌కి చెంది మా ముందు రెండు పద్ధతులున్నాయి. ఒకటి యాక్షన్‌తో మిళితమైవుంటే రెండోది ఎమోషనల్ డ్రామా.

ఇంకో రెండు రోజుల్లో షెడ్యూల్ ప్రారంభం కాబోతోంది. దాదాపు ప్రధాన పాత్రధారులందరూ ఈ షెడ్యూల్లో పాల్గొంటారు. ముందు షూటింగ్‌కి కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయాలంటే క్లైమాక్స్ ఎలా వుండాలో నిర్ణయం కావటం చాలా అవసరం.

దర్శకుడు యువకుడు. ఆధునిక భావాలున్నవాడు. అంత త్వరగా కన్విన్స్‌కాడు. రాజీ పడడు.

అంతకు ముందే మారుతున్న ప్రేక్షకుల అభిరుచి మీద పెద్ద చర్చ నడిచింది.

"మనం ఏం చెప్పినా పాత పద్ధతుల నుండి బయటకు రావాలి. క్లైమాక్స్ అంటే భీకర యుద్ధం, మంటలు, విలన్స్‌ని చావగొట్టడం– ఇవన్నీ రొటీన్. ఎటూ హీరో రక్షిస్తాడని అర్థంకాగానే ప్రేక్షకులు బయటకు వెళ్ళిపోతున్నారు. మనం ఎమోషనల్ డ్రామాకు ఫిక్స్ అయితే బాగుంటుంది." అన్నాడు జతిన్.

నిర్మాత మాత్రం దర్శకుడితో అంగీకరించలేకపోతున్నాడు.

"మనం మాసెస్‌ని దృష్టిలోకి తీసుకోకపోతే ఎట్లా? బీ.సీ.ల్లో చూడరు" అన్నాడతను.

రావ్ సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. అప్పటిదాకా కళ్లు మూసుకున్న రావ్ కళ్లు తెరిచి నన్ను చూశారు.

"టైమెంతయింది?" అన్నారు.

"నాలుగవుతోంది"

"నాలుగా! రేపు నువ్వు మద్రాసు రావటంలేదా?"

"మీరు రమ్మంటే వస్తాను" అన్నాను.

"భలేవాడివే. ఈపాటికి ఎవరితోనన్నా టిక్కెట్ బుక్ చేయించాల్సింది. నువ్వు బయలుదేరటానికి టైమ్ సరిపోతుందా?"

"సరిపోవచ్చనుకుంటాను. ఆ ఫోనిలా ఇవ్వండి" అన్నాను.

నా భార్య లైన్లోకి రాగానే చెప్పాను– "నేను అర్జెంట్‌గా మద్రాస్ వెళ్ళాలి. అరగంటలో అక్కడుంటాను. బట్టలు సర్దివుంచు"

రావ్ ఫోన్ అందుకున్నారు. ఎవరికో డయల్ చేస్తున్నారు.

గదిలో అందరూ ఆయనకేసి చూస్తున్నారు. రావ్ సీనియర్ రచయిత. ఎన్నో విజయవంతమైన చిత్రాలకు ఆయన రచన చేశారు. నేను ఇటీవల కాలంలో ఆయన అసిస్టెంట్‌గా జాయినయ్యాను.

"నేను రావ్‌ని. అర్జెంట్‌గా మద్రాసుకి టిక్కెట్ కావాలి. మేం 'గోల్కొండ'లో

వున్నాం. మా శేఖర్‌ని ఎలా రిసీవ్ చేసుకుంటారు. కారు పంపిస్తారా?" అంటున్నారు.

"నేను స్కూటర్ మీదొచ్చాను. దాని మీద ఇంటికి వెళ్ళి అక్కడ పెట్టేసి లగేజ్‌తో వాళ్ల ఆఫీస్‌కి వెళ్తాను ఆటోలో" అన్నాను.

"బండి ఎన్నిగంటలకి?" అడిగారు రావ్. చెప్పారు.

"అయితే అయిదుగంటలకల్లా మీ ఆఫీస్ దగ్గరుంటే చాలా...? అలాగే. టిక్కెట్ ఫస్ట్‌క్లాస్ ట్రైచెయ్యండి. ఈ రోజు ఎలాంటి పరిస్థితుల్లోనూ అతన్ని బండి ఎక్కించాలి"

నేను బయలుదేరటానికి లేచాను.

అందరూ నాకేసి చూస్తున్నారు. నేను రావ్‌గారి కేసి చూసాను.

"క్లైమాక్స్ గురించి వర్రీ కావద్దు. ఈ రోజు అర్ధరాత్రి దాటినా కంప్లీట్ చేసి గాని కదలను. సరే నువ్వు బయలుదేరు"

"కాఫీ తాగి వెళ్ళండి" అంటున్నారెవరో.

"బండి వెళ్ళాక కదా వచ్చేది"

అందరూ నవ్వారు. అంతలోనే కాఫీ వచ్చింది.

"టైమ్ లేదు" అని నేను వచ్చేశాను.

రావ్ రేపు ఉదయం ఫ్లైట్‌లో మద్రాసు వస్తున్నారు. అక్కడ కనీసం అయిదు రోజులుండాలి. ఓ మలయాళ సినిమాకి అర్జెంటుగా స్క్రీన్ ప్లే తయారుచేయాలి. కథావిస్తరణ కూడా.

'కాల్ షీట్లు' ఉపయోగించుకోలేకపోతే రేర్ కాంబినేషన్స్ దొరకటం కష్టం. ఎవరి ఆందోళన వారిది. రాత్రి కూడా రావ్‌గారికి మద్రాసు ప్రయాణం గుర్తుచేశాను. అప్పటికి ప్రోగ్రామ్ కన్‌ఫర్మ్ కాలేదనుకుంటాను.

అప్పుడే ట్రాఫిక్ విపరీతంగా వుంది. ఎంత త్వరగా వెళ్దామన్నా కుదరటం లేదు. పైగా కాలం చెల్లిన వాహనాలు వదులుతున్న పొగంతా ముఖం మీదే. దానికి తోడు ఎక్కడికక్కడ 'రెడ్ లైట్లు' వేగాన్ని ఆపుతున్నాయి. అరగంటకి గాని చేరలేకపోయాను.

"సడన్‌గా బయలుదేరుతున్నారే" అంది మధు.

“సినిమా ప్రయాణాలు ఇలానే వుంటాయి”

“అన్నీ సర్దాను. ఇంకేమైనా మర్చిపోయానేమో చూడండి”

“నోట్‌బుక్ పెట్టావా?”

“లేదు”

నేను బుక్‌షెల్ఫ్ దగ్గరకెళ్ళి లాంగ్ నోట్‌బుక్ తీసి బ్యాగ్‌లో పెట్టాను. ఎప్పటినుంచో చదవాలనుకుంటున్న రెండు పుస్తకాలు కూడా పెట్టేశాను. మద్రాసులో ఏమాత్రం తీరిక దొరికినా ఓ నవల ఆరంభించాలి.

“మళ్ళీ ఎప్పుడు రావటం?”

“కనీసం అయిదు రోజులుంటాం”

“ఏ సినిమాకి?”

“మలయాళం”

“ఇతర భాషా చిత్రానికి వెళ్తున్నారు. కంగ్రాట్స్” అంది.

“థ్యాంక్యూ. పిల్లలు రాగానే చెబుతావుగా”

“చెబుతాను. స్టేషన్ నుండి ఫోన్ చేస్తారా”

“కుదరదు. ముందింత వరకూ టిక్కెట్ తీసుకోలేదు. వాళ్ళు రావటం టీ.సీ.ల్ని కలవటం చికాకుగా వుంటుంది”

“పోనీ మద్రాసులో దిగగానే చేస్తారా?”

“అదీ కుదరదు. రాత్రికి ఫోన్ చేస్తే మీరందరూ మాట్లాడొచ్చు”

“సరే. ఇంతకూ మద్రాస్ నుండి ఏం తెస్తున్నారు?” అంది నవ్వుతూ.

“బహుశా గొప్ప అనుభవాన్ని”

మధు నవ్వింది.

“వస్తాను” అని రెండడుగులు వేసి ఆగి వెనక్కి తిరిగాను.

“ఇవాళ తారీఖెంత?”

“డిసెంబర్ అయిదు” అంది మధు.

“నెల కూడా చెప్పాలా” అనేసి మెట్లు దిగాను.

* * *

ఆఫీస్ గోడకున్న గడియారం అయిదున్నర గంటల్ని చూపిస్తోంది. ఇప్పటి వరకూ 'కారూ', 'మనిషీ' జాడ లేరు. రావ్‌కి ఫోన్‌చేసి చెబుదామా అనుకున్నాను.

ఫోన్ రింగయింది. లిఫ్ట్ చేశాను.

"శేఖర్‌గారూ! బండి ఆరుగంటలకి. కంగారుపడొద్దు. కారు పంపిస్తున్నా"

పది నిముషాలు గడిచాయి.

ఈ ప్రయాణం జరుగుతుందా? జరగదా?

"రండి సార్ వెళ్దాం" అన్నారెవరో.

గబుక్కున లేచాను. తిరిగి ట్రాఫిక్‌లో కారు పరుగులు.

నాంపల్లి స్టేషన్ దగ్గర ఆగింది. "ఇక్కడే వుండండి" అని అతను వెళ్ళాడు. ఇక్కడ తెలిసిన టీ.సీ. దొరక్కపోతే సికింద్రాబాద్ స్టేషన్‌లో ట్రై చేస్తాడేమో!

"దిగండి సార్" అన్నాడు.

చేతిలో టిక్కెట్ పెట్టి వందరూపాయలు ఇచ్చాడు.

"ఇదేంటి ఆర్డనరీ టిక్కెట్"

"టిక్కెట్లు లేవు సార్"

"ఫస్ట్‌క్లాస్ ట్రై చేయమన్నారు కదా"

"అవి లేవు"

"బెర్తన్నా లేకపోతే అంత దూరం ఎలా ప్రయాణం చేయటం"

"టీ.సీ.కి చెప్పాను. బెర్త్ ఇస్తారు"

"మీరుండి ఇప్పించి వెళ్ళండి"

"అర్జెంటుగా వచ్చేయమన్నారు"

"టీ.సీ.కి ఎంతివ్వాలి?"

"ఓ నలభై ఇవ్వండి. సరిపోతుంది"

"నాకు బెర్త్ దొరుకుతుందని నమ్మకం లేదు"

"తప్పకుండా దొరుకుతుంది. మీరు వెళ్లండి"

"టీ.సీ.గారి పేరేంటి?"

"కృష్ణమూర్తి"

"సార్ చెప్పింది వేరు, మీరు చేస్తుంది వేరు. ఓ.కే. మీ పేరు తెలుసుకోవచ్చా?"

అతని ముఖంలో కొద్దిగా మార్పు. చెప్పాడు.

"ఓ.కే. మీరు వెళ్ళండి"

కారు నా కళ్ళముందే కదిలింది.

ప్లాట్‌ఫామ్ మీద బండి వుంది. కంపార్ట్‌మెంట్స్ ఖాళీగానే కనిపిస్తున్నాయి. ఒక్కో బోగీమీద అంటించిన లిస్ట్ చదువుకుంటూ వెళ్ళాను. ఓ చోట దొరకవచ్చునేమో అనిపించింది– అది కూడా టీ.సీ. కరుణిస్తే!

ఇంటికి ఫోన్‌చేద్దామా అనుకున్నాను. దగ్గర్లో ఎక్కడా కనిపించలేదు. టికెట్‌కేసి చూసుకున్నాను. సినిమా ప్రయాణాలే కాదు తిరుగు ప్రయాణాలు ఇంకా తమాషాగా వుంటాయి. మొన్న ఫస్ట్‌క్లాస్‌లో వచ్చిన ఓ కొత్త తార వెళ్ళేటప్పుడు ఫ్లైట్‌లో వెళ్ళింది. అదో డైమన్షన్. మొన్న విమానాల్లో తిరిగి ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో మాత్రమే దిగే వ్యక్తి స్టేషన్ బయట టీ స్టాల్లోనూ కనిపించవచ్చు.

విజయాన్ని మాత్రమే పరిగణించే 'విశాల' రంగస్థలమిది.

స్టేషన్ స్టేషన్ వాసనేస్తోంది.

ఆరుగంటలు దాటాక ఒక్కో టీ.సీ. వస్తూ కనిపించారు. అందులో 'కృష్ణమూర్తి' అనబడే వ్యక్తిమాత్రం లేడు. ఉండడని నాకు తెలుసు. అతను రంగు పూసుకుని నటించే వారికన్నా అద్భుతంగా నటించాడు. అలాగే 'కథ' ఎలా చెప్పాలో కూడా అతన్నుండి నేర్చుకోవచ్చుననిపించింది.

బోగీ దగ్గరకు వచ్చి సూట్‌కేస్ వుంచుతున్న టీ.సీ.ని కలసి "మద్రాస్ వెళ్ళాలి సర్. బెర్త్ కావాలి" అని నమ్రంగా అడిగాను.

నాకు తెలిసినంత వరకు పెద్ద సీన్ క్రియేట్ చేసిగానీ, చాలా డిమాండ్ వుందనే స్థితిని కల్పించి గానీ అంగీకరించరు. ఆయన ఏ మూడ్‌లో వున్నాడో గానీ ఛార్ట్ తీసి చూసి నా టిక్కెట్టు అందుకుని నెంబర్ రాసి–

"అక్కడ కూర్చోండి. నేను వచ్చాక రాసిస్తాను" అన్నాడు.

కొంత రిలీఫ్... బండి సిగ్నల్ ఇచ్చారు. నేను ఆ బోగీలో ఎక్కి నెంబర్ చూసుకుంటూ నడుస్తుండగా కదిలింది. ఎందుకో తెలీని ఉద్వేగం. గతంలో రెండు

మూడుసార్లు మద్రాస్ వెళ్ళాను. అప్పటి పరిస్థితి వేరు. ఈ ప్రయాణం మాత్రం నా జీవితంలో గొప్ప మార్పును తేబోతుందని నా గట్టి నమ్మకం...

నాకు కేటాయించిన నెంబర్ బెర్త్ దగ్గరకు వెళ్ళాను. లోయర్ బెర్త్. అక్కడ ఓ నడివయసు స్త్రీ, ఇంకో యువతి కూర్చున్నారు. బెర్త్‌కింద సామాన్లు సర్దేశారు. ఎదురుగా మరో ఇద్దరున్నారు. వారూ సామాన్లు సర్దారు. నా సూట్‌కేస్ ఎక్కడ పెట్టుకోవాలో తెలియదు.

"నాకు ఈ బెర్త్ ఇచ్చారు" అన్నాను మెల్లగా.

ఆ అమ్మాయిది మిడిల్ బెర్త్. తొమ్మిది దాటితేగానీ నిద్రపోరు. "మీరు కూర్చోండి" అని నా సూట్‌కేస్ పై బెర్త్‌మీద వుంచి వారి ఎదురుగా కూర్చున్నాను.

ఆ అమ్మాయి కిటికీ పక్కన కూర్చుంది. అద్దం కిందకు దించింది. తన బ్యాగ్ నుండి ఓ పుస్తకం తీసింది. అది తమిళ పుస్తకం. చదువుకుంటూ కూర్చుంది. మా కిటికీ తలుపు సగం పైదాకా మూసివుంది. చల్లటి గాలి వీస్తోంది.

సికింద్రాబాద్ స్టేషన్లో బండి ఆగింది. అప్పటిదాకా ఖాళీగా అనిపించిన కంపార్ట్‌మెంట్ వేగంగా నిండుతున్నట్లనిపించింది.

మా వెనకభాగంలో పెద్ద కోలాహలం. తల వెనక్కి తిప్పాను. రంగురంగుల బ్యాగ్‌లూ, సూట్‌కేసులూ, మంచినీళ్ళ సీసాల్తో పాటు లోపలకు ప్రవేశించారు. ఓ మధురమైన పరిమళం నాసికను తాకింది. అంతలోనే ఏవేవో తినుబండారాలు, ముగ్గిన పండ్ల వాసన ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది.

అప్పుడు గుర్తొచ్చింది. మంచినీళ్ళు తెచ్చుకోవటం మరిచిపోయాను. చలికాలం కాబట్టి పెద్దగా అవసరం లేదనుకుందో, స్టేషన్లో కొంటాననుకుందో తెలియదు. దిగి ఓ బాటిల్ కొందామా అనుకున్నాను. బండి కదిలింది.

కొంతమంది బిలబిలమంటూ దిగిపోయారు. పిల్లలూ పెద్దలూ కిటికీల దగ్గరకు చేరిపోయి చేతులూపుతున్నారు. కొందరి కళ్ళల్లో సంతోషం, మరికొందరి కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. క్రమంగా అందరూ దూరం అవుతున్నారు. నాకూ చేతులూపాలనిపించింది. ఇప్పుడు ఎవరూ లేరు. ఇదివరకైతే వేరు. ఆ ఊరి నుండి వస్తున్నప్పుడు మిత్రులంతా వచ్చారు. చెమ్మగిల్లిన కళ్ళతో వీడ్కోలు చెబుతున్నప్పుడు

దుఃఖం ఆపుకోలేక పోయాను. దాదాపు గంటదాకా నా కర్చీఫ్‌తో కళ్లు అద్దుకుంటూనే వున్నాను.

అలాంటి దృశ్యం గుర్తుకొచ్చినప్పుడల్లా కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరుగుతాయి. చల్లటి గాలితోపాటు అదో రకమైన వాసన. కాలుష్యం నిండిన నగరం నుండి నగరానికి ప్రయాణం ఆరంభం అయింది.

మంచినీళ్ళు తాగితే బాగుండుననిపించింది. నీళ్ళు కొనాలంటే బాధ... చిన్న సీసా నీళ్లు పదిహేను రూపాయలు. ఎక్కడ జీవనదులు ప్రవహిస్తున్నాయో ఆ నేలమీద పుట్టి, ఆ నీటిని దోసిళ్లకొద్దీ తాగి, ఆ నీటిలో శరీరాన్ని శుభ్రం చేసుకొని, కేరింతలు కొట్టిన నాలాంటి వారికి నీటిని కొనుక్కోవాలంటే బాధగానే వుంటుంది. అవి గొంతులోకి జారుతుంటే గొంతుకు అడ్డం పడుతున్నట్లనిపిస్తుంది.

ఆకలిగా కూడా అనిపిస్తోంది. నాకు నవ్వొచ్చింది. ఇలాంటి ప్రయాణాల్లోనే రకరకాల కోరికలు బయటపడుతుంటాయి. దూరంగా టీ.సీ. టిక్కెట్లు చెక్‌చేస్తూ కనిపించాడు. ఆయన వచ్చి కన్‌ఫర్మ్ చేసేదాకా ఆరాటమే. పక్కకి చూశాను. ఆ అమ్మాయి పుస్తకం చదవటంలో మునిగిపోయింది.

* * *

“నిరంతరం ప్రవహించాలి. ఆగిపోయిన నీరు కుళ్ళుకంపు కొడుతుంది. ఒకేచోట చెప్పిందే చెప్పి ‘మోనాటనీ’ అనిపించేలా చేయటం కంటే కొత్త రంగంలోకి వెళ్ళు. తిరిగి అక్కడ ‘అ ఆ’ల్తో ప్రారంభించు. జీవితం సరికొత్తగా ఆరంభం అవుతుంది” ఇదీ నా మిత్రుడి సిద్ధాంతం.

ఇప్పుడతను లేడు. కొత్త ప్రపంచాలను వెతుక్కుంటూ వెళ్ళాడు. రెండు నెలల క్రితం వరకూ నా ప్రపంచం వేరు.

నాకంటూ ఓ ఉద్యోగం, అప్పుడప్పుడూ నేను రాసిన కథలు అచ్చులో చూసుకోవటం, మిత్రుల నుండి ఉత్తరాలు , వాటికి జవాబులు రాయటం. నా డైరీ, నా పుస్తకపఠనం, ఎప్పుడన్నా సంగీతం వినటం, సాహిత్యసభలకి హాజరుకావటం. నాతోపాటు మధూ, పిల్లలు వీటిలోనే ఆనందం వెతుక్కున్నారు.

నాకు తెలియకుండానే అంతర్గతంగా ఏదో జ్వాల నన్ను కాల్చేస్తోంది. చివరివరకూ గుర్తించలేకపోయానో, ఇంతకంటే మార్గం లేదని రాజీపడ్డానో, సాహసం చేయటానికి ధైర్యం చెయ్యలేకపోయాను. కొత్త రంగంలోకి వెళ్ళటానికి నన్ను ప్రేరేపించిన అంశాలేమిటి?

చిన్ననాటి నుండి 'మీడియా' మీద పెంచుకున్న ప్రేమా? కీర్తీ, డబ్బూ సంపాదించాలనే ఆరాటమా? ఇంకేమైనానా? ఏమో! అన్నీ కారణం కావచ్చు. అన్నింటికీ మించి నా బంగారు కల ఒకటుంది.

మాకంటూ ఓ చిన్ని 'గూడు' ఏర్పరుచుకోవాలి. పిచ్చుకలు సైతం పుల్లా పుటకా ముక్కున కరిచి గూడు కట్టుకుంటాయి.

పొదలూ, కొమ్మలూ, తొర్రలూ, పుట్టలూ, నీరూ జీవజాలానికి నీడనిస్తున్నాయి. మనిషి తలదాచుకోవటానికి తనదనే 'గూడు' లేకపోవటం బాధాకరమే.

"అది పూరిల్లో, గుడిసో ఏదైనా ఫర్వాలేదు. మనదంటూ ఓ ఇల్లుంటే అందరం అందులో పడుందాం. తిన్నా తినకపోయినా అడిగేవాడుండడు. మీరంతా తలోదిక్కునున్నారు. నేను ఏ క్షణాన గుటుక్కుమంటానో తెలియదు. మీకు చివరి చూపు కూడా అందదు. అద్దె ఇళ్ళల్లో అయిదు నిముషాలు కూడా నా శవాన్నుంచరు" అంటుంది అమ్మ...

అమ్మ చచ్చిపోవటమా! అవును, చచ్చిపోతుంది. ఈలోగా తన బిడ్డల ఇంటిలో ప్రశాంతంగా మరణించే అదృష్టం ఆమెకు కలుగుతుందా? అందుకేనా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని సినిమాలకు కథలు రాయాలని వచ్చింది. జీవితపు రెండో దశలో ఈ నిర్ణయానికి రావటం విశేషం కావచ్చు.

"ఏమాత్రం గ్యారంటీ లేని రంగాన్ని నమ్ముకుని వెళ్ళటం ఏ రకంగా చూసినా మాకు నచ్చలేదు"

"నువ్వో నిర్ణయం తీసుకున్నావ్. ఇప్పుడు ఏం చెప్పినా ఉపయోగంలేదు. నువ్వు విజయం సాధించాలని కోరుకుంటాం. ఎదురుచూస్తాం"

"ఇంకెంత కాలం ఎదుగూ బొదుగూ లేని జీతంతో, జీవితంతో గడుపుతావ్. ప్రయోగం చెయ్యి. ఈ మాత్రం జీవితాన్ని జీవించగలవ్"

"మీరేం చేసినా నాకిష్టమే. అవసరమైతే కష్టాలూ నష్టాలూ ఎదుర్కొందాం. మనకవి కొత్త కాదుగా"

"డాడీ... మీరు మీకు నచ్చిన పని చేయండి"

రకరకాల అభిప్రాయాలు. వాలంటరీ రిటైర్‌మెంట్‌కి అప్లికేషన్ పెట్టిన రోజు ఎలాంటి బాధ కలగలేదు. రిటైర్‌మెంట్ దగ్గరవుతున్న క్షణాల్లో ఆరంభం అయింది 'పెయిన్'. ఎంత దుఃఖం విరుచుకుపడిందో... ఆనంద విషాదాల నడుమ 'కారులో' ఇంటి దగ్గర సగౌరవంగా దింపి వెళ్ళిపోయాక మధుని పట్టుకుని భోరున ఏడుస్తుంటే మాటలురాని ఆమె స్పర్శతో ఊరడించటం ఎలా మరపుకొస్తుంది.

"ఉద్యోగాన్ని అంత ప్రేమించారా"

"అది నాకు సరికొత్త జీవితాన్నిచ్చింది. ఇప్పటి ధైర్యాన్నిచ్చింది. ఈ దుఃఖమంతా ఆ కృతజ్ఞతే"

ఏదో శబ్దం. కళ్ళు తెరిచాను. కిటికీ పక్కన సీట్‌లో అతను తన బ్యాగ్ వుంచాడు. ముఖం చాలా రఫ్‌గా వుంది. బుగ్గమీద చిన్న కత్తిగాటు. నాకేసి చూసి నవ్వాడు. నవ్వు ఇంత భయంకరంగా వుంటుందా?

"మద్రాసు ఎన్ని గంటలకి వెళ్తుంది?" హిందీలో అడిగాడు.

"రైట్ టైమ్ తొమ్మిదిగంటలు"

టికెట్ తీసి చూపించాడు. "వెయిటింగ్ లిస్ట్‌లో వుంది. టీ.సీ. సాబ్ ఇక్కడ కూర్చోమన్నాడు" ఇంకేం మాట్లాడాలో తెలియక సిగరెట్ పెట్టె తీశాడు. ఓ సిగరెట్ నోట్లో పెట్టుకుని లైటర్‌తో వెలిగిస్తుంటే ముఖం ఎర్రగా వెలిగింది. గుండెల నిండా గాలి పీల్చి బయటకు వదిలాడు.

తమిళ యువతి పుస్తకం నుండి చివ్వున తలెత్తింది.

"నో స్మోకింగ్ ప్లీజ్" ముఖం చిట్లిస్తూ అంది.

అతనేం లెక్కచేయనట్లు "కిటికీ నుండి బయటకు పోతుంది" అని కిటికీ పక్కకు తిరిగాడు. ఓ క్షణం ఆ చూపులో నిరసన.

అద్దం పైకెత్తి పుస్తకంలోకి తొంగిచూస్తూ నాకేసి చూసింది. 'ఈ దేశంలో క్రమశిక్షణ ఎప్పటికైనా వస్తుందా?' అనడిగినట్లనిపించింది.

టీ.సీ. మా సీట్ల దగ్గరకొచ్చాడు. నేనూ మిగతావారితో పాటు టిక్కెట్ ఇచ్చాను.

"కూర్చోండి. నేను వచ్చి రాసిస్తాను" అని పక్కకి వెళ్ళిపోయాడు.

అంటే మరికొంతసేపు టెన్షన్ తప్పదు. పుస్తకం చదువుకుందామని బ్యాగ్ నుండి తీశాను. నా ఎదురుగా వున్న తమిళ యువతి ఆ పుస్తకం కేసి చూసింది. అడిగి తీసుకుంటుందా అనుకున్నాను. అయితే ఆ కళ్ళలో మీకు ఆంగ్లం వచ్చా అనే భావం వుందనిపించింది. చదువుదామని లోపలకు తొంగిచూశాను. కానీ మనసిక్కడ లేదు.

ఇంతకూ క్లైమాక్స్ ఏం చేసుంటారు? వయ్‌లెంట్ ఫైట్స్‌తో ముగుస్తుందా? ఎమోషనల్ డ్రామానా?

సినిమా చివర్లో లేచిపోయేవారు ఎమోషనల్ డ్రామాని మాత్రం కూర్చుని చూడగలరా? వారిని పరుగులు తీయిస్తున్న అంశాలేమిటి? అసలు మనుషుల్లో సెంటిమెంట్, ఎమోషన్ లాంటివి వుంటాయా? అదృశ్యం అయిపోతాయా?

వెనక తిరిగి కోలాహలం. పుస్తకం మూసి వెనక్కి తిరిగాను. బురఖాలు ధరించిన ముస్లిం యువతులు కనిపించారు. నా కళ్ళు అలా తెరుచుకునేవున్నాయి. సంస్కారం కాదని తెలుసు. అయినా చూపు మరల్చుకోలేకపోతున్నాను. ముఖం మీద బురఖా తీసి వేశారు. వెన్నెల రాత్రి చందమామల్లా వున్నారు ఇద్దరూ.

తాము తెచ్చుకున్నవాటిని పిల్లలకూ పెద్దలకీ అందిస్తున్నారు. బెర్త్‌మీదకి చూశాను. వాళ్ళకి చెందిన మనిషి కాబోలు, ముఖంలో మీసాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

అందులో ఓ అమ్మాయి నాకేసి చూసింది. అప్పటివరకూ నవ్వుతున్న ఆమె కళ్ళు ఒక్కసారిగా చిన్నబోయాయి. వాటిలో ఏదో భయం. నాకెందుకో ఇంక ఆమెను చూడాలనిపించలేదు. ఎందుకలా క్షణాల్లో మారిపోయింది?

ఆ భయం ఎందుకు?

నేనంత క్రూరంగా కనిపిస్తున్నానా?

నా ఆలోచలనకి నాకే నవ్వొచ్చింది. ఇంతకుముందే బెర్త్‌మీద మనిషిని చూడగానే అదో రకమైన ఫీలింగ్ కలిగింది. అది భయమా? అనుమానమా? ఇంకేమన్నానా?

అసలెందుకు కలగాలి ఏ భావమైనా?

నాకు 'ముంతాజ్' గుర్తొస్తోంది.

'ముంతాజ్' అంటే రెండున్నర దశాబ్దాల వెనక్కి పరుగులు తీయటం.

నల్లటి ఆ కళ్ళు ఇప్పటికీ గుర్తే. వాళ్ళ నాన్న 'మస్తాన్'. అమ్మ పేరు తెలియదు. అందరూ 'బూబమ్మ' అనేవారు. మొత్తం అప్పటికి ఏడుగురు ఆడపిల్లలు. అందరి పేర్లూ గుర్తుండేవి కావు. ఒక్క 'ముంతాజ్' పేరు మాత్రమే నోట్లో నానేది.

'బూబమ్మ'ని నేను చూసిన ప్రతిసారీ కడుపుతో వుండటం గానీ, చిన్నపిల్లని చంకన వేసుకుని గానీ కనిపించేది.

"మా అమ్మ కొంచెం పచ్చడి అడిగి తీసుకురమ్మంది" అంటూ ఏ భోజనపు వేళలోనో ముంతాజ్ వచ్చేది. అలా అడుగుతున్నప్పుడు సిగ్గుపడేది. మగపిల్లలుంటే తల పైకెత్తేది కాదు. కొంతమంది 'చింతకాయ తొక్కు' ఇచ్చేవారు.

"పాపం తినాలనిపించే సమయం. ఇంతమంది పిల్లల్తో కడుపునిండా తినటమే కష్టం" అనుకునేవారు ఆడవాళ్ళు.

ఆడపిల్లలందరూ ఒకరి తర్వాత ఒకరు రకరకాల ఎత్తుల్లో తమాషాగా కనిపించే వారు. అందరూ ఎవరో ఒకరి ఇంటిలో అంట్లు తోమటం, పాచిపని, బట్టలు గుంజటం చేసేవారు. మిగిలిపోయిన అన్నం తీసుకుపోయేవారు.

"ఇదిగో ఇక్కడే తిను. ఇంటికెళ్తే మీ అమ్మానాన్నలకి పెడతారు. మీరు తినాల్సిన వయసిది" అంటుంటే ముంతాజ్‌తో పాటు వాళ్ళ అక్క చెల్లెళ్ళు అర్థం అయ్యారు. అమ్మా నాన్నలంటే అంత ప్రేమ.

ఆ కాలనీలో అన్ని కులాలున్నాయి. రకరకాల ఆర్థికపరిస్థితుల వారున్నారు. ఎటు చూసినా విస్తరించిన మైదానం వుంది. దిబ్బలమీద చెట్లున్నాయి. దూరంగా పంటచేలున్నాయి. వాటికవతల పంటకాలవ మీదకి ఆకాశం వంగినట్లుండేది. సాయంకాలాలు పిట్టలగుంపులు షికారుకెళ్లేవి. మబ్బులన్నీ గొప్ప చిత్రకారుడి మాట వినే రంగుల్లా కనిపించేవి.

మైదానంలోకి పిల్లల గుంపు చేరిపోయేది. ఆటలే ఆటలు. ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తే ఇంటిదగ్గర పని వదిలి ముంతాజ్ పరుగులు తీసుకుంటూ వచ్చేది.

ముంతాజ్‌ని చూస్తే పిల్లల నోట్లో నుండి ఉర్దూ పదజాలం ఉబికివచ్చేది. ఆ మాటలు వింటున్నప్పుడు ముంతాజ్ పగలబడి నవ్వేది. ఎప్పుడన్నా ఉర్దూలో ఏదో అని కోపంగా వెళ్లిపోయేది. పిల్లలందరూ ఆ మాటల కర్థం తెలుసుకుంటానికి చర్చలే చర్చలు.

అందరం నవ్వుకునేవాళ్ళం.

రాత్రి పడుకోబోయే ముందు ముంతాజ్ గుర్తొచ్చేది. వారి పూరిల్లు గుర్తొచ్చేది. రాత్రి పన్నెండుగంటలదాకా సందడే సందడి. పిల్లలు ఆకలితోనో బాధతోనో ఏడుస్తుండే వాళ్ళు. 'బూబమ్మ' ఎప్పుడూ పిల్లల మీద పెట్టి భర్తను తిట్టుకుంటుండేది. ఆమె నడుముకో సంచి, దానిలో ఆకులూ, వక్కలూ వుండేవి. రోజంతా పాన్ నములుతూనే వుండేది. పళ్ళు గారపట్టి నాలుక ఎర్రగా పండివుండేది. ఆ బట్టలు కూడా నాలుగు రకాల అతుకులుకుట్టిన 'బొంత'ల్లా వుండేవి.

ముంతాజ్ అక్క పెళ్ళి జరగటం నాకింకా గుర్తుంది. బూబమ్మా, మస్తాన్ అందరి ఇళ్లకూ వచ్చి పెళ్ళికి రమ్మని ఆహ్వానించారు.

"మీరేనమ్మా నాకు బంధువులు. ఒకచోట కలిసి బతుకుతున్నాం. 'ధావత్'కి తప్పకుండా రావాలి" అన్నాడు మస్తాన్.

ఓ పెద్దావిడైతే "మస్తానూ ఇంక బూబమ్మని పిల్లల్ని కనటం ఆపమని చెప్పవయ్యా ఆరోగ్యం పాడైపోతుంది. ఇంతమంది పిల్లల్ని ఎలా పైకి తీసుకువస్తారు. తనకేమన్నా ఆయిందనుకో కుటుంబం ఏమవుతుందో ఆలోచించుకో"

బూబమ్మ లేని ఆ కుటుంబాన్ని నేను ఊహించుకుంటానికే భయపడేవాడ్ని.

మస్తాన్ కోపం తెచ్చుకునేవాడు కాదు. ఆ ముఖంలో ఎప్పుడూ చిరునవ్వే ముఖ్యంగా  మాంసం కొట్టేటప్పుడు చూడాలి. పక్కనే బూబమ్మ వుండేది లేదా ముంతాజ్. ఆదివారమైతే చాలు. ఎక్కడెక్కడి నుంచో జనం వచ్చేవారు. కొంతమంది త్వరపడేవారు.

ఇంకొందరు అన్నీ ఎముకలే, మెత్తటి మాంసం కావాలనేవారు. వారందరికీ సమాధానం చెప్పడం, ఎవరూ నొచ్చుకోకుండా ఎముకలూ, మెత్తటి మాంసం సమంగా ఇవ్వటం నన్ను ప్రత్యేకంగా ఆకర్షించేవి.

చదువుకోకపోయినా డబ్బు తీసుకుని చిల్లర ఇచ్చే ముంతాజ్‌కేసి చూసేవాడిని. నేను మాంసం తెచ్చేటప్పుడు మస్తాన్‌ని అడిగి రెండు మూలిగలు వేయించి నవ్వేది.

ఆ అమ్మాయి తొడుక్కున్న బట్టలన్నీ ఎవరో ఒకరు ఇచ్చినవే. చిరిగిపోయిన వాటిని కుట్టుకుని తొడుక్కునేది. వాళ్ళ అక్క పెళ్ళికి మాత్రం అద్దాలు వేసి కుట్టించిన లంగా, జాకెట్ వేసుకుంది.

ఆ రోజు వెన్నెల విరగకాసింది. ఎక్కడెక్కడి నుండో వాళ్ల చుట్టాలు వచ్చారు. అందరూ గలగలా మాట్లాడుకుంటున్నారు. పూలగుట్టల్లా ఆడపిల్లలంతా ఆ వెన్నెల్లో చెమ్మచెక్క ఆడారు. ఆ ప్రాంతమంతా పలావు వాసన. మస్తాన్ రెండు వేటలు కోశాడనుకున్నారు.

మేమందరం భోజనానికి వెళ్ళాం. వేడి వేడి పలావ్. ముందు మస్తాన్ వచ్చి పేరు పేరునా పలకరించి స్వయంగా మాంసం కూర వడ్డించి వెళ్ళాడు. ఆ తర్వాత ముంతాజ్ వచ్చింది. నా కళ్ళల్లోకి చూసి ఇంకొంచెం వడ్డిస్తోంటే "చాలు చాలు" అంటున్నాను.

ఒక్కటే నవ్వు... వెనకాల నుండి ఎవరో అరుస్తున్నారు. జాగ్రత్తగా వడ్డించమని. కొందరైతే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఆ రాత్రి చాలాసేపు ఆరుబయట మంచాలు వేసుకుని ఆడవాళ్లంతా పలావ్ గురించి మాట్లాడుకోవటమే.

అందరూ తలా కొంచెం డబ్బులు వేసుకున్నారు బూబమ్మని పిలిచి నీకు ఏం కావాలో చెబితే అది కొనిస్తాం అన్నారు.

ముంతాజ్ భోజనం అయ్యాక రెండు ఆకులకి సున్నం రాసి వాళ్లమ్మ సంచిలో నుండి ఓ పెద్ద పండొక్క తీసుకొచ్చి రహస్యంగా నా చేతిలో పెట్టింది.

నోరంతా ఎర్రగా పండటం చూసి– "ఏంటిరా కిళ్ళీ ఇచ్చారా. మా కివ్వలేదే" అని కొంతమంది అడిగారు.

"లేదు. రెండాకులు దొరికితే సున్నం రాసుకున్నా" అన్నానేగాని ముంతాజ్ ఇచ్చిందని మాత్రం చెప్పలేదు.

ముంతాజ్ వయసెంతో నాకు తెలియదు. నాకంటే ఎత్తుగా వున్నట్లనిపించేది. బహుశా నా కంటే పెద్దదికూడానేమో. మేం మాట్లాడుకున్న సందర్భాలు తక్కువే. 'శేఖర్‌బాబూ' అనేది.

మగపిల్లలందరితో కలిసి గోళీలు ఆడేది. కర్రా – బిళ్ల ఆడేది. పోట్లాడుతుండేది. తనేం చేస్తున్నా నాకు ఆశ్చర్యం కలిగేది. చాలాకాలందాకా జాకెట్లు వేసుకునేది. అవి నడుముదాకా వుండేవి. నాకు ఇప్పటికీ గుర్తు. వెంకట్రావుగాడు ఓ సెక్స్ పుస్తకం సంపాదించి రహస్యంగా నా దగ్గరకొచ్చాడు. "నాతో వస్తే నీకో వింత చూపిస్తా" అన్నాడు.

ఇద్దరం పరుగులు తీసుకుంటూ వెళ్ళాం. ఇంకెవరూ లేరనుకున్నాక రొప్పుతూనే పుస్తకం తీసిచ్చాడు. అందులో వింతేం వుందో నాకు అర్థంకాలేదు.

"బుక్కా" అన్నాను.

"బుక్కంటే బుక్కు కాదు. చదివి చూడు" అన్నాడు.

నేను రెండు పేజీలు చదివి "ఛీ" అని విసిరేశాను.

వెంకట్రావ్ పగలబడి నవ్వాడు.

ఆ పుస్తకం అందుకుని కొన్ని బూతు మాటలు చదివి వినిపించి మళ్ళీ నవ్వాడు. నాకు కూడా నవ్వు వచ్చినా అంతకుమించి సిగ్గుగా అనిపించింది.

వెంకట్రావుకి తెలుగు బొత్తిగా రాదు. కథల పుస్తకాలు చదవటం అంటే బొత్తిగా ఇష్టం వుండదు. అలాంటిది ఏకంగా ఈ బూతుపుస్తకం ఎక్కడ సంపాదించాడోగాని, మొదటిసారిగా నాలో సరికొత్త ఆలోచనల్ని రగిలించాడు.

ముంతాజ్ గుండెలకేసి మొదటిసారి చూడటం అదే. అప్పటివరకూ మైదానంలా అనిపించిన ఆ ప్రదేశంలో ఏదో మార్పు. ఆమెలో ఏదో పరిణత. ఎక్కువసేపు చూడలేక పోయాను. సిగ్గు, భయం. మేం చిన్న పిల్లలమే కదాని కొంత మంది ఆడవాళ్లు కొన్ని విషయాలు స్వేచ్ఛగా మాట్లాడుకునేవారు.

"ముంతాజ్‌కి ఓణీలు వేసుకునే టైమొచ్చింది. ఇది రేపో మాపో పెద్దదైపోతుంది" అనటం నేను విన్నాను.

ఆడవాళ్లు ఎందుకంత త్వరగా పెద్దవాళ్లవుతారో అర్థం అయ్యేదికాదు. ముంతాజ్ అక్క పుట్టింటికి వచ్చింది. ఆ అమ్మాయి 'కడుపుతో వుంది' అనుకునేవారు. బూబమ్మకి కూడా మరలా గర్భం. వారిని చూసి ముంతాజ్ కళ్ళు అప్పుడప్పుడు భయంతో కుంచించుకుపోయేవనుకుంటాను.

ఓ రోజు ముంతాజ్ పాత ఓణీ వేసుకుని వచ్చింది. నడకలో, చూపులో, కళ్ళల్లో ఏదో మార్పు. అప్పటిదాకా మగపిల్లల్తో పోటీలు పడిన ముంతాజ్ పని అయిపోగానే మౌనంగా వెళ్ళిపోయేది.

ఇంకొద్దిరోజుల్లో మా అందరినీ విడిచి పెళ్ళిపోతుందేమోననే దిగులు.

ఎదిగీ ఎదగని వయసులో ఓ రోజు కల.

నేనూ, ముంతాజ్ ఎదురెదురుగా కూర్చున్నాం.

మా వెనకా, ముందూ మైదానం తప్పించి ఎవరూ కనిపించటంలేదు.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం ముంతాజ్" అన్నాను.

నవ్వింది–కాలి వేళ్ళు నేలకు రాస్తూ.

"నీకు పెళ్ళయిపోతుంది కదూ"

"అవును"

"మా అందరినీ విడిచిపెట్టి వెళ్ళిపోతావ్ కదూ"

"వెళ్ళాలిగా"

"నువ్వుకూడా మీ అమ్మలా పిల్లల్ని కంటావా?"

ముంతాజ్ నా కళ్ళల్లోకి సూటిగా చూసింది. ఆ తర్వాత తలదించుకుని అంది– "అది నా చేతుల్లో వుండదుగా"

"అవును కదూ. మన చేతుల్లో ఏదీ వుండదు. నేనైతే ఇద్దరుపిల్లల కంటే ఎక్కువ మందిని కనను"

ముంతాజ్ పెద్దగా నవ్వేసింది.

"ఎందుకు నవ్వుతున్నావ్"

"నువ్వు పెళ్ళిచేసుకుంటావా శేఖర్‌బాబూ"

"ఎందుకు చేసుకోను"

"పెళ్ళాన్ని ఎలా పోషిస్తావ్" అంది.

నాకేం చెప్పాలో తెలియలేదు. కలల్లో కూడా ఇలాంటి అనుమానాలు ఎందుకెదురవుతాయో ఇప్పటికీ నాకు అర్థం కాదు. గొప్ప అనుభూతికరమైన కలతోపాటు గుండెలు కలుక్కుమనే వాస్తవికత పక్కన వుంటుంది.

"ఊరికే అన్నాను. నీకేంటి బాబూ నువ్వు బాగా చదువుకుంటావ్. పెద్ద ఉద్యోగం వస్తుంది. నేను ఎటో వెళ్ళిపోతాను. నేను నీకు గుర్తుంటానా" అంది.

ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు.

నాకు దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"నిన్నెలా మరచిపోగలను ముంతాజ్. నేను పేదవాడినే. జీవితం నాకు భయానకమే. అయినా కూడా నువ్వు పక్కనుంటే ఎదుర్కోగలను. నాకైతే నీకోసం మతం మారాలనుంది. నిన్ను 'నిఖా' చేసుకుని నీతో కలసి జీవితాన్ని గడపాలనుంది. ఎందుకిలా పుట్టానో తెలియదు. నేను కూడా మీలో పుట్టుంటే ధైర్యంగా మస్తాన్ దగ్గరకెళ్ళి అడిగివుంగేవాడ్ని"

ముంతాజ్ నవ్వింది.

"నీ మాటలు బాగున్నాయి. సినిమాల్లో ఇట్లాగే మాట్లాడుకుంటారు. మీది, మాది వేరే మతం. ఇది కుదరదు"

"మనందరం ఒకచోట బతుకుతున్నాం. మనిద్దరం ఒకచోట బతికితే ఏమౌతుంది?"

"ఏమో నాకు తెలియదు. ఇవన్నీ ఎవరో పెట్టారు" అంది దిగులుగా.

కల తెగిపోయింది. ముంతాజ్ లేదు.

మైదానం లేదు. బుడ్డి కూడా ఆరిపోయింది. చెమటలు పట్టాయి. అప్పటికప్పుడు వెళ్ళి ముంతాజ్‌ని చూసి రావాలనిపించింది. ఈ సమయంలో నిద్రపోతుంటుందా, తనకీ ఇలాంటి కలే వచ్చుంటుందా అనుకున్నాను. ఆ రాత్రి ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. కొద్దిరోజులకే ముంతాజ్ పెళ్ళి అని వినగానే బాధ. అందరూ ముంతాజ్‌ని చూసి పెళ్ళి కళ వచ్చిందనటమే. ముంతాజ్ భర్తకి సైకిల్ రిపేర్ షాపు

వుందట. కట్నంగా కొన్ని వందల రూపాయలు. ఖర్చంతా బిరియానీకే. అప్పుడే ఆ ఇంట్లో రెండోసారి 'ధావత్'కి వెళ్ళటం.

మల్లెపూల దండని ముంతాజ్ కట్టినప్పుడే చూడాలి. జనవరి నెలంతా రంగురంగుల బట్టలు తొడుక్కున్న ఆడవారి నడుమ ముంతాజ్ పెడుతున్న ముగ్గుల్ని చూడాలి. అందరికీ గొబ్బెమ్మలు ఇచ్చే ముంతాజ్‌ని చూడాలి. రాత్రిపూట అప్పుడప్పుడూ కాసింత మందు పుచ్చుకొని ఆరుబయట మస్తాన్ పాడుతున్నప్పుడు ఆడపిల్లలంతా నవ్వుల్లో మునిగినప్పుడు చూడాలి...

జిస్ దేశ్ మే గంగా బహతీ హై...

ఈ దేశంలో గంగ పరుగులు తీస్తుంది...

గంగ... ముంతాజ్...కాలం...

అన్నీ కరిగిపోయాయి.

ముంతాజ్ పెళ్ళి జరిగిన రాత్రి ఆమె చెల్లెలు ఆనందంతో నాట్యంచేసింది. ఆ అమ్మాయిలోనూ ఏదో అందం. ఆ అమ్మాయి కూడా అచ్చంగా ముంతాజ్‌లానే ఎవరింటికో వెళ్ళిపోతుంది. ముంతాజ్ వదిలిన పనులు ఆ అమ్మాయి స్వీకరించింది.

'ధావత్' నాడు భోజనం చేయాలనిపించలేదు. మొదటి పెళ్ళినాటి ఉత్సాహం మస్తాన్‌లో లేదు. ఆ రోజు ఇంట్లో ఎవరెవరో అరుచుకుంటున్నారు. ఒక వేట మాత్రమే కోశారేమో అతి జాగ్రత్తగా వడ్డిస్తున్నారు. అంతా పులుసు. ముక్కలున్నా కూడా తినేవాడ్ని కాదు. భోంచేశాక ఆకుకి సున్నం రాసిచ్చినవారు లేరు.

ఉదయమే వెళ్తూ చెప్పటానికొచ్చింది. ముంతాజ్ కళ్ళల్లో దిగులు. బలవంతాన దుఃఖాన్ని ఆపుకుంటోంది. 'వెళ్ళొస్తా'నన్నట్లుగా నా కళ్ళల్లోకి చూసింది. 'నన్ను మర్చిపోవుకదా' అంటున్నాయి కళ్ళు. ముంతాజ్ ముఖం మీదకి 'బురఖా' జారింది.

ఎలా మర్చిపోతాను ముంతాజ్? నీ ఆటల్ని మరిచిపోను. నువ్వు వెన్నెల్లో చెప్పిన గజల్స్‌ని మర్చిపోను. నీ పేదరికాన్ని మర్చిపోను. నీ మొగుడు నిన్ను పువ్వుల్లో పెట్టుకుని చూస్తాడా... తాగొచ్చి నీ శరీరం కందిపోయేలా దెబ్బలు కొడతాడా అనే సందేహాన్ని మర్చిపోను.

నువ్వు లేవు. ఈ మైదానం లేదు. ఈ ఊరు నాకో స్వప్నం. ఇక్కడ కరిగిపోనివి జ్ఞాపకాలు. మరణం లేనివి ఒకే కుటుంబంలా అందరం జీవించిన మధురక్షణాలు. మన సంతోషాలు అందరివీ. మన బాధలు అందరివీ. అలాంటి తియ్యటి రోజులు తిరిగి రావాలి ముంతాజ్ తిరిగి రావాలి.

అందరం పగిలిన పెంకుల్లా చెదిరిపోయాం. మస్తాన్, బూబమ్మ, పిల్లలూ–మిత్రులూ... చెట్లూ... మైదానం ఏకాంతంలో పలకరించే నేస్తాలు.

"ఐ లవ్ మై ఇండియా" ఎవరో పాడుతున్నారు.

జ్ఞాపకాలు తెగిపోయాయి.

ఎదురుగా వున్నతను పాడుతున్నాడు. ఆ పదాలు వింటుంటే శరీరం ఉప్పొంగుతోంది. మస్తాన్ గుర్తొచ్చాడు.

"జిస్ దేశ్ మే గంగా బహతీ హై"

ఏభై సంవత్సరాల ప్రయాణం. అప్పుడూ ఇప్పుడూ దేశాన్ని ప్రేమించటం అనే భావన ఎంత ఉత్తేజాన్నిస్తుంది! నాకెందుకో వెనక్కి తిరిగి చూడాలనిపించింది.

యథాలాపంగా తిరిగినట్లు వెనక్కి తిరిగాను.

వారి కళ్ళల్లో ఎంత ఆనందమో!

ఆనందమేనా?!

టీ.సీ. ఏమైపోయాడో కనిపించటం లేదు. ఇంతకీ బెర్త్ దొరుకుతుందా? అరగంట పోయాక వచ్చి 'సారీ మాస్టారూ, వచ్చే స్టేషన్లో జనరల్ కంపార్ట్‌మెంట్‌కి వెళ్ళండి' అంటాడా?

"కాఫీ... కాఫీ..." అంటూ వచ్చాడు.

ఎదురుగా వున్నతను కాఫీ ఇమ్మన్నాడు.

"ఓసారి ఆ బుక్ ఇస్తారా" అనడిగింది ఆంగ్లంలో.

ఇచ్చాను. 'లిటరరీ క్రిటిసిజం' అనే పుస్తకం అది.

పేజీలు తిరగేసి అడిగింది.

"మీ మాతృభాష ఏమిటి?"

"తెలుగు"

"మీ భాషలో సాహిత్యం ఎలా వుంది?"

"అంటే కథ... నవల... కవిత్వం–దేని గురించి చెప్పమంటారు?"

"టోటల్‌గా"

"బాగానేవుంది. సీరియస్ లిటరేచర్ బాగానే వస్తోంది. పారలల్‌గా కమర్షియల్‌గా రాస్తున్నవారున్నారు"

"క్రిటిసిజం ఎలా వుంది?"

"ఇందులో బోల్డన్ని దుకాణాలున్నాయి. ఎవరికి కావలసిన వారిని వారు పైకి తెచ్చుకుంటారు. ఓ ప్రక్రియలో రాసేవాడు మిగతా ప్రక్రియల్ని విమర్శిస్తాడు. ముఖ్యంగా కథల, నవలల పోటీకి న్యాయనిర్ణేతలుగా వుండేవారికి బోల్డంత సౌకర్యం. కొందరు భలే రెచ్చిపోయి కామెంట్స్ చేస్తారు. తమాషా ఏమిటంటే ఆ నాలుగు ముక్కలే సుందర ముదనష్టంగా వుంటాయి. సాహిత్యం బాగుపడాలని ఫేషనబుల్‌గా అనటం తప్పించి నిర్మాణాత్మకంగా విమర్శించే వారు అరుదుగా దొరుకుతారు. మీ సాహిత్యం ఎలా వుంది?"

"దేశమంతా ఒకటే పరిస్థితనుకుంటాను" అందామె నవ్వుతూ.

"మీ పేరు"

"శివశంకరి"

"ఫేమస్ రైటర్ శివశంకరేనా" అన్నాను.

"కాదు" అంది.

మా సంభాషణంతా ఆంగ్లంలోనే సాగుతోంది.

"మీ సినిమాలు ఎలా వుంటున్నాయి?" అన్నాను.

"నాట్ బాడ్. కొంతమంది యంగ్‌స్టర్స్ వస్తున్నారు. టేకింగ్ బాగుంటుంది. కానీ కాన్సెప్ట్ రీత్యా ఎంత వరకు ముందుకెళ్తున్నారనేది అనుమానం. ప్రేమకథా చిత్రాలు... లేకపోతే వయొలెన్స్... ఈ రెండు ట్రెండ్స్ నడుస్తున్నాయి. ఓ రకంగా కొద్దిపాటి సంతోషం. ఎందుకంటే పొయిటిక్ వే ఆఫ్ ఎక్స్‌ప్రెషన్‌కి కొందరు ప్రాధాన్యం ఇస్తున్నారు" అందామె.

టీ.సీ. మరలా వచ్చి బెర్త్ నెంబర్‌ల కేసి చూస్తుంటే నేను ఆయన దగ్గరికి వెళ్ళాను.

"ఇస్తాను. చూస్తున్నా. మీరు మద్రాసు దాకా వెళ్ళాలి కదా కూర్చోండి" అని ముందుకు వెళ్ళిపోయాడు. కనీసం రెండు మూడు కంపార్ట్‌మెంట్స్‌ని చూసుకుంటున్నాడేమో!

తిరిగి వచ్చి కూర్చున్నాను. కాఫీ తాగిన మిత్రుడు తిరిగి సిగరెట్ వెలిగించి అటు తిరిగాడు. ఆ అమ్మాయి ముఖంలో కోపం కనిపించింది.

"చూడండి ఆ మనిషి... ఇందాక వద్దని చెప్పాం. మళ్ళీ మొదలుపెట్టాడు. కనీసం డోర్ దగ్గరికి వెళ్ళి తాగొచ్చు. పాట చూడండి ఎంత గంభీరంగా పాడాడో" అంది.

నాకు నవ్వొచ్చింది. అతను అటు తిరిగి వున్నాడు. విన్నాడో లేదా వింటే అర్థమైందో లేదోగాని మహదానందంగా సిగరెట్ తాగుతున్నాడు. రైలు ముందుకు పోతూనే వుంది.

"డిసెంబర్ మంత్ అంటే అన్నీ కూల్చటమేనా" అంది శివశంకరి అకస్మాత్తుగా.

అతను సిగరెట్ విసిరేసి మాకేసి తిరిగాడు.

"అవునండి. నిన్న పార్లమెంట్ కూలిపోయింది. రేపు బాబ్రీమసీదు కూల్చేసిన రోజు"

అప్పటికిగాని గుర్తుకురాలేదు. ఒక్కో కూల్చివేత వెనక ప్రజలు చెల్లించాల్సిందేమిటో ఎప్పటికప్పుడు అనుభవంలోకి వస్తూనేవుంది. మనుషుల విషయం వదిలేస్తే ప్రకృతికి కూడా నవంబర్, డిసెంబర్ మాసాలంటే ప్రత్యేకమైన ఇష్టం కావచ్చునేమో... అతివృష్టి, తుఫాన్లు ఈ నెలల్లో కోస్తాని అతలాకుతలం చేస్తున్నాయి.

భాగ్యనగరంలో ఈ సంవత్సరం వానలు లేవు. వేసవికాలం మంచినీటి ఎద్దడిని భరించాలి. ఇంక పెరుగుతున్న ధరలకి తోడు ఈ ఎన్నికలు... అరాచకాలు– వీటన్నింటికీ అలవాటుపడిపోయామా...!

శివశంకరి అదే అంది.

"యస్. మనం ప్రతిదానికి ఎడ్జస్టవుతున్నాం. ఫైట్ చేయటం మర్చిపోయాం. అలాంటి పనుల్నీ కొంతమందికి వదిలేసి వేరే ప్రపంచంలోకి పరుగులు తీస్తున్నాం. గతంలో కొన్ని లక్షల అవినీతి అంటే కంగారు పడిపోయేవాళ్ళం. అలాంటిది వందల, వేల కోట్ల కుంభకోణాలు బయటకొస్తున్నా కనీసం నిరసన తెలపలేకపోతున్నాం. జాతి నరనరంలోనూ అవినీతిని ఇంజెక్ట్ చేశారు. సినిమాల్లో మాత్రం 'ఐ లవ్ మై ఇండియా' అంటూ పాటలు. దేశభక్తి, విప్లవం అన్నీ బాక్సాఫీస్ పాయింట్లే"

ఆమె ఆవేదనని నేను అర్థం చేసుకోగలను. సినిమాల వారు వాటిని ఎందుకు వినియోగించుకున్నా కొంతమంది ప్రేరణ పొందుతారని నేననుకుంటాను.

నా పుస్తకం నాకు ఇచ్చేసింది.

"చదవండి" అన్నాను.

"సీరియస్‌గా చదవాల్సిన పుస్తకం. ఇలా ప్రయాణాల్లో కాదు. ఇంతకీ మీకు టిక్కెట్ కన్‌ఫర్మ్ కాలేదు కదా" అంది.

"ఇస్తానంటున్నారు. చూద్దాం"

"ఇంతకీ మీరేం చేస్తుంటారు?"

"సినిమాలకు కథలు రాసే ప్రయత్నంలో వున్నాను"

ఆమె నాకేసి ఆశ్చర్యంగా చూసింది. "అలాంటప్పుడు లిటరరీక్రిటిసిజమ్ ఎందుకు. ఏ ఇంగ్లీష్ నవలో తెచ్చుకోవచ్చుకదా"

"అది వృత్తి, ఇది ప్రవృత్తి" అన్నాను.

"కావచ్చు. మీరు ఏదో ఒకదాని మీద దృష్టి పెట్టడం మంచిది. ఈ పుస్తకం కోసం వెచ్చించే టైమ్‌ని సినిమా కథల కోసం ఉపయోగించుకోవచ్చు. అంతగా అయితే ఫిల్మ్ క్రాఫ్ట్‌మీద బుక్స్ స్టడీ చెయ్యండి. మీకు ఉపయోగపడతాయి"

ఆమె మాటలు ఆలోచింపచేసే విధంగా వున్నాయి.

కొత్త రంగంలోకి వచ్చినప్పుడు ఆ రంగాన్ని బాగా ఆకళింపు చేసుకోవటం అవసరం. అయితే నన్ను విడిచిపెట్టటం లేదు– ఆ తపన. కథలూ, నవలలూ రాయలేకపోతున్నాననే బాధ పెరిగిపోతోంది. ఆ విషయం చెబితే, పోనీ అవే రాసి ఈ పని మానేయండి అంటుందేమో!

"ఇంతకీ మీరేం చేస్తున్నారు?" అన్నాను.

"పి. హెచ్. డి చేస్తున్నాను" అంది.

"సబ్జెక్ట్ ఏమిటి?"

"ఫెమినిస్ట్ లిటరేచర్ ఇన్ తమిళ్ లాంగ్వేజ్"

కొంచెంసేపు ఆమె అక్కడి రచయిత్రుల గురించి, వారి రచనల గురించి చెప్పింది. అలాగే ఇక్కడి రచయిత్రుల గురించి అడిగి కొన్ని వివరాలు తెలుసుకొంది.

మేం మాట్లాడుకుంటుంటే ఎదురతను సీరియస్‌గా వింటున్నాడు. నేనతని కళ్లల్లోకి చూశాను. అతను లేచి టాయిలెట్ వైపు కెళ్లాడు. అప్పుడు చూశానా బ్యాగ్‌ని. ఏవేవో ఇంగ్లీష్ అక్షరాలు. దాని ఆకారం చూస్తుంటే అందులో ఏదో వుందనిపించింది. ఆ 'ఏదో' గురించిన ఆలోచన పెరిగి పెద్దదవుతుండగా అతను వెళ్ళిన వైపు చూశాను. కనిపించలేదు.

లేచి వెళ్ళాను. టాయ్‌లెట్ తలుపు తీశాను. రెండోది మాత్రం రాలేదు. బహుశా అతనే వుండుంటాడు. అతనేనా? ఇంకెవరైనానా? ఇంకెవరైనా అయితే అతను ఎక్కడి కెళ్ళాడు? పక్క బోగీలోకి మారాడా? ఇంక తిరిగి రాడా?

అనుమానం... అందులోనూ శివశంకరి గుర్తుచేశాక ఇంకా బలపడింది. రేపు డిసెంబరు ఆరు. చరిత్రలో ఓ దుర్దినం. ఆ ప్రకంపనలు సంవత్సరాల నుండి సంవత్సరాలకు పాకుతాయా... ఈ సుదీర్ఘ ప్రయాణంలో దేశభక్తి నుండి మానవతా రాహిత్యం దాకా వచ్చేశామా– అదే నిజమైతే ఈ క్షణం నుండి ప్రతీదీ అనుమానమే.. అంటే శివశంకరి సైతం...!

* * *

రైలు పరుగులు తీస్తూనే వుంది.

అందరూ కబుర్లలో పడ్డారు.

శివశంకరి పక్కన కూర్చున్న మహిళకి నలభైఅయిదు సంవత్సరాల దాకా వుండొచ్చుననిపించింది. ఆవిడని పలకరించటానికి ఇంకొకావిడ వచ్చారు.

"రండి రండి" అంటూ ఆహ్వానించింది.

"మీవారేరి?" అందామె.

"కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎన్నిసార్లు చెప్పినా ఆ తలుపు దగ్గర నిలబడం మానరు" అంది.

మెల్లగా వారు చీరల గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ తర్వాత వచ్చినావిడ ఎవరి గురించో అడిగింది. అది విన్న ఆమె ముఖంలో రంగులు మారిపోయాయి.

"నేను ఎలాంటి పరిస్థితుల్లోనూ తిరిగి ఆ ఇంటికి వెళ్ళనంటే వెళ్ళనంటుంది. అతను డ్రింక్ చేయటం, డబ్బులు ఖర్చుచేయటం సమస్యలు కాదు. అమ్మాయి చదువుకుంది. గతంలోలా అన్నీ భరించి అక్కడే పడుండటానికి తయారుగా లేరు ఈ కాలం పిల్లలు"

"నిజమే. మగపిల్లలకి చెప్పాలి. దేశం మీద తిరిగొస్తాను. నువ్వింటికి కాపలాగా వుండు అంటే కుదరదు. నా కోసం నువ్వు ఏం చేస్తున్నావ్. ఎంత టైమ్ స్పేర్ చేస్తున్నావని ఖచ్చితంగా అడుగుతున్నారు నేటి ఆడపిల్లలు" అందామె.

"జరిగిపోయిన జీవితం తలచుకుంటే ఎంత అమాయకంగా బతికామో తెలుస్తోంది. అయినా కూడా మనిషికి ఆశ పెరుగుతోంది" అంది.

ఆ తర్వాత చాలా మెల్లగా మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. ముక్కలు ముక్కలుగా  ఆ మాటలు వినిపిస్తున్నాయి. నాకు అర్థమైనదాని ప్రకారం వారి బంధువులు అర్జెంటుగా సంపాదించేయాలనే తాపత్రయంలో పడి, అందిన చోటల్లా అప్పులు చేశారు. నలభై లక్షలకి పైగా 'ఐ.పి.' పెట్టేశారు. ఆ ఇంటావిడ బయటకు రావటం మానేసింది. ముఖ్యమైన శుభకార్యాలకి కూడా రావటంలేదు. ఆమె దగ్గర ఇంకొన్ని బంగారు ఆభరణాలు లాకర్లో వున్నాయి. అయినా వాటిని ధరించటానికి కూడా ఆమె సిగ్గుపడుతోంది.

బహుశా మాట్లాడుకుంటున్న ఇద్దరు సైతం ఎంతో కొంత ఎఫెక్ట్ అయివుంటారని పించింది. అలా ఆ సంభాషణ పెళ్ళిళ్ళ మీదకు వెళ్ళింది.

నేను కళ్ళుమూసుకుని వెనక్కి జారగిలబడ్డాను.

ఏవేవో జ్ఞాపకాలు...

చాలాకాలం నేను రైళ్ళలో తిరిగాను. ముఖ్యంగా రెండు సంవత్సరాలు రెగ్యులర్‌గా ప్రయాణం చేశాను. వేరే చోటకి ట్రాన్స్‌ఫర్ చేశారు. పిల్లల చదువులు

చెడిపోయే ప్రమాదం ఏర్పడింది. దాంతో నేనే సీజన్ టిక్కెట్‌మీద తిరిగాను. ఆఫీస్‌లో వుండొచ్చు. కానీ పిల్లల్నీ, తననీ చూడకుండా వుండలేకపోయేవాడ్ని.

రైల్లో జీవితం కనిపించేది. రకరకాల వ్యక్తుల్ని చూశాను. ఆ అనుభవాలన్నింటినీ కథలుగా రాశాను లేదా ఏ నవలలోనో వినియోగించుకున్నాను. గంటల తరబడి రాని రైళ్ళు సహనానికి పరీక్ష పెట్టేవి. కాలం గడవటానికి ఎన్నెన్నో పుస్తకాలు చదివే అవకాశం లభించింది. పెళ్ళికాకముందు కూడా రైలు ప్రయాణమే. క్రమంగా రైల్లో ప్రయాణం చేసే అవసరం తగ్గిపోయింది. బస్సుల్లోనే ప్రయాణం...

రైలు ఎక్కితే ఏదో ఆనందం. వేగంగా కదిలే భూమీ, చెట్లు మాత్రమే కాదు. నా మనసంతా రకరకాల ఆలోచనల్తో పరిభ్రమించేటట్లుండేది. రకరకాల సబ్జెక్ట్‌లు నాకు రైలు ప్రయాణాల్లోనే దొరికాయి.

కిటికీ పక్కన కూర్చోవటానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చేవాడిని. ఏదో చేయాలనే ఆరాటం, ఉద్వేగం నన్ను ఊపేసేవి. మా చిన్నతనంలో జరిగిన అనేక సంఘటనలకు రైలు సాక్షిగా వుండేది.

మా ఊరు చిట్టచివరి స్టేషన్. చాలామంది మొట్టమొదటిసారి రైలును చూసినప్పటి తమ ఫీలింగ్స్ గురించి చెప్పేవారు.

మా చిన్నతనంలో మా కాలనీ కవతల వుండే ఓ అమ్మాయి రైలుకింద పడి చనిపోయిందనుకునేవారు. మొదట్లో అది ప్రమాదం అనేవారు. తర్వాత రైలు కింద కావాలని పడిందన్నారు.

ఆ రోజు మైదానంలో కూర్చున్న పిల్లలందరూ దిగులు పడిపోయారు. రైలు పట్టాల మీద డబ్బులు పెడితే సాగుతాయని తెలుసుగాని మనుషులు చచ్చిపోతారని విన్న క్షణం మాలో ఏదో అలజడి.

"మనుషులు ఎందుకు చచ్చిపోతారు?"

మా అందరిలోనూ ఇదే ప్రశ్న... ప్రేమ, ఒంటరితనం, నిరాదరణ ఇలాంటి కొత్త మాటలకి అర్థాలు తెలిసిందప్పుడే. అవన్నీ పూర్తిగా అర్థమైపోయాయని కాదు... ఎవరికి తోచిందివారు చెప్పేవారు. అన్నీ పెద్దల నుండి విని ఏర్పరుచుకున్న అభిప్రాయాలే!

దిబ్బమీద రమణయ్యగారి కుటుంబం వుండేది.

రమణయ్యగారబ్బాయికి మెదడు ఎదగలేదు. నోటినుండి ఎప్పుడూ చొంగ కారుతుండేది. వాడి తమ్ముడు మాత్రం కాలాంతకుడు. అన్నను వెంట పెట్టుకుని ఆటలకు వచ్చేవాడు. అతన్ని మేం 'పిచ్చబ్బాయి' అని పిలుచుకునేవాళ్ళం. ఎవర్ని చూసినా నవ్వేవాడు. అంతకు మించి ఎవరినన్నా కొట్టడం, రాళ్ళు వేయటం లాంటి పిచ్చి కాదు.

వాడికి సరిగ్గా అన్నం పెట్టేవాళ్లు కాదు అనుకునేవారు. మొత్తం అయిదుగురు పిల్లలు. ఆయన సంపాదన అంతంతమాత్రం. ముఖంలో స్ఫోటకపు మచ్చలుండేవి. నల్లగా వుండేవాడు. ఆ కాలనీలోనే అతను ప్రత్యేకంగా వుండేవాడు. అందరితో మాట్లాడేవాడు కాదు.

ఏం జరిగిందో తెలియదు. 'పిచ్చబ్బాయి' కనిపించటంలేదన్నారు ఓ రోజు. పిల్లలందరం కలిసి ఊరుమీద పడిపోయాం. కనిపించిన వారందరినీ 'పిచ్చబ్బాయి' గుర్తులు చెప్పి 'మీకేమన్నా కనిపించాడాండి' అని అడిగాం.

వాళ్ళ అమ్మగారు గుండెలు పగిలిపోయేలా ఏడ్చేవారు. చుట్టుపక్కల ఆడవారంతా వచ్చి ఆమెను ఓదార్చేవారు. ఆయన మాత్రం ఆలోచిస్తూ బీడీ తాగేవాడు.

మా పిల్లలందరం కూర్చున్నప్పుడు 'పిచ్చబ్బాయి' ఏమైవుంటాడు అనే చర్చ వచ్చింది. తలోరకంగా చెప్పారుగానీ ఓ మిత్రుడు చెప్పిన మాటలు నాకింకా గుర్తున్నాయి.

"వాడికి రైలంటే ఎంతో ఇష్టంరా. అందుకే రైలెక్కి ఎక్కడికో వెళ్ళిపోయాడు"

రైలు ఎక్కి మద్రాసు, బొంబాయి వెళ్ళవచ్చునని తెలిసింది అప్పుడే. పిల్లల్ని పట్టుకువెళ్లేవారి గురించీ, కాళ్ళూచేతులూ విరిచేసి అడుక్కురమ్మని పంపటాల గురించి విన్నదప్పుడే. పిచ్చబ్బాయికి ఏదో పేరుంది. కానీ ఎవరూ అలా పిలిచేవారు కాదు. వాళ్లమ్మ గారి ముందు 'పెద్దబ్బాయి' అని మాత్రం పిలిచేవారు.

అలాంటివాడు, ఈ ప్రపంచం గురించి ఏమీ తెలియనివాడు, ఇంటి నుండి ఎవరి సహాయం లేకుండా నాలుగడుగులు వేయనివాడు ఎక్కడోచోట వుండుంటాడు అనే భావమే మాకు తృప్తినిచ్చింది.

వాడికోసం పిల్లలు దిగులుపడ్డారు. పెద్దల కళ్ళలో తడి. నెలలూ, సంవత్సరాలూ, ఆ మాతృమూర్తి వేదన. మా మైదానం, మా చెట్లు, మా తలలమీద నుండి పరుగులు పెట్టే తెల్లమేఘాలు అన్నీ దుఃఖించాయి. రైలు ఎక్కుతున్నప్పుడల్లా 'మా పెద్దబ్బాయిని ఎక్కడ విడిచిపెట్టావో చెప్పవూ' అని అడుగుతుండేవాళ్ళం.

అన్నీ కరిగిపోయాయి. ఒకానొక సుదీర్ఘ విశ్రాంతిలో, ఈ జ్ఞాపకాలు తవ్వుకోవాల్సింది తప్ప రోజువారీ జీవితం ఎంతెంతగా లోబరుచుకుందో...

ఏదో వాసన... కళ్ళు తెరిచాను.

ఎదురుగా భార్యాభర్త మాత్రమే కూర్చున్నారు. వారు తెచ్చుకున్న టిఫిన్ తింటున్నారు.

శివశంకరి మాత్రం పుస్తకంలో మునిగిపోయింది.

అప్పుడు టీ.సీ. కనిపించాడు.

"సర్" అంటూ దగ్గరకెళ్ళాను.

"ఇంకా కన్‌ఫర్మ్ కాలేదు" అంటూ నాకేసి చూశాడు.

"సరే డబ్బులివ్వండి" అన్నాడు.

ఓ ఏభైరూపాయల కాగితం అందించాను.

"ఏమిటి భిక్షం వేస్తున్నారా?" అన్నాడు సీరియస్‌గా.

"అదేంటి సార్" అన్నాను.

"డెబ్భై అయిదు రూపాయలు అసలు కట్టాలి. రిసిప్ట్ రాసిస్తాను" అన్నాడు.

ఇంకో ఏభై రూపాయల కాగితం అందించాను.

ఇంకా కోపంగా చూశాడు.

"పాతికమంది క్యూలో వున్నారు" అన్నాడు.

"సర్... నేను జర్నలిస్ట్‌ని" అన్నాను.

దాంతో మరింత కోపం వచ్చింది.

"ఆ ముక్క ఎక్కేముందు చెప్పకపోయారా... జర్నలిస్ట్ అయితే ఏమిటంట?" అన్నాడు.

"నేనేం అనటం లేదు. కన్సిడర్ చేయమని మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నా. అంతే" అన్నాను.

"కూర్చోండి. ముందు కూర్చోండి. నేను మళ్ళీ వస్తాను" అనేసి వెళ్ళిపోయాడు.

ఇంక సమస్య లేదు. ఖచ్చితంగా బెర్త్ దొరకదు. నిజానికి ఎంత వుందో నాకు తెలియదు. ఎంతిస్తారో కూడా తెలియకే అతన్ని అడిగాను.

'సినిమా' వాళ్లమని చెబితే ఎక్కువ డబ్బులు అడుగుతాడేమోనని 'జర్నలిస్ట్'నని చెప్పాను. అదిలా ఎదురు తిరుగుతుందనుకోలేదు. చేసేదేముంది. అంతగా అయితే నిలబడి ప్రయాణం చేయాలి... జనరల్ కంపార్ట్‌మెంట్‌లో.

నా ఎదురుగా కూర్చున్న మిత్రుడు 'ఏమైందని' అడిగాడు.

'టికెట్ కన్‌ఫర్మ్' కాలేదన్నాను.

"నాది కూడా అదే పరిస్థితి" అన్నాడు.

మేమిద్దరం కాక ఇంకో నలుగురు ఆయన చుట్టూ తిరుగుతున్నారు. ఏమైతే అదవుతుందని సీట్లో కూర్చున్నాను.

"బెర్త్ కన్‌ఫర్మ్ కాలేదా" అంది శివశంకరి.

"లేదు" అన్నాను నీరసంగా.

ఆమె పుస్తకం మూసేసింది.

పక్కనున్నవారు అరటిపళ్ళు తిని నీళ్ళు తాగారు.

శివశంకరి తన బ్యాగ్ నుండి బిస్కెట్ ప్యాకెట్ తీసి రెండు బిస్కెట్లు అందించింది. నేను మొహమాటంగా వద్దన్నాను.

"పర్లేదు తీసుకోండి" అంది.

నేను తీసుకుంటూ చూశాను. మా ఇద్దరికేసి చూస్తున్నాడతను. ఒకటి అతనికిద్దామా అనుకున్నాను గానీ, ఆమె నాకిస్తే నేను ఇంకొకరివ్వటం బాగుంటుందా అనిపించింది.

ఇవి తింటే మంచినీళ్ళు కావాలి. కనీసం మంచినీళ్ళు కూడా తెచ్చుకోలేదనుకుంటుందేమో... అనుకోనీ... నాకేంటి.. మహా అయితే మద్రాసు దాకా కలిసి వస్తుంది. ఆ తర్వాత తన దారి తనది – నా దారి నాది. అయినా కూడా...

శివశంకరి ఇండియన్. నేను భారతీయుడ్ని. మా రాష్ట్రాల నుండి రైలుపట్టాలు దేశంలోని అన్ని భాగాలను కలుపుతున్నాయి. ఎటునుండి ఎటు ప్రయాణించినా అందరినీ ఐక్యం చేసే భావన ఒకటే... అలాంటప్పుడు ఈ స్నేహాన్ని, అదెంత స్వల్ప కాలమైనా తేలిగ్గా తీసివేయలేం.

బిస్కట్లు తిన్నాక మంచినీళ్లు అందించింది.

తాగుతూ చూశాను. అతను నాకేసే చూస్తున్నాడు.

అతను కూడా ఓ బ్యాగ్ మాత్రమే తెచ్చుకున్నాడు. మంచినీళ్లు తెచ్చుకున్నట్లు లేదు. అన్నింటికీ బదులు సిగరెట్లు చాలేమో!

అతని కళ్ళు ఎర్రగా వున్నాయా!

లేచి తన బ్యాగ్ అందుకున్నాడు. అందులో బట్టలే వున్నాయా అని ఆత్రంగా తొంగిచూశాను. కనిపించటంలేదు. మెల్లగా అందులో నుండి ఏదో వస్తువు తీస్తున్నాడు. ఏమైవుంటుంది? రిమోట్ లాంటి సాధనం... అంటే ఈ రైలులో ఎక్కడైనా బాంబు పెట్టారా? ఎక్కడ పెట్టుంటారు... దాన్ని ఎలా గుర్తించటం?

బ్యాగ్ జిప్‌ని సర్రున లాగాడు.

తన సీట్లో కూర్చుని దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

వేళ్ళు బటన్‌ని ప్రెస్ చేస్తున్నాయి.

కళ్ళుమూసుకుని చెవులు రిక్కించాను...

ఏదైనా భయానకమైన శబ్దం వినిపిస్తుందా...

అలా ఎంతసేపున్నానో తెలియదు... చెవులకు చిన్న శబ్దాలు వినిపిస్తున్నాయి. కళ్లు తెరిస్తే సీరియస్‌గా ఆటలో మునిగిపోయాడు.

కంప్యూటర్ గేమ్! అయితే ఆ సైజ్ ఇన్‌స్ట్రుమెంట్‌ని నేను చూడటం అదే మొదటిసారి...

శివశంకరి నన్ను గమనించింది.

"భయపడ్డారా" అంది.

నేను నవ్వాను.

"ఈ హింసను అభివృద్ధి చేసిందెవరు?"

నేను మాట్లాడలేదు.

"మీ సినిమావాళ్ళు" అంది.

"నేను అంగీకరించను" అన్నాను.

ఆమె చెప్పింది కొంతవరకే నిజం.

'సినిమాల్లో చూపిస్తున్న' హింసకంటే ఎన్నో రెట్ల హింస సమాజంలో వుంది. దాన్ని ఓ ఆర్ట్‌గా అభివృద్ధి చేసినవాళ్లు కొందరు రాజకీయ నాయకులు.

"అఫ్‌కోర్స్... వాళ్లూ నేరస్థులనుకోండి" అంది.

"అయినా మనం ఎందుకు భయపడుతూ బతకాలి. కేవలం కొన్ని వందల మంది ఇన్ని కోట్లమందిని కంట్రోల్ చేయటం ఏమిటి?" శివశంకరి మెల్లగా అంటున్నా ఆమె కంఠస్వరంలో ఓ వేదన వుంది.

రైలు మెల్లగా ఆగుతోంది. ఈ స్టేషన్లో ఎంతసేపు ఆగుతుందో తెలియదు. నాకైతే ఇంక టీ.సీ.ని బతిమాలుకోవటం కంటే జనరల్ కంపార్ట్‌మెంట్‌కి వెళ్ళిపోతే బాగుండుననిపించింది. కాకపోతే ముందెక్కడో వుంటుంది. పరుగులు తియ్యాలి. చూద్దాం అనుకొని బయటకు వచ్చాను.

ఎవరో రాజకీయనాయకుడై వుంటాడు. నడిచి వస్తున్నాడు.

గుంపుగా జనం. వారందరి చేతుల్లో పూలదండలు... అతనలా 'ఏ.సీ.' కోచ్‌వైపు సాగిపోయాడు. నేను కిందికి దిగాను.

అందరికీ రెండు చేతులెత్తి నమస్కరించి చిన్న ఉపన్యాసం ఆరంభించాడు. అక్కడున్న వారందరినీ పేరుపేరున పిలుస్తుంటే ఆనందతో పొంగిపోతున్నారు.

సిగ్నల్ ఇచ్చారు...

చేతులూపి లోపలకు వెళ్ళిపోయాడతను.

బండి కదిలింది. నేను ఎక్కేశాను. కళ్లముందు నుండి స్టేషన్ మాయం అయింది.

టీ.సీ. ఎక్కడా కనిపించటంలేదు.

బండి బయలుదేరి గంటన్నర దాటింది!

* * *

ప్రతి ప్రయాణమూ నా వరకు ఓ నూతన అనుభవమే.

అతి కొద్ది సమయాల్లో ఎలాంటి అనుభూతి కలగకపోవటం కూడా ఓ అనుభవంగా భావించేవాడ్ని.

అర్ధరాత్రి మా ఊరి నుండి చివరి ట్రైన్ బయలుదేరేది. అది 'దెయ్యాలబండి' అనేవాళ్ళు. ఓసారి అందులో ప్రయాణించే అవకాశం లభించింది. కొన్ని పెట్టెలు చీకటితో నిండిపోయున్నాయి. వాటిలో లైట్లు వెలగటం లేదు. ఒకటి రెండు పెట్టెల్లో మాత్రమే జనం కూర్చున్నారు. అందులో ఎక్కువ భాగం పక్క స్టేషన్లో దిగిపోయేవారు.

'దెయ్యాలబండి'లో దెయ్యాలు కనిపించలేదుగానీ కరుకుగా కనిపించే మనుషులు కనిపించారు. నన్ను ఆశ్చర్యపరిచింది మాత్రం ఓ అమ్మాయి.

మనిషి నల్లగా వుంది. ఓ చెయ్యి లేదు. ముఖానికి దట్టంగా పౌడర్ పూసింది. అది చవకరకంది కావటంతో అదో రకమైన వాసన. మల్లెపూలు మాత్రం గుప్పుమంటున్నాయి. ఆమె కట్టుకున్న చీర మెరిసిపోతోంది.

తను రైలు కదిలే ముందు ఎక్కింది. పెట్టె అంతా రెండుసార్లు తిరిగింది. కిటికీ నుండి బయటకు చూడటానికే భయంగా అనిపించింది. అంతా చీకటి, చల్లగాలి, కీచురాళ్ళ ధ్వని... దూరంగా చెట్లు... వాటికేసి చూడాలంటే ఇంకా భయం.

ఉదయంపూట ప్రయాణంలో భూమంతా పరుచుకున్నట్లనిపించే పంట చేలూ, గట్ల మీద పెంచిన చెట్లు ఎంతో అనుభూతిని కలిగిస్తాయి. ఈ దెయ్యాల బండిలో మగవాళ్ళే భయంతో బిగుసుకుపోతుంటే ఆ అమ్మాయి అంత నిర్భయంగా ఎలా తిరగగలుగుతోంది!

ఆ అమ్మాయి వెనక ఎవరో నడిచి వెళ్ళారు. తలుపు దగ్గర నిలబడి మాట్లాడుకుంటున్నారు. తను ఏదో అని నవ్వుతోంది. అతను చేతులూపుతూ ఏదో అంటున్నాడు.

రెండు స్టేషన్లు వెళ్ళిపోయాయి. ఒకర్దిదరు మినహాయించి అందరూ దిగిపోయారు. ఆడవాళ్లు అసలు లేరు. అప్పుడు ఆరంభం అయింది భయం. జేబులో వంద రూపాయల దాకా వున్నాయి. ఎవరన్నా వచ్చి లాక్కుంటే పర్లేదు. ఏమైనా చేస్తారేమో...! అనవసరంగా ఈ బండికొచ్చానా అనుకున్నాను.

ఆ అమ్మాయి ఎక్కడ దిగిపోయిందో కనిపించలేదు. ఆ తర్వాత మా మిత్రులతో చర్చల్లో ఆ అమ్మాయి ఎవరో తెలిసింది.

"అదో పెద్ద కేసురా" అన్నాడు బూతుపుస్తకాల వెంకట్రావు.

నిజం చెప్పాలంటే వెంకట్రావు వల్లనే మాకు అనేక మాటలు తెలిశాయి. 'కేసు' 'ఫిగర్' 'ఎవ్వారం' ఇలాంటి మాటల్ని భలే చిత్రమైన అర్థాల్లో వాడేవాడు.

వాడు చెప్పినదాని ప్రకారం–

ఆ అమ్మాయి రాత్రిపూట మాత్రమే కనిపిస్తుంది. ముఖ్యంగా రైల్వేస్టేషన్ దగ్గరే. ఒక్కోసారి సెకండ్ షో సినిమా వదిలిపెట్టాక థియేటర్ల దగ్గర, రిక్షా స్టాండు దగ్గర నిలుచుంటుంది. సాయంకాలం ఏడుగంటల నుండి తయారై పూలకొట్టు చుట్టుపక్కలుంటుంది. దారిన పోయేవాళ్ళకేసి చిత్రంగా చూస్తుంది. అప్పుడప్పుడు కన్నుకొడుతుంది.

"అదంతా రోగాల పుట్టరా" అన్నాడు వెంకట్రావ్.

అవేం రోగాలో మాకు అర్థమయ్యేది కాదు.

"అది వొల్లమ్ముకుంటుంది" అనేవాడు విసుగ్గా.

అక్కడి నుండి రకరకాల కథలు చెప్పుకొచ్చేవాడు. ఆ అమ్మాయి చెయ్యి నరికేశారట. ఆ నరికింది కూడా ఆ అమ్మాయిని వుంచుకున్నవాడట. వాడేమో సరిగ్గా తిండి పెట్టడంట. ఆమె ఆకలికి తట్టుకోలేక ఆ పని చేస్తోందంట.

నాకైతే శరీరం జలదరించింది. ఆమెను చూస్తే అద్భుతమైన శిల్పం చేయి విరిగి నట్లుగా నా కనిపించేది. ఒక చేయి లేకపోయినా ఆ అమ్మాయి దగ్గరకు వెళ్లే మగవాళ్ళను తలుచుకుంటే అసహ్యం. అసలు ఎవరూ వెళ్లకపోతే ఆ అమ్మాయి గతేంటి?! ప్రపంచమంతా విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో వానా, చలీ లెక్కపెట్టకుండా ఎవరెవరికో సుఖాన్ని అందించే ఆమె గుర్తుకొస్తే భయం. బతుకు భయం.

చాలా సంవత్సరాల తర్వాత ఆమె నాకు కనిపించింది. ఈసారి పూలు పెట్టుకుని కాదు. రైలు మెట్లమీద 'ఒక్క' చేయి సాచి దీనంగా అడుక్కుతింటోంది.

కడుపులో దేవినట్లయింది.

వీళ్ళందరూ ఎందుకు పుట్టారు? ఎందుకిలా బతుకుతున్నారు? ఇంత దరిద్రంగా, ఇంత హీనంగా బతకాలా? ఇవే ప్రశ్నలు. జవాబు తెలియక కాదు. మనసంతా చిందర వందరగా, మహోగ్రంగా, ఆలోచనల సెగలతో రగిలిపోవటమే... కొద్దిగంటలు... కొద్ది రోజులు...

రైలు పరుగులు తీస్తూనే వుంటుంది.

జీవితమూ అంతే!

* * *

"ఏమిటి ఆలోచనల్లో పడిపోయారు. మంచి కథకి థీమ్ ఏమైనా దొరికిందా?" అంది శివశంకరి.

"లేదండి. అన్నీ పాతజ్ఞాపకాలు" అన్నాను.

"అంత గొప్పవా" అంది.

"కాదు. చాలా మామూలువే. మెదడు పొరల్లో దాక్కుని ఇలాంటప్పుడు బయట పడుతుంటాయి" అన్నాను.

"సరదాగా అన్నాన్లెండి. జ్ఞాపకాలకు గొప్పేమిటి? మామూలువేమిటి? మన మనసులోకి వచ్చిందంటేనే అర్థం దానికేదో ప్రాముఖ్యత వుంటుంది. లేకపోతే అదెందుకు గుర్తురావటం?" అంది.

"గొప్పవారికి గొప్ప జ్ఞాపకాలు రావచ్చుగా" అన్నాను.

"అదంతా ఉత్తచెత్తని నేననుకుంటాను. సెన్సార్ చేసుకొని చెప్పుకునే మాటలకు, జ్ఞాపకాలకు మనం అంత ఇంపార్టెన్స్ ఇవ్వనవసరం లేదు. ప్రతి మనిషికీ అతి మామూలు జ్ఞాపకాలుంటాయి. జీవితాల్ని మార్చే జ్ఞాపకాలు కూడా అతిసాధారణంగా వుండొచ్చు" అంది శివశంకరి.

ఆ చెప్పటంలో ఎంతో విశ్వాసం కనిపించింది.

ఆ లక్షణం చాలామంది తమిళుల్లో నాకు కనిపించింది. తాము చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా చెబుతారు.

"ఇంతకూ మీ చిన్నతనం గురించి చెప్పండి" అంది.

"చెబుతాను. టీ.సీ. నాకు ఇక్కడ సీట్ ఇస్తే తప్పకుండా చెబుతాను. లేదంటే మీ చిరునామా ఇవ్వండి లెటర్‌లో రాస్తాను" అన్నాను.

అంటుండగానే టీ.సీ. వచ్చాడు.

నేను ఆయనకేసి నమ్రతగా చూశాను.

"మీకు బెర్త్ ఇస్తున్నాను" అంటూ రమ్మన్నాడు.

పక్క కంపార్ట్‌మెంట్‌లో మిడిల్ బెర్త్ ఇచ్చాడు. వంద రూపాయలు మాత్రం తీసుకున్నాడు. "మీరు కొత్తగా వెళ్తున్నారనుకుంటాను" అన్నాడు.

"అవును సార్"

"వచ్చే స్టేషన్లో భోజనం దొరుకుతుంది. ఆ తర్వాత కావాలంటే దొరకదు"

"అలాగే సార్"

"బయటకు వెళ్ళేటప్పుడు సూట్‌కేస్ లాక్ చేసుకు వెళ్లండి. దొంగలు తీసుకపోయే ప్రమాదముంది" అన్నాడు.

"అలాగే సార్. చాలా థాంక్స్" అన్నాను.

నా ఎదురుగా వున్న మిత్రుడికి మాత్రం "కూర్చోండి" అని చెప్పి వెళ్ళాడు. నేను నా సూట్‌కేస్ తీసుకుని పక్క కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్దామనుకున్నాను.

"బెర్త్ ఇదేనా" అంది శివశంకరి.

"కాదు పక్క బోగీ"

"వెళ్ళిపోతున్నారా" అంది నిరుత్సాహంగా.

నాక్కూడా అలాగే వుంది. ఇక్కడే వుంటే ఇంకో రెండుమూడు గంటలు మంచి కాలక్షేపం అయివుండేది.

"వెళ్ళాలిగా" అన్నాను.

"కొంచెం సేపు కూర్చోండి. బెర్త్‌ని ఎవరూ ఆక్రమించుకోరు" అని నవ్వింది.

నేను కూర్చున్నాను. టీ.సీ.గారు చెప్పిన జాగ్రత్తల గురించి చెప్పాను. ఇద్దరం చిన్నగా నవ్వుకున్నాం.

"మనకు స్వతంత్రం వచ్చి ఏభై సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో 'ఆజాదీ భారత్ రైలు యాత్ర' ఈ నెల ఇరవైనాలుగు నుండి ప్రారంభం కాబోతోంది"

అంది శివశంకరి.

"ఈ యాత్ర ఉద్దేశం ఏమిటి?" అన్నాను.

"దేశంలో వున్న అన్ని ప్రాంతాలు సందర్శించటం, అక్కడి నాగరికతలు, ఆచారాలు, ఇవే కాక అనేక విషయాలను అధ్యయనం చేయటం ప్రధాన లక్ష్యం. ఇందులో నలభైశాతం ఆడవాళ్ళుంటారు. మొత్తం పదిహేను బోగీల రైలు ప్రయాణం" అంటున్నప్పుడు ఆమె కళ్ళలో మెరుపులు.

"ఎన్ని రోజుల ప్రయాణం" అన్నాను.

"నన్నడిగితే ఏభైరోజుల ప్రయాణం అయితే సింబాలిక్‌గా వుంటుంది. కానీ ఇరవై రోజులు మాత్రమే. అన్నట్లు మనకు అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది కదా ఈ జర్నీ కూడా ఇరవైనాలుగు లేదా ఇరవైఅయిదు రాత్రి ప్రారంభం కాబోతోంది"

"సో... మీరూ వెళ్తున్నారు"

"బహుశా. నేను కూడా అప్లైచేశాను. దేశ వ్యాప్తంగా కొంతమందిని సెలక్ట్ చేసుకుంటారు. ఏజ్‌కి చెంది పదహారూ ఇరవై మధ్యలో వుండాలి" అంది శివశంకరి.

"పథకం చాలా బాగుంది" అన్నాను.

"అవును. ఇటీజ్ మై డ్రీమ్ ప్రాజెక్ట్. ఇలాంటి సందర్భాల్లో అవకాశం వస్తే ఎంత అదృష్టమో! అన్ని రాష్ట్రాల నుండి యంగ్‌స్టర్స్ వస్తారు. వారి భావాలు తెలుసుకోవచ్చు. అందులోనూ చాలా ఎమోషనల్‌గా వుంటారు. గొప్ప జర్నీ అవుతుంది" తన్మయత్వంతో చెప్పుకుపోతోంది శివశంకరి.

కరిగిపోయిన వయసు తిరిగి రాదుకదా! ఆ ప్రయాణం గురించి వింటుంటేనే ఉత్తేజకరంగా వుంది.

"మీరు తప్పకుండా సెలక్ట్ అవుతారు" అన్నాను.

"థాంక్స్. చూద్దాం. నా వరకు ఈ ప్రయణంలో చోటు దొరక్కపోయినా ఈ దేశంలోని ముఖ్యప్రాంతాలన్నీ చూడాలనుంది. ఏనాటికైనా చూస్తానుకూడా" అంది. ఇంకా మాట్లాడుతూ–

"సబర్మతి ఆశ్రమం, అజంతా, ఎల్లోరా, స్వర్ణదేవాలయం, ఇస్రో, శ్రీహరికోట, జలియన్‌వాలాబాగ్-ఇలా అనేకానేక ప్రాంతాలు సందర్శిస్తాం. ఇంక మేం కలుసుకోబోయే వ్యక్తులెవరో తెలుసా?" అంది అదే ఉత్సాహంతో.

"చెప్పండి"

"భూపేన్ హజారికా, ముజఫర్ ఆలీ, కిరణ్‌బేడీ, జయాబచ్చన్, బిట్టు సెహగల్ ఇంకా ఎందరెందరో సెలబ్రెటీస్‌ని కలుసుకుంటాం. వారితో చర్చలు జరుపుతాం. ఇండియన్ ఎకానమీ, ఆర్ట్, కల్చర్, మ్యూజిక్, క్రీడలు ఒకటా రెండా ఇట్సే కంప్లీట్ జర్నీ- ఏభై సంవత్సరాల అనుభూతుల్ని, వైఫల్యాల్ని నిర్మొహమాటంగా ఎనలైజ్ చేస్తాం. మర్చిపోయాను. గ్రామాలు, కొండలు, కోనలు, ట్రైబల్స్ అందరినీ అన్నింటినీ చుట్టివస్తాం. ఈ మహా ప్రయాణానికి చెందిన అనుభవాలతో ఓ అపూర్వమైన పుస్తకం వస్తుంది"

శివశంకరి మాట్లాడుతుంటే ఆమె పక్కన కూర్చున్న భార్యాభర్తలు చెవులు రిక్కించి వింటున్నారు. వారితో పాటు నా ఎదురుగా వున్న మిత్రుడు కూడా తాత్కాలికంగా కంప్యూటర్ గేమ్‌ని మర్చిపోయాడు.

"అలాంటి పుస్తకంలో మీ అనుభవాలు రావాలని మనసారా కోరుకుంటున్నాను" అన్నాను.

శివశంకరి నవ్వింది. ఆ జర్నీలో తను పాల్గొన్నట్లూ, భారతదేశపు మేధావులందరినీ కలుసుకుంటున్నట్లుగానే చెప్పింది. అంతటి ఆత్మవిశ్వాసం అవసరమేనేమో...!

"మీరు లోనావాలా చూశారా?"

"లేదు"

"నిజంగా రైలు వెళ్తున్నప్పుడు ఆ లోయల్ని చూడాలి. అప్పుడు మన పక్కన హరిప్రసాద్ చౌరాసియా వేణువుల గుట్టతో వుండాలి. ఆయన ఊపిరి అలా లోయల్లోకి జాలువారుతుంటే... కొండలన్నీ ఆ గీతానికి బదులిస్తుంటే ఎంత బాగుంటుందో! నేనింకా నార్త్ చూడలేదు. ఇంతకు మించిన అందాలెన్నో వున్నాయంట. అన్నట్లు మన తిరుపతి కొండలు మాత్రం తక్కువా" అంది శివశంకరి.

నాకెందుకో శివశంకరి మంచి కవయిత్రి అనిపించింది. అంతలోనే ఇందాక అతను 'ఐ లవ్ మై ఇండియా' అని పాడుతున్నప్పుడు ఎందుకు చిరాకు పడిందా అనే ఆలోచన వచ్చింది.

నా మిత్రుడు కూడా ఇలాంటి విమర్శలే చేస్తుంటాడు.

"మట్టి వాసనల గురించి ఏం కవిత్వం రాస్తారయ్యా మీరు– హైదరాబాద్‌లో కూర్చుని. ఒక్కడన్నా గ్రామాల్లోకి వస్తాడా... వచ్చినా అయిదు నిముషాలుంటారా. మీ అందరికీ మందు వాసన తప్పించి మట్టివాసన తెలీదు. పేడా, రొచ్చూ, పెంటపోగు, గేదెలు వాసన మాకు తెలుసు. ఇదిగో ఇట్లాంటి రాతలు చూస్తున్నప్పుడే తిక్క రేగుద్ది. నిజంగా గుండెల మీద చెయ్యేసుకు చెప్పమను ఎంతమంది వ్యవసాయం చేసారు... చేస్తారు.... చేయబోతారు.... నాకు చెప్పు" అనేవాడు.

నేను మాట్లాడేవాడిని కాదు. 'మట్టివాసనల' గురించి నేనూ రాసినవాడ్నే. ఇప్పుడు నగరాల్లో మట్టివాసనే కాదు. మల్లెపూల వాసనకూడా మాకు తెలియటం లేదు. గాలి పీల్చుతుంటే ముక్కులు మండిపోతుంటాయి.

ఓ అరగంట ప్రయాణం చేశాక ముఖమంతా నల్లటి జిడ్డు... పొగ, ఆయిల్ మిక్సయిన అదో రకమైన జిగట. ఎప్పటికైనా గ్రామాలు పారిపోవలసిందే.

ఎవరి అనుభవాలు వారివి.

ఇంక నేను బయలుదేరుదామనుకుంటుండగా శివశంకరి అడిగింది.

"మీ కార్డుంటే ఇవ్వండి"

జేబునుండి తీసిచ్చాను.

"ఫోనుందిగా. ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. ఇది నా కార్డ్" అంటూ అందించింది.

"థాంక్స్" అన్నాను.

"మనం మద్రాస్ సెంట్రల్ స్టేషన్‌లో కలుసుకుందాం" అంది.

ఇంక నేను సూట్‌కేసు అందుకుంటుండగా రెండు బిస్కెట్స్ అందించింది.

"ఎందుకండీ ఇందాక తిన్నాం కదా"

"పర్లేదు. బిస్కట్లేగా" అంది.

ఆమె పక్కనున్నావిడ ముఖం పక్కకు తిప్పుకుంది. నవ్వొచ్చిందనుకుంటా.

నా మిత్రుడు తిరిగి కంప్యూటర్ గేమ్ మొదలు పెట్టాడు.

బిస్కట్లు తిన్నాక మంచినీళ్లడిగి తాగాను.

"ఆజాదీ భారత్ రైలుయాత్రకి సెలక్ట్ అయితే మాత్రం నాకు లెటర్ రాయండి"

"ముందుగా ఫోన్ చేసి మీకే చెబుతాను"

"మీ ప్రయాణంలో మా హైదరాబాద్ కూడా వస్తారు. ఆ రోజు గురించి ముందుగా తెలియచేస్తే మీ అనుభవాలు కొన్నయినా వింటాను- పుస్తకంగా రాకమునుపే" అన్నాను.

శివశంకరి నవ్వుతూ "ష్యూర్" అంది.

నేను సూట్‌కేసు తీసుకుని బయలుదేరుతూ ఎదురుగా వున్న మిత్రుడికి 'వస్తా'నని చెప్పాను. వెళ్తూ ఎందుకో వెనక్కి తిరిగి చూశాను.

వెనక బెర్తులన్నింటినీ ఆక్రమించుకున్నవాళ్ళు కనిపించారు. నవ్వుతూ ఏదో మాట్లాడుకుంటున్నారు.

అలాంటి ఆనందాన్ని చెడగొట్టడం నాకు ఇష్టంలేదు.

నేను పక్క కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళాను.

ఇంకా ఎవరూ నిద్రపోవటానికి ఉపక్రమించలేదు. అందరూ కబుర్లలో పడిపోయున్నారు. ఇక్కడ కొంతవరకు ఫర్వాలేదు. సూట్‌కేస్ పెట్టుకోవటానికి జాగా అయినా వుంది. అక్కడ సర్ది కూర్చున్నాను.

కూర్చున్న ఒకాయన లేచి పై బెర్త్ మీదకి వెళ్ళిపోయాడు.

మా ఎదురుగా భార్యాభర్తలు కూర్చున్నారు. నా పక్కన ఇద్దరూ యువకులు. బ్యాగ్స్ చాలా ఆధునికంగా వున్నాయి. కుర్రవాళ్ళిద్దరూ జీన్స్ ధరించారు. ముఖాలకు కళ్ళజోళ్ళు వింత అందాన్నిస్తునాయి. అందులో ఒకతను రెండు పుస్తకాల్ని పక్కన పెట్టాడు. అవేమిటా అని తొంగిచూశాను.

'ఒరాకిల్' అని కంప్యూటర్‌కి చెందిన పుస్తకం.

ఇంకో పుస్తకం కూడా కంప్యూటర్‌కి చెందిందనే అనుకుంటున్నాను.

వారిద్దరూ ఆ విషయాలే మాట్లాడుకుంటున్నారు.

"మల్టీమీడియా, ఏనిమేషన్ ఇవన్నీ క్రియేటివ్ ఫీల్డ్‌కి చెందినవి రోహిత్. నో డౌట్ మంచి భవిష్యత్ వుంటుంది. అయితే 'సిలికాన్' గ్రాఫిక్స్ అయితే చాలా బాగుంటుంది. అది నేర్చుకోవాలంటే మద్రాసు వెళ్ళాలి లేదా బొంబాయి వెళ్లాలి. ఫీజులు కూడా చాలా ఎక్కువగానే వుంటాయి"

"ఉన్నాకూడా బాగా డబ్బులు వస్తాయి. ఒక్క రెండు నిముషాల ఏనిమేషన్ ఫిల్మ్‌కి లాక్స్‌లో ఖర్చవుతుంది" అన్నాడతను.

"కరెక్ట్. మెయిన్ ఫ్రేమ్స్ అయిపోతే 'యు.యస్' వెళ్ళిపోవచ్చుకదా"

"అది రెండువేల నాటికి అయిపోతుంది"

"అయిపోనీ. ఈ లోపు సంపాదించుకోవచ్చు. అయినా మనం అమెరికా వెళ్తే ఉద్యోగమే చేస్తూ కూర్చోంకదా. న్యూ లాంగ్వేజస్ నేర్చుకుంటాం"

"మెయిన్ ఫ్రేమ్స్ కంటే ఒరాకిల్ ఫైనాన్సియల్స్ బెస్ట్ అనుకుంటాను" రోహిత్ అన్నాడు.

"బెస్ట్ అంటే ఫర్వాలేదు. ఇప్పుడు 'శాప్' బాగుందంటున్నారు. ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కి అరవై, డెబ్బైవేల డాలర్ల వరకు ఇస్తామంటున్నారు. ఇంకా జావా కూడా బాగుందంటున్నారు"

"అదే ఏం చేయాలో అర్థంకావటంలేదు"

"అలా కాదు. మంచి కౌన్సిలర్‌ని పట్టుకోవాలి. మనకి గైడెన్స్ సరిగా వుంటే సరైన టైమ్‌లో పనులవుతాయి" అన్నాడు.

వారిద్దరి మాటల ప్రకారం మద్రాసు నగరం ఒకతను చూడటానికి వస్తున్నాడు ఇంకొకతను ఏదో కంపెనీలో ఇంటర్వ్యూ కోసం వస్తున్నాడు.

ఈ ప్రయాణంలోనే అమెరికాలో ఉద్యోగాలు చూపించే వ్యక్తుల్నీ, లేదా ఏజన్సీలను కలుసుకొని మాట్లాడాలనేది వారి ప్లాన్.

'వీసా' రావటానికి ఎలాంటి ఇబ్బందులుపడాలో మాట్లాడుకుంటున్నారు. మూడు లక్షల పెట్టుబడితో కొన్ని లక్షల రూపాయలు సంపాదించవచ్చు. బహుశా ఇద్దరికీ వయసు పాతిక సంవత్సరాల లోపే వుంటుంది. వారి మాటలు వింటుంటే ఆశ్చర్యం కలుగుతోంది.

ముప్ఫై సంవత్సరాలు వచ్చేలోగానే జీవితంలో సెటిలైపోవాలి. అద్భుతమైన ఇల్లు... కళ్ళు చెదిరే ఇంటీరియర్ డెకరేషన్, అత్యాధునిక వస్తు సదుపాయం, క్రెడిట్ కార్డ్స్, విదేశీ కార్లూ– ఇలా అన్నీ వచ్చేయాలి.

అందమైన భార్య... ముద్దులొలికే పసిపాపలు... వారికోసం ఇప్పటినుండే ఫిక్సెడ్ డిపాజిట్లు, ఫైవ్‌స్టార్ హోటల్స్‌ని తలపింపచేసే విద్యాలయాలు– అంతా ప్లాన్ ప్రకారం జరిగిపోవాలి. వారి ముందుచూపుకి ఆనందించాలో, ఈ వయసుకే ఇంత తాపత్రయానికి జాలిపడాలో నాకు అర్థం కాదు.

మా బంధువుల్లో నాకు కొడుకు వరసయ్యే ఓ కుర్రాడున్నాడు. ముప్ఫై సంవత్సరాలుంటాయేమో పొలాలు కొన్నాడు. స్థలాలు కొన్నాడు. మంచి ఇల్లు కట్టించుకున్నాడు. కార్లు రెండున్నాయి. అంతా ఓ ఏడెనిమిది సంవత్సరాల్లో సంపాదించినవే.

ఓ పెళ్ళి సందర్భంలో మేమందరం కూర్చున్నప్పుడు పెద్ద చర్చ జరిగింది.

“ఈ ప్రపంచంలో సంపాదించటం చేతకానివారు నీతుల గురించి ఎక్కువ మాట్లాడతారు” అన్నాడు. అంతటితో ఆగలేదు.

“చెడిపోయే అవకాశాలు కూడా అందరికీ రావు. రానంత వరకూ బాగానే వుంటారు. గొప్ప గొప్ప కబుర్లు చెబుతారు. చెడిపోయే అవకాశం వస్తేమాత్రం తప్పకుండా చెడిపోతారు” అన్నాడు.

కొంతమంది వాడితో చర్చ అనవసరం అనుకున్నారు. ఇంకొందరు వాడితో ఎప్పుడైనా అవసరం వస్తుందేమోనని మౌనం వహించారు. నాకు ఒకటే అనిపించింది. వాడు డబ్బులు సంపాదించటం అనే విషయంలో నిరూపించబడ్డాడు. అంతమాత్రాన తీర్పులు చెప్పేయాల్సిన అవసరం లేదనిపించింది. నేను వాడి ధోరణికి అభ్యంతరం చెప్పాను.

“చూడు బాబాయి. మీరంతా ఔట్‌డేటెడ్. ప్రపంచం గురించి మీకు తెలిసినదాన్ని మా మీదకు రుద్దుతారు. మీ కాలంలో మూడుపూట్లా అన్నం పెట్టి సంవత్సరానికి నాలుగు జతల బట్టలు కుట్టిస్తే నడచిపోయేది. ఇవాళ కుదరదు. నేను నా పిల్లాడిని స్కూల్లో చేర్పించాలంటే అయిదునుండి పదిహేనువేలు డొనేషన్ కట్టాలి. పుస్తకాలు,

డ్రెస్‌లు, ట్రాన్స్‌పోర్ట్ ఎంతవుతుంది? వాడు ఏదో ఒక రంగంలో పర్‌ఫెక్షన్ సాధించాలంటే కొన్ని లక్షలరూపాయలు ఖర్చుపెట్టాలి. లేదంటే కాంపిటీషన్‌లో నిలబడలేడు. ఇవన్నీ చేయకపోతే 'అసలు నన్నెందుకు పుట్టించావో చెప్పు' అంటాడు"

అక్కడున్న వారంతా నవ్వారు.

"మీరు కథలు రాస్తారు. నాకు అర్థంకావు. ఫ్రాంక్‌గా చెబుతున్నా. అందులో ఏముంటుంది. కొంచెం పొయిట్రీ... దేని గురించో తపన. మీకేదో కావాలి. అది పూర్తిగా వస్తుందో రాదో అనుమానం. కొత్త జనరేషన్ వచ్చింది. వాళ్ళకి బోల్డన్ని వస్తువులు కావాలి. అవన్నీ మీరు అర్థం చేసుకోండి"

వాడి మాటల ప్రవాహం నా చెవుల్లో మారుమోగుతూనే వుంటుంది.

"నిన్నటిదాకా మీరందరూ ఏ విషయాల్ని నిర్లక్ష్యం చేశారో, వాటిని ఈ తరం కంప్లీట్‌గా ఎంజాయ్ చేస్తోంది. ఫుడ్ విషయం తీసుకోండి. ఇన్ని వందల రకాలు మీరు ఊహించివుండరు కూడా. ఈ రోజు దేశంలో వస్తున్న మాగజైన్స్ చూడండి. ఫ్యాషన్‌కి ఎన్ని పేజీలు, ఫుడ్‌కి ఎన్ని పేజీలు, పళ్ళు, కుక్కలు, చర్మం, వీటి రక్షణకి ఎన్ని పేజీలు కేటాయిస్తున్నారో చూడండి.

నా మొట్టమొదటి సంపాదన డెబ్బై రూపాయలంటే ఈ కాలం పిల్లలు నవ్వుతున్నారు. మొట్టమొదటి మిలియన్ సంపాదించిన క్షణాల గురించి చెబుతున్నారు. కొత్త కొత్త కార్లూ, ఇంటీరియర్ డెకరేషన్ వీటి గురించి చెబుతున్నారు. వీటన్నింటినీ కొట్టి పారేయకండి. మా కాలంలో ఇలా జరగలేదు అంటూ కబుర్లు వద్దు... కాపిటల్ 'ఫ్లో' అవుతోంది. అవకాశాలు పెరుగుతున్నాయి. కుప్పలు కుప్పలుగా వస్తువులొచ్చి పడుతున్నాయి. టెక్నాలజీ వచ్చిపడుతోంది. ప్రపంచమే ఓ సరుకుల దుకాణం అయింది. అందుకే మీరంతా ప్రొడక్టివిటీ గురించి రాయండి. ప్రతి వ్యక్తీనీ అభివృద్ధి చెందమని రాయండి"

అందరూ నోర్లు తెరిచి వింటున్నారు.

చాలా ఆకర్షణీయంగా మాట్లాడాడు. ఎవరు చెప్పినా ఈ ప్రపంచపు అతి స్వల్ప భాగమే. మనం లోతుగా చూడవలసినదెంతో వుంది. వాడికి గుర్తుచేయవలసిన

విషయం ఏమిటంటే... కుటుంబాల నుండి వ్యక్తుల నుండి వెల్లువగా వస్తున్న ప్రశ్నల పరంపర.

"మా కుటుంబాలు ఆనందాన్ని కోల్పోతున్నాయి. మా పిల్లలు ప్రేమను కోల్పోతున్నారు. మా పెద్దలు స్వార్థపరులయ్యారు. మేం అంతకంతకూ ఏకాకులం అవుతున్నాం. వీటన్నింటకీ జవాబులు కావాలి"

ఎవర్ని కదిపినా ఇవే ప్రశ్నలు. అందుకే సైకియాట్రిస్ట్‌లకు డిమాండ్ పెరగటం రకరకాల కౌన్సిలింగ్ సంస్థలు ఏర్పడటం.

ఒకటి మాత్రం నిజం. ఈ తరాన్ని అర్థం చేసుకోవటం అంత సులభం కాదు. ఓ వందమందిని పరిశీలనకు తీసుకుంటే వందరకాల మనస్తత్వాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు చేయాల్సింది ఎవరికి వారు తమలోకి తొంగిచూసుకోవటమేనేమో!

బండి ఆగింది. సూట్‌కేస్ చూస్తుండమని చెప్పి కిందకు దిగాను. ఆకలిగానే వుంది. వేడివేడిగా ఆమ్లెట్ వేస్తున్నాడు. బండి ఎక్కువసేపు ఆగదనుకుంటాను. జనం అతని చుట్టూ చేరుతున్నారు. అతను గుడ్లు కొట్టి ఆమ్లెట్ వేసే తీరు చాలా అద్భుతంగా వుంది. రెండు మూడు బ్రెడ్ స్లైస్‌లు ఆమ్లెట్‌లో పెట్టి ఇస్తున్నాడు... అందుకుని తింటుంటే నోరు కాలింది. ఎలాగో తిని డబ్బులు ఇవ్వబోతే పదిరూపాయలన్నాడు.

భారత రైల్వేవారి స్టేషన్లు తమాషాగా వుంటాయి. ఒక్కో స్టేషన్లో ఒక్కో ధర. మంచినీళ్ళ బాటిల్ పన్నెండురూపాయల నుండి మొదలై పదిహేనుదాకా పలుకుతుంటుంది. అలాగే ఎనిమిది రూపాయల నుండి ఆమ్లెట్ ధర పది రూపాయలదాకా. గట్టిగా అడగటానికి సమయం వుండదు. అప్పుడే పచ్చలైటు వెలిగింది. సీటు దగ్గరకి వస్తుండగా మెల్లగా కదిలింది.

ఇప్పుడు కూడా కనీసం మంచినీళ్ళు తాగలేదు. బాటిల్ కూడా కొనలేదు. ఆలోచనలూ, పరిశీలనలవల్ల బోల్డంత నష్టాలు కూడా జరగవచ్చునేమో!

బండిలోకి కొత్త వ్యక్తులు ప్రవేశించారు. వారందరూ సామాన్లు సర్దుకొని సెటిల్ అవటానికి కొంత సమయం పట్టింది.

నాకెందుకో రావ్ గుర్తొచ్చారు. ఇంతకీ 'క్లైమాక్స్' గురించి ఓ అవగాహనకొచ్చారో లేదో. సినిమాకి చెంది అందరూ కన్ఫ్యూజ్‌డ్ స్టేట్‌లో వున్నారు. నటీనటులకి ఎలాంటి పాత్రలు పోషించాలో అర్థంకావటం లేదు. ప్రజలు ఎలాంటి చిత్రాలు ఆదరిస్తారో ననేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తప్పకుండా మా సినిమా విజయవంతమవుతుంది అని పైకి ప్రకటించుకున్నా లోపల అందరికీ భయమే.

స్లంప్ వచ్చేసింది. నూటఏభై సినిమాలకు పైగా నిర్మించిన చోట అరవై సినిమాలు తయారవటం, తయారైనా విడుదల కావటం గగనంగా వుంటోంది. ఇన్ని సంవత్సరాల పాటు కూర్చుని ఇప్పుడు వచ్చాను. మనసులో ఎక్కడో భయం. రేపు ఏమిటి? ఇక్కడ జీవితానికి బొత్తిగా గ్యారంటీ లేదు. సమస్యలన్నీ అలానే వున్నాయి. నాది ఓ రకం ఆలోచనైతే నా మిత్రుడిది ఇంకో తరహా బాధ. అతను ఆర్టిస్ట్.

తను బాగానే సంపాదించాడు. జీవితానికి చెంది భయపడాల్సిందేం లేదు. కానీ ఓ జీవితానికి అలవాటు పడిపోయాడు. ఆ రంగురంగుల లైట్ల నడుమ, టేక్ కట్‌ల నడుమ, కాల్‌షీట్లు అడ్జస్ట్ కాక, కొన్ని గంటలు అడ్జస్ట్‌మెంట్ అడిగి అటు పరుగులు తీసి, అక్కడ వర్క్ పూర్తిచేసి, మళ్ళీ పరుగులు తీసుకొచ్చి–ఇలాంటి ఒత్తిడి ఎంజాయ్ చేసి పనిలేకుండా కూర్చోవటం పెద్ద నరకంగా వుంటోంది.

"ఈ రోజు షూటింగ్ లేదా" అనడుగుతుంటే "చాలా విసుగ్గా అనిపిస్తుంది" అంటాడతను.

రేపు నాకూ అలాంటి స్థితి వస్తుందేమో... కథలు రాసి చాలా కాలమైంది. ఈ నడుమ ఒకటి రెండు కథలు రాద్దామని ప్రయత్నించాను. కలం ఎంతకూ కదలదు. రాసిన నాలుగు వాక్యాలు ఏ మాత్రం సంతృప్తినివ్వవు. ఒకప్పుడు ఎంత వేగంగా రాశానో తలుచుకుంటే ఆశ్చర్యం. ఇక్కడ రెండు మూడు సంవత్సరాలుంటే కథలు రాయటం సొంతం మరిచిపోతానేమో.

ఒక్కోసారి 'సినిమా' అనేది గొప్ప అనుభూతిని కలిగిస్తోంది. రచనకు చెంది రచయితలే అన్ని నిర్ణయాలు తీసుకుంటారు. రచన వెలుగులోకి వచ్చాక, పాఠకుల అభిప్రాయలు తెలుస్తాయి. సినిమాలో అలా కాదు. సంగీతం, కెమెరా, నటన–ఇలా అనేకానేక అంశాల్ని దృష్టిలో వుంచుకోవాలి. వారందరినీ కన్విన్స్ చేయగలగాలి.

ఎంత లావిష్‌గా వుంటుందో అంత పొదుపుగా వుండాల్సిన అవసరం వస్తుంది. ముఖ్యంగా 'సాధారణ ప్రేక్షకుడికి' ఇది అర్థం అవుతుందా? లేదా? ఇదే ప్రధాన సమస్య.

రావ్ ఓసారన్నారు– "మేధావిలా ఆలోచించు. సామాన్యులకి అర్థం అయ్యేలా చెప్పు" అని. బహుశా ఆత్రేయగారు చెప్పారనుకుంటాను. ఎంత గొప్ప విషయం అయినా డైల్యూట్ చేసి చెప్పాల్సుంటుంది. వీటిని అర్థం చేసుకోవటం సులభం కాదు. ముఖ్యంగా మనసు అంగీకరించదు. నిర్మాతా, దర్శకులకు, నటీనటులకు ఏది అవసరమో అది రాయగలవారే అవకాశాలు పొందుతారు. విజయాలు వస్తే మనం చెప్పింది వారు వింటారు. 'విజయం' అనేది సినిమా ఏకైక సూత్రం.

అందరికీ ఈవిషయాలు తెలుసు.అయినా తాపత్రయం. నా మానసిక పరిస్థితీ ఇలానే వుంది.

ఇంట్లో నేను ఈ విషయాల గురించి మాట్లాడటంలేదు. నాకు గురువు అనదగిన ఓ గీత రచయిత నాకో సలహా ఇచ్చారు.

"సినిమా అనేది మన వృత్తిలో భాగం. అక్కడ జరిగే విషయాలు అక్కడే మరిచిపోండి. వాటిని ఇంటిదాకా తీసుకువస్తే మాత్రం మనశ్శాంతి వుండదు. మీకెటూ అది కరువవుతుంది. ఇంట్లో వారికి అదనంగా ఎందుకు?

ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది టైమ్. మనం తయారుగా వుంటే రాత్రీ–పగలూ వాడుకుంటారు. కుటుంబానికీ, ఆనందానికీ ఎప్పుడూ దూరం కావద్దు. ఇరవైనాలుగు గంటలూ ఆలోచనలూ, డబ్బూ, కీర్తీ వీటి గురించి ఖర్చు చేస్తే ఏదో ఓ రోజు వెనక్కి తిరికి చూసుకుంటాం. వయసుండదు. ఆరోగ్యం వుండదు. కొంతమంది కాపిటలిస్ట్‌ల కోసం మన జీవితం మొత్తం కరిగిపోయిందనే బాధ గుండెల్ని కోత కోస్తుంది.

ఇంకో రహస్యం చెబుతా. అందుబాటులో వున్నాడనుకుంటే ఇక్కడ గ్లామర్ తగ్గుతుంది. దిలీప్‌కుమార్ అంగీకరిస్తే పదులకొద్దీ నిర్మాతలు ముందుకొచ్చేవారు. కానీ అతను సెలక్టివ్‌గా వున్నాడు. అదే అతని గ్లామర్. ఇవన్నీ ఆచరణలో పెట్టడం అంత సులభమైన విషయం కాదు. కానీ వీటిని మనసులో వుంచుకుంటే మంచిది"

ఇవన్నీ డైరీల్లో నోట్ చేసుకున్నాను. కానీ ఆచరణ మన చేతుల్లో లేదు. మన భావాల్ని ఇష్టపడేవారు దొరకాలి. వేవ్ లెంగ్త్ కలసినపుడే అద్భుతాలు చేయగలిగేది. అలాంటి మనుషులు దొరికేంత వరకూ నిరీక్షణ తప్పదు. ఒక జీవితకాలంలో అందరికీ అలాంటి అవకాశం లభించకపోవచ్చు కూడా.

ఇంక బెర్త్‌మీద పడుకుంటే బాగుంటుందేమో... నాకు నిద్ర రావటంలేదుగానీ, పడుకుంటే బాగుండుననిపిస్తోంది.

ఆ కుర్రాళ్ళిద్దరూ డిన్నర్‌కి ఆర్డరిచ్చారనుకుంటాను. అప్పుడే వచ్చింది.

ఇద్దరూ కూర్చుని హ్యాపీగా తింటున్నారు.

అది పూర్తయితేగాని ఇంక పడుకోవటం సాధ్యపడదు. నాకెందుకో 'రైలుబడి' అనే పిల్లల నవల గుర్తొచ్చింది. అందులో ఓ రైలుబోగీలోనే పిల్లల పాఠశాల వుంటుంది. ఇటీవల ఓ గురుకులం వారు రైలు పెట్టెలోనే నిజంగానే స్కూలు నడుపుతున్నారని తెలిసింది.

తరగతి గదుల్లో నాలుగుగోడల మధ్య విద్యను నేర్పేకంటే రైలుపెట్టెల్లో చదువు నేర్పటం పిల్లలకు గొప్ప ఆనందాన్నిస్తుంది. కిటికీనుండి బయటకు చూస్తుంటే ప్రపంచం కనిపిస్తుంది. చెట్లు, పిట్టలు, మనుషులు, ఆకాశం, మబ్బులు– అందులో చదువుకునే పిల్లలు ఎంత అదృష్టవంతులో! అలా ఆ రైలులోనే ప్రయాణం ఆరంభించి, చదువుకుంటూ, దేశమంతా తిరిగిరాగలిగితే ఎంత బాగుంటుందో!

శివశంకరి గుర్తొచ్చింది. ఇంకా చదువుకుంటోందో... నిద్రపోతోందో – అలాంటి అభిరుచి కలిగినవారి వల్లనే ఈ రైలుబడులు సాధ్యం అవుతాయి. పిల్లలందరూ ప్రకృతిలోని రంగుల్నీ, సంగీతాన్నీ ఆస్వాదించగలుగుతారు.

వారిద్దరూ భోజనాలు పూర్తిచేశారు. ఒకతను ఆ ప్రాంతం శుభ్రం చేశాడు. ఇంకొకతను అప్పటిదాకా ధరించిన జీన్స్ షర్ట్ విప్పేశాడు. లోపల సన్నటి టీ షర్ట్ కనిపించింది. బుక్స్ బ్యాగ్‌లో సర్దుకున్నారు.

ఇంక లేద్దాం అనుకుంటుండగా వారిద్దరూ వచ్చి పక్కనే కూర్చున్నారు. నాకూ అడగాలనిపించలేదు. సిగరెట్ లాంటివి వెలిగిస్తారేమోననుకున్నాను. అలాంటిదేం లేదు.

ఎదురుగా వున్న భార్యాభర్తలు మౌనంగా వున్నారు. ఎక్కువగా మాట్లాడుకోవటం లేదు. మితభాషులనుకుంటాను.

ఒకతను జేబులోనుండి 'గుట్కా' ప్యాకెట్ తీశాడు. అంత హుందాగా కనిపించిన అతని చేతిలో ఆ ప్యాకెట్ చూడగానే అదోలా అనిపించింది. ప్యాకెట్ చించి మొత్తం నోట్లో పోసుకున్నాడు. పక్కనతను కళ్ళు చిట్లించాడు.

"ఇది మానమంటే మానవు" అన్నాడు.

"ట్రావెలింగ్‌లో సరదాగా లేరా"

"గుట్కా సరదా ఏంటి... దరిద్రపు గబ్బు"

"లేదురా సెంటెడ్ స్మెల్"

"నాకు తెలుసులే. అవి తినేవాడి పక్కన నిలబడాలంటేనే అసహ్యంగా వుంటుంది. అయినా ఇదెలా అలవాటైంది?"

"మనాళ్ళే అలవాటుచేశారు"

"ఛ... ఇది చాలా డేంజర్‌రా. కేన్సర్ వస్తుందంటున్నారు"

"అలాగే చెబుతారు. మందు తీసుకుంటే లివర్ చెడిపోదా?"

"లిమిట్‌లో తీసుకుంటే పర్లేదు"

"అది మాత్రం గబ్బు కాదా?"

"సర్లే అలా వస్తే ఈ ప్రపంచమే గబ్బు" అని నాకేసి చూశాడు.

వారిద్దరితో పాటు నేనూ నవ్వాను.

"ఎందాకా సార్" అన్నాడు.

"మద్రాస్"

"మీకు జెమినీ ఫ్లై ఓవర్ ఎంత దూరంలో వుంటుందో తెలుసా?"

"లేదండి. నాకు మద్రాసు అంతగా తెలియదు"

"అలాగా" అన్నట్లు తలూపి తిరిగి మాటల్లో పడిపోయారు.

"రోహిత్ కొత్త ఆల్బమ్స్ ఏం కొన్నావ్?"

"వందేమాతరమ్ సి.డీ. తీసుకున్నా... 'రెహ్మాన్ వందేమాతరమ్' అని పాడటం చాలా బాగుంది. ట్రైబల్స్ పరిగెత్తుకురావడం, నేషనల్ ఫ్లాగ్ ఎగిరే షాట్ చాలా

బాగున్నాయి. వందేమాతరమ్ అంటూ డిసర్ట్‌లో నిలబడి 'మాతుజే సలామ్' అంటుంటే ఓహ్... చాలా బాగుంది. ఆ పాటలన్నింటిలో అదొక్కటే బాగుంది"

"అవును. అయిదుకోట్లు రెమ్యునరేషన్ తీసుకున్నాడంట. అదీ లైఫంటే" అన్నాడు. వాళ్లింకా సంగీతం గురించి, ఎమ్ టీ.వీ. 'వి' ఛానల్ గురించి మాట్లాడుకుంటున్నారు.

"రామకృష్ణాలో 'పరదేశ్' చూశాను. ఐ లైకిట్" అన్నాడు.

"సినిమానా, థియేటర్నా?"

"కాదోయ్... మహిమాచౌదరిని... షారుఖ్‌ఖాన్ కూడా బాగున్నాడు"

"నేను చూడాలనుకున్నాను గానీ కుదరలేదు"

"నీకెక్కడ కుదురుతుంది. ఏ మాత్రం తీరిక దొరికినా సాఫ్ట్‌వేర్, కోబాల్, సి ప్లస్ ప్లస్, ఒరాకిల్ ఇవేగా. అసలు 'మహిమ'లో స్పెషల్ ఏమిటో తెలుసా?"

"చెప్పు"

"హస్కీ వాయిస్. అదే ఎట్రాక్షన్"

అతను వింటుంటే చెప్పుకుపోతున్నాడు.

"మనిషి గొప్ప అందగత్తె కాదు. కానీ వాయిస్ కొత్తగా వుండటంతో ఫ్రెష్‌నెస్ ఫీలయ్యారు. నీకు తెలుసా రామ్‌గోపాల్‌వర్మ 'సత్యా'లో ఊర్మిళను కాకుండా మహిమను పెట్టాడు. గాసిప్స్ వచ్చేశాయి. మళ్లీ ఏమైందో ఊర్మిళామటోండ్కర్‌నే పెట్టాడు" అన్నాడు.

'మటోండ్కర్' అనడంలో అతను పలికిన తీరు తమాషాగా వుంది.

"ఇంతకూ పర్‌దేశ్‌లో కథ ఏమిటి?"

"ఇందులో అమ్రిష్‌పురి ఓ ఎన్.ఆర్.ఐ. మల్టీ మిలియనీర్. ఒకడే కొడుకు. అతను ఇండియా వస్తాడు. తన చిన్ననాటి ఫ్రెండ్ కుటుంబంతో ఆనందంగా ఎంజాయ్ చేస్తాడు. పాతరోజులన్నీ గుర్తుకు తెచ్చుకుంటారు. ఫ్రెండ్ కూతురుని తన కోడలుగా చేసుకోవాలనుకుంటాడు. అందులో కూడా పాటలు చాలా బావున్నాయి. ముఖ్యంగా 'ఐ లవ్ మై ఇండియా' అనే పాట చాలా బాగుంది. వాళ్లబ్బాయిది అమెరికన్ కల్చర్. ఈ అమ్మాయిది ఇండియన్ కల్చర్. ఆ క్లాష్... అందంగా చిత్రీకరించారు"

అతను చెప్పుకుపోతుంటే 'పాట' కలిగించే ప్రభావం ఎంత గొప్పగా వుంటుందో మరోసారి అర్థమైంది.

ఇంతకుముందు అదే పాటని అతనెవరో పాడాడు. ఇప్పుడు ఇతను.

నిజానికి 'వందేమాతరమ్' గీతం ఈ తరంలో చాలామందికి తెలియదు. రెహ్మాన్ ఆల్బమ్‌తో ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోంది. రోహిత్ లాంటి యువకులు అందులో షాట్స్ గురించి కూడా చెప్పగలుగుతున్నారు.

'దేశభక్తి'ని ఓ ఫార్ములాగా తీసుకున్నా హృదయానికి హత్తుకునేలా చెప్పగలిగితే యువతరంలో ఓ చైతన్యం తీసుకురావచ్చు. 'మీడియా' గా సినిమా చాలా పవర్‌ఫుల్. దేశమంతా ఏ ప్రాంతంలోనైనా తారల గాసిప్స్ గురించి చర్చించుకుంటున్నారంటే దాని గ్లామర్ తెలిసిపోతోంది.

"బాబూ... పడుకుందామా" అన్నాను.

"ఓ.కే. సార్. కొంచెం లేస్తారా" అన్నారు.

ఇద్దరూ కలిసి బెర్త్‌ని ఏర్పాటుచేశారు.

"థాంక్స్" అన్నాను.

మరో అయిదు నిముషాల తర్వాత బెర్త్‌పైకి చేరిపోయాను. కళ్ళు మూసుకుందామంటే ఎదురుగా లైట్. అది ఆఫ్ చేస్తే బాగుంటుంది. కానీ వెంటనే అడిగితే బాగుండదని పక్కకి తిరిగాను. బహుశా రేపు ఉదయం మాత్రమే లేస్తాననుకుంటాను.

శివశంకరిని మాత్రం మరిచిపోకూడదు.

తనకి వీడ్కోలు చెప్పాకే నేను బయలుదేరతాను.

* * *

పావుగంట గడిచివుంటుందేమో. లైట్ తియ్యలేదు. అంతకు మించి చుట్టుపక్కల ఎవరూ నిద్రపోవటం లేదు. పెద్దగానే మాట్లాడుకుంటున్నారు. ఎలా లేదన్నా ఇంకో గంట కాలక్షేపం చేస్తేగాని ఒక్కొక్కరూ నిద్రపోరు. నేను కిందకి దిగి తలుపు దగ్గరికెళ్ళాను. తలుపు తీశాను. చల్లటి గాలి విసురుగా ముఖాన్ని తాకింది.

ఆకాశం నిండా మబ్బులు కమ్ముకున్నాయి. మద్రాసు నగరంలో గత నాలుగు రోజులుగా భయంకరమైన వర్షాలు కురుస్తున్నాయని వార్తలు. నగరంలో అనేక

ప్రాంతాలు మునిగిపోయాయట. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కూడా కుండపోతగా వర్షాలు.

భాగ్యనగరంలో ఈ సంవత్సరం వర్షాలే లేవు. చీకట్లో బయటకు చూస్తుంటే అదో ఆనందం.

రేపటినుంచి సరికొత్త అంశంతో సినిమాకి కథ తయారుచేయాలి. జీవితంలో ఓ వెల్లువలా కొత్త విలువలు వచ్చిపడుతున్నాయి. వాటిన్నింటినీ సినిమాల్లో ప్రతిబింబించే ధైర్యం అందరూ చేయలేరు. అలాగని మౌనంగానూ వుండలేరు. ఏమైనా పరిశ్రమలో కొత్త ట్రెండ్ ప్రారంభం కాబోతోంది. అది మంచిదైనా కావచ్చు. చెడుదైనా కావచ్చు.

"చలిలో నిలబడ్డారెందుకు" అన్నారెవరో.

వెనక్కి తిరిగితే ఓ ముసలాయన.

"ఏం లేదు సార్... ఏమీ తోయక బయటకు చూస్తున్నాను" అన్నాను.

"ఈ పక్కనే నా బెర్త్. చలిగాలి అనిపిస్తోంది"

"మూసేద్దాం" అంటూ తలుపు మూశాను.

"రండి. కొంచెం సేపు నా దగ్గర కూర్చుందురు" అన్నారాయన.

ఇద్దరం కూర్చున్నాం. పక్క సీట్లనుండి జోరుగా మాటలు వినిపిస్తున్నాయి. అయిదారుగురు సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు.

"నీకు తెలియదు. ఇంకో ఫైవ్ఇయర్స్ కానీ, దేశంలో ఎలాంటి అరాచకం వుస్తుందో నువ్వు చెబుతావ్... అసలు ఇప్పటికే ఎంత మార్పు వచ్చిందో చూస్తున్నాం కాబట్టి మాకు అర్థం అవుతోంది"

"ఏమిటయ్యా అంత మార్పు"

"అదేంటి అలా మాట్లాడతావ్. మన చుట్టుపక్కల గ్రామాల్లో దారికాచి దోచుకోవడం మన చిన్నప్పటినుంచి విన్నామా?"

"లేదు"

"మొన్న ఓ కారు ఆపి అందులో ఆడవాళ్ళ నగలన్నీ దోచుకున్నారు"

"ఎప్పుడు జరిగింది?"

"నెల రోజులవుతోంది. ఎవరైనా ఎక్స్‌పెక్ట్ చేశారా? అంటే పల్లెటూర్లకి కూడా 'క్రైమ్' అనేది పాకిపోయింది"

"జరిగిందేంటో చెప్పవయ్యా"

"ఆ ఊరు చివర కొంతమంది కుర్రాళ్ళు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారయ్యా. ఓ కారు వాళ్ల ముందు నుంచి వెళ్లింది. అందులో పట్టుచీరలు కట్టిన ఆడవాళ్ళు కనిపించారు. వారి బంగారు నగలు మెరిశాయి. వాళ్లు ఏ పెళ్లి చూపులకో వెళ్తున్నారు. ఖచ్చితంగా తిరిగి ఇదే రూట్లో వచ్చి తీరాలి. అప్పటికప్పుడు ప్లాన్ చేసుకున్నారు. వాళ్ళు అనుకున్నట్లుగానే కారు వస్తోంది. ఆపేసి దోచుకున్నారు"

"ఇది ఆ ఊరివాళ్ల పనేనంటావా?"

"కావచ్చు లేదా ఇంకెవరి పనైనా కావచ్చు. ఈ రోజు ఇంతవరకు పోలీసులు అది ఎవరు చేసిందో కనిపెట్టలేకపోయారు. నా అంచనా ప్రకారం అయితే ఆ చుట్టుపక్కలవారే ఇలా చేసుంటారు. వాళ్ళకి ఈ దోచుకోవాలనే ఆలోచన ఆ కారుని చూశాకే వచ్చుంటుంది. స్పాట్ ఇన్‌స్పిరేషనన్నమాట"

"అంటే నగలు పెట్టుకురావద్దంటావా?"

"నేనెందుకంటానయ్యా స్వామీ... అసలు ఇలాంటి సందర్భాల్లో కూడా పెట్టుకుని ప్రపంచానికి చూపించకపోతే నగలెందుకు లాకర్ల కోసమా" అన్నాడతను.

అందరూ బిగ్గరగా నవ్వారు.

ముసలాయన కూడా ఆసక్తిగా వింటున్నారు.

ఇదేదో మంచి కథలా వుంది. నేను ఇంకేం చెబుతారా అని చెవులు రిక్కించాను.

"మనోడు చెబుతోంది నిజమే. ఇది వరకు సిటీ ఔట్ స్కర్ట్స్‌లో చాలా డేంజర్ అనుకునేవాళ్ళం. ఈ రోజు సిటీ నడిబొడ్డులో కూడా సెక్యూరిటీ లేదు" అన్నారెవరో.

"మొన్న బెజవాడలో పొద్దునపూట ఓ ఇంటిముందు పాచి ఊడ్చి రెండు ఇత్తడి బక్కెట్లు పెట్టుకుని నీళ్ళు కొడుతోంది పనమ్మాయి. దారిన పోతున్న ఓ మనిషి బకెట్ తీసుకుని వెళ్ళిపోతున్నాడు. కొంచెం దూరం వెళ్లాక ఆ అమ్మాయి చూసింది. 'ఏయ్ బక్కెట్' అంటూ అరుస్తోంది. 'ఆ రేటు రాదులేమ్మా' అనుకుంటూ వెళ్ళిపోతున్నాడు. చూసినవాళ్ళకి కూడా అనుమానం రాలేదు. ఆ వీధి దాటాక ఇంక కనిపిస్తే అడుగు"

తిరిగి అందరూ నవ్వులు.

"క్రైమ్ క్రియేటివిటీ అన్నమాట" అన్నారెవరో.

"కన్నింగ్ క్రియేటివిటీ"

"నా ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పాలి" అంటున్నాడతను.

"కొంచెంసేపు మాట్లాడకండి. రామారావ్ నువ్వు చెప్పు" అన్నారెవరో.

రామారావు అనే ఆయన కథలా చెప్పటం ఆరంభించాడు.

* * *

మేం సిటీ వచ్చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యాయి. మా నాన్నగారు చిన్నప్పుడే చచ్చిపోయారు. ఆ తర్వాత మేం మా నాన్నగారి ఊరు వెళ్ళిన సందర్భాలు చాలా తక్కువ. మా అమ్మగారి తరపు బంధువులే చూసేవారు. దాదాపు మా ఊరి గురించి మేం మరిచిపోయాం అనుకుంటున్న సమయంలో కబురొచ్చింది- మా నాన్న తాలూకు ఆస్తి కొంత వచ్చిందని. కొద్దిపాటి పొలంతో పాటు ఇంటిలో భాగం కూడా వచ్చింది. వాటిని అమ్మేయటం మంచిదని అమ్మ అంది. నాకూ అది నిజమనిపించింది.

మేమెవ్వరం ఆ గ్రామం వెళ్లి వుండేది లేదు. వ్యవసాయం చేసేది కూడా లేదు. కనీసం ఇల్లు విడిగా వుంటే ఏ సెలవులకో వెళ్ళి కాలక్షేపం చెయ్యొచ్చు. ఉమ్మడి ఆస్తి. మా బాబాయిల పిల్లలు వ్యవసాయంలో వున్నారు. అందుకే ఎంతో కొంతకి వాళ్ళకే ఇచ్చేయాలనుకున్నాం. ఆ విషయం ముందుగా రాసి ఫలానా రోజున వస్తున్నాను, రాతకోతలూ రిజిస్ట్రేషన్, డబ్బులివ్వటం అన్నీ అదే రోజు జరిగిపోవాలన్నాను. మహా అయితే రోజున్నర. అంతకంటే వుండను కాబట్టి ఓ జత బట్టలు మాత్రం తీసుకుని వెళ్ళాను.

చాలాకాలం తర్వాత మా ఊరిని చూడటం. చిన్నప్పుడు ఎలా వుందో ఇప్పుడూ అలానే వుంది. ఇంకా చెప్పాలంటే ఇంకా దరిద్రంగా వుంది. ఈ ఇరవై సంవత్సరాల్లో ఒక్కసారి మాత్రం రోడ్లు ఓ మోస్తరుగా కనిపించాయి. ఇప్పుడు చాలా దరిద్రంగా వున్నాయి.

రోడ్డుపక్క చెట్లన్నీ దుమ్ముతో కనిపించాయి. అలాగే బారుగా లేబర్ గుడిసెలు వేసుకున్నారు. ఆ తాటాకుల నిండా దుమ్మే. మనుషుల్లో కూడా పెద్ద మార్పు లేదు. బస్ దిగితే అదే చెట్టు... కాలవగట్ల మీద అదే జనం. నీరుకాయలెక్కిన పంచెలూ, చొక్కాలు, భుజాలమీద కండువాలు. బస్ దిగగానే ఎవరెవరు దిగుతున్నారా అనే ఆరా... ఇంటికి నడిచి వస్తుంటే కూడా అంతే. కొంతమందైతే 'ఎవరూ' అని అడిగేయటం కూడా. కొంతమంది కుర్రాళ్ళు మాత్రం జీన్స్ ప్యాంట్లు వేసుకున్నారు. నాలుగైదు స్కూటర్లు కనిపించాయి.

మా ఇంటికి వెళ్ళేటప్పటికి అందరూ తయారుగా వున్నారు. అందరం రాతకోతలు పూర్తిచేసుకుని, సంతకాలు పెట్టి, రిజిస్టర్ ఆఫీస్‌కి పక్క ఊరు వెళ్ళాం. నాకైతే అటునుంచే వెళ్దామనుంది. కానీ మరీ అయిదుగంటలు కూడా వుండకపోతే డబ్బుల కోసం వచ్చాడను కుంటారనుకున్నాను. మొత్తం ఓ లక్ష చిల్లర డబ్బు ఇచ్చారు.

ఆ రాత్రి మా బాబాయి నిద్రపోతే ఒట్టు. ఆరు బయట మంచం వేసుకుని పడుకున్నాడు. కర్ర మంచానికి ఆనించుకున్నాడు. ఏమాత్రం అలికిడి వినిపించినా 'ఎవరది' అంటూ అడిగేవాడు. సమాధానం రాకపోతే కర్రమీదకు చెయ్యి వెళ్లటం. లేచిపోవటం జరిగిపోయేది. మేం కూడా రెండు గంటలదాగా నిద్రపోలేదు.

"ఇదేంటి ఇక్కడ కూడా ఇంత భయమా?" అన్నాను.

మా కజిన్ చాలా విషయాలు చెప్పాడు. మనమేదో సిటీలో వుంటున్నాం, వాళ్ళందరి కంటే పెద్ద తెలివిగలవాళ్ళం అనుకుంటాం గానీ వాడి విశ్లేషణ విన్నాక నాకు తల తిరిగిపోయింది.

"పరిస్థితులు ఇదివరకటిలా లేవు. చాలా మారిపోయాయి. అన్నీ అనుమానాలు. దొంగతనాలు పెరిగిపోయాయి. ఏమార్చామంటే పనిముట్లు కనిపించవ్. ఇంక నువ్వు వస్తావని తెలుసు. నీ పొలం, ఇల్లు మేం తీసుకుంటున్నామని తెలుసు. ఇంకా నయం. మన విషయంలో నాన్ననిచూసి మాట్లాడటానికి భయపడతారు గానీ లేకపోతే నీ దగ్గరకొచ్చేసి స్థలాల రేట్లూ, పొలాల రేట్లూ పాపంలా పెరిగితే, అంత చౌకగా ఇచ్చేశావేంటి... మీ వాళ్లు నిన్ను మోసం చేశారని పుల్లలు పెట్టేవారు"

"అలా కూడా వున్నారా?"

"అయ్యో మీ పట్నం చాలా నయం. ఒకరి గురించి మరొకరు పట్టించుకోరు. అక్కడ ఎవడి గోల వాడిది. ఇక్కడ అలా కాదు. నేను ఏం చేస్తున్నాను అని ఎవడూ ఆలోచించడు. చూపంతా పక్కవాడి మీదే. ఈ రాత్రికి మనింట్లో డబ్బులుంటాయని చాలామందికి తెలుసు. అందుకని ఏమైనా జరగొచ్చు"

"అలాంటప్పుడు రేపే బ్యాంక్‌లో తీసుకునేవాళ్ళం"

"మాటవరసకు చెబుతున్నా. మనింట్లోకి రావటానికి అంత ధైర్యం కూడానా. వాకిట్లో యముడుంటాడు. ఆయన పక్కన రెండు కుక్కలుంటాయి. వాళ్ళని దాటుకుని ఇంట్లోకొస్తే కొడవళ్ళున్నాయి. చెర్నాకోల్లున్నాయి. కర్ర తిప్పితే అయిదుగురికి సమాధానం చెప్పగలమనుకో" అన్నాడు.

వాడి శరీరాన్ని చూసిందప్పుడే. చాలా దృఢంగా వున్నాడు. ఆ తర్వాత చాలా విషయాలు చెప్పాడు.

"లేబర్ ఇదివరకటిలా లేరు. టైంకి పనిలో కొస్తారు. పదినిముషాలకు ముందే బయటికొస్తారు. మధ్యలో మంచినీళ్ళనీ, కాలు మడవటమనీ పని ఆపుతూనే వుంటారు. గట్టిగా అంటానికి లేదు. సాయంకాలం అయితే చాలు సెంటర్లకొచ్చేస్తున్నారు. టీలు తాగుతారు. రంగురంగుల షర్టులేస్తారు. కొంతమందైతే మందేసుకుంటారు. ఇక్కడ కుర్రాళ్ళకీ, వాళ్ళకీ గొడవలు..."

"ఎందుకంట" అన్నాను.

"ఏం చెప్పమంటావ్ కేస్ట్‌వార్‌లు. అసలు గొడవ ఇక్కడ వుంది. వీళ్ళల్లో వీళ్ళకి పడదు. దాంతో వాళ్ళని చేరదీస్తారు. అందులో ఇది రిజర్వ్‌డ్ సీట్. సర్పంచ్‌గా వాళ్ళే నిలబడాలి. ఓ నాయకుడు బయలుదేరాడు. వాడికి ఎమ్.ఎల్.ఎ. సపోర్ట్. సాయంకాలం అయితే వీళ్ళతో పేకాటలు, మందూ. కొట్లాటయితే పోలీస్‌స్టేషన్లో రాజకీయాలు. అంతా నానా ఛెండాలం అయిందనుకో"

"మీరంతా ఏం చేస్తున్నారు?"

"ఇదంతా ఎవరికి పట్టింది. దేని పనికి ఆడున్నాడు. వాళ్ళు కూడా తక్కువ తినలా. ఇన్ని పొలాలు మీకెట్లా వచ్చినయంటన్నారు. ఎవరెవరు ఎన్ని బస్తాలు పండిస్తున్నారో లెక్కలు చెబుతున్నారు. ఇంకా చాలా రకాల గోలలున్నాయిలే" అన్నాడు.

"అవేంటో చెప్పు" అన్నాను.

"అసలు ఇక్కడి పరిస్థితి వేరేరకంగా వుంది. మన జనం సిటీల మీద పడ్డారు. వ్యవసాయం చేయటం అనవసరం అనుకుంటున్నారు. దాని మీద వచ్చే ఆదాయాన్ని బ్యాంక్ వడ్డీతో పోల్చుకుంటున్నారు. అందుకే పొలాలు అమ్మేసుకుని పోతున్నారు. వాటిని కొనేదెవరనుకున్నావ్. ఎవడైతే కొంచెం జాగ్రత్తగా వుంటాడో ఆ కుటుంబం కొనేసుకుంటోంది. పది సంవత్సరాల తర్వాత చూడు. భూస్వాములు వాళ్లే అవుతారు. మోతుబరులు వాళ్లే అవుతారు. ఇంక కొట్టుకునేది కూడా వాళ్ళే"

వింటుంటే నిజమే అనిపించింది. ఇప్పటి అగ్రకులాల వారు కూడా ఇలానే ఏర్పడ్డారు. ఇప్పుడు చదువులు, వ్యాపారాలు, విదేశాలు ఇవీ వాళ్లు ఎన్నుకున్న రంగాలు. మావాడన్నట్లు ఓ పది సంవత్సరాల కాలంలో 'క్లాష్' ఇంకో రూపంలోకి తప్పకుండా మారుతుంది.

"పోటీ వచ్చేసింది. నేను నాలుగెకరాలు వ్యవసాయం చేస్తే పక్కనవాడు ఇంకో నాలుగెకరాలు కౌలుకి తీసుకొని చేస్తాడు. కర్ణుడి చావుకి కారణాల్లా ఇవ్వాళ రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడంటే అనేక కారణాలు. వ్యాపారపంటలు వేయటం, తెల్లారేసరికి సంపాదించాలనుకోవటం" అన్నాడు.

ఇట్లాగే కబుర్లు చెప్పుకుంటూ ఎప్పటికో నిద్రపోయాం. నిద్రలో నాకు రకరకాల కలలు. ఉలిక్కిపడి లేస్తూనే వున్నాను. నాకు తెలియకుండానే సూట్‌కేస్ కేసి చూసుకుంటూనే వున్నాను.

ఉదయం లేచాక బయలదేరుదామంటే వాళ్ళు వినరు.

"ఇంక ఈ ఊరితో నీకున్న బంధం తెగిపోయింది. ఇటు రావటం ఎప్పటికో కదా. మేమూ పాడినీ, పొలాన్నీ వదిలిపెట్టి రాలేం. ఇంకో రెండు గంటలుండు" అంటూ బలవంతం చేశారు.

కాదనలేకపోయాను. మా బాబాయిని చూస్తుంటే మా నాన్న కళ్ళముందు కొచ్చినట్లుంది. చిన్నప్పటి నుండి చూస్తున్న ఆ పెంకుటిల్లు... ఆ కొబ్బరిచెట్లు... గూళ్ళు పెట్టుకున్న పావురాలు... వీటన్నింటినీ చూస్తే ఎంత ఆనందం కలుగుతుందో అంత బాధ కలిగింది. ఆయన బతికుంటే ఎలా వుండేదో తెలియదు.

నిన్నటిదాకా నాలో ఎలాంటి బాధా లేదు. రావటం, సంతకాలు పెట్టి డబ్బులు తీసుకువెళ్ళటమే నేను చేయాల్సిన పని.

ఇప్పుడు పెయిన్ ప్రారంభం అయింది. నేను ఈ ఊరికి ఇంకేం కాను. నాదని చెప్పుకోవటానికి నేనుంటున్న నగరం నాది కాదు. ఇప్పుడు చిరునామాలేని వ్యక్తిని. ఒక దేశంలో పౌరసత్వం లేకుండా జీవించే వ్యక్తికీ నాకు తేడా లేదేమో! చిన్నప్పటి నుంచి అమ్మతో వచ్చిన అతి తక్కువ సందర్భాల్లో నా అన్నలూ, చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ మాకేసి అదోలా చూసేవారు. హాయిగా దగ్గరకు రాలేకపోయేవారు. మేం నవ్వినా బలవంతంగా నవ్వేవారు. మేం ఆ చెట్లని వింతగా చూసేవాళ్ళం. వాటి మీదకు పాకి ఏ జామపండో కోసుకుంటున్నప్పుడు వాళ్ళని చూస్తే అదే ఫీలింగ్...

ఈ చెట్టు మాది కాదా? ఈ గోడలు మావి కావా? ఈ నేల మాది కాదా? ఎలా అవుతాయి. వాటిని పెంచుకుంది వాళ్ళు... పొలాల్ని పండిస్తున్నది వాళ్ళు. కేవలం ఒకే కడుపున జన్మించిన అన్నదమ్ముల బిడ్డలుగా ఇక్కడకు వచ్చాం. నాలుగు రోజులుండి వెళ్ళిపోతాం. అంతేగా. ఒకటి రెండుసార్లు వాళ్ళు వచ్చారు. మా కొద్దిపాటి సౌకర్యాలు చూసి ఆశ్చర్యపోయేవారు. స్వేచ్ఛగా భోజనం చేయటానికి మొహమాటపడేవారు.

ఇక్కడ జరిగిన పెళ్ళిళ్ళకు రాలేదు. అప్పటికి సెలవులు దొరకవు. దొరికినా అంత దూరం నుండి రావాలంటే విసుగు. టెలిగ్రామ్ మాత్రం పంపించేవాళ్ళం. అలాంటిది ఇన్ని సంవత్సరాల తర్వాత 'మా' ఊరు వచ్చి 'డబ్బు' పట్టుకువెళ్ళటం అనేది నాకు సిగ్గుగా అనిపించింది. అలా అని ఈ డబ్బు నాకు అవసరం లేదు అని కూడా అనలేను. నగరంలో ఎంత డబ్బున్నా అవసరమే. సైట్లు కొందామా, ఫ్లాట్స్ కొందామా, షేర్లు కొందామా అనే ఆలోచనే. రూపాయిని పదిరెట్లు పెంచటం ఎలా అని మాత్రమే ఆలోచించే వాతావరణానికి అలవాటుపడిన నేను ఓ రకమైన సెంటిమెంట్‌కి లోనయ్యాను.

జస్ట్ అంతే. వారసత్వం ఓ హక్కు కదా. బాధ్యతలలా వుంచుదాం. ఈ దేశాన్ని మనం అలాంటి హక్కుగానే పొందాం. దాని మీద మనకు మమకారం లేకపోవటానికీ, దేశంనుండి, సమాజంనుండి మనం ఎలియనేట్ కావటానికీ కారణం 'భూమి'ని అమ్ముకున్నప్పుడు నాకు అర్థం అయింది.

ఇంటినుంచి బయలుదేరే ముందు నాతోపాటు అందరి కళ్ళల్లోనూ నీళ్ళే. ముఖ్యంగా మా బాబాయి మరీ చలించిపోయాడు. మా నాన్నకీ, ఆయనకీ ఎలాంటి అనుబంధం, స్నేహం వున్నాయో నాకు తెలియదు. నన్ను గుండెలకి హత్తుకుని భుజం మీద ప్రేమతో చరిచినప్పుడు ఆయన గుండెల మీద అలానే వుండి పోవాలనిపించింది.

"వెళ్ళొస్తాను బాబాయి" అంటున్నప్పుడు భుజం మీద కండువా ముఖంమీదకు తెచ్చుకుని తల ఊపాడు. కండువా కన్నీళ్ళను పీల్చుకోవటాన్ని నేను అనుభూతి చెందగలిగాను.

నేనూ, నా తమ్ముడూ నడుస్తున్నాం. కొంతదూరం పాటు మాటలు లేవు. ఎక్కడ ప్రారంభించాలో తెలియదు. వాడే అన్నాడు-

"నాన్న కన్నీరు పెట్టడం నేను చూసినంత వరకు ఇదే మొదటిసారి"

నేనేం మాట్లాడలేదు.

"అసలు నాన్న బలవంతం మీదే ఇదంతా జరిగింది. ఆయనకెందుకో అనుమానం వచ్చింది. ఓ రోజు రాత్రి కూర్చున్నాడు. చాలాసేపు ఏదో ఆలోచించాడు. 'అబ్బాయి' అని పిలిచాడు. మంచినీళ్ళు కావాలేమో అనుకున్నాను.

'రేపు మీ అన్నయ్య వాళ్ళకి ఉత్తరం రాయాలి. గుర్తుచెయ్' అన్నాడు. 'అలాగే' అన్నాను. 'నేను పోయేలోగానే ఆస్తుల పంపకం జరిగిపోవాలి. నేను పోయాక వీటి గురించి మీరు తగాదా పడకూడదు' అన్నాడు. ఆ తర్వాత ఇదంతా జరిగింది. నేను కూడా ఒకటి చెప్పాలనుకుంటున్నాను అన్నయ్యా" అన్నాడు.

"ఏంటిరా చెప్పు" అన్నాను.

"నువ్వొచ్చి నాతో ఓ రోజున్నావు. నాకెందుకో చాలా బలం వచ్చినట్లు అనిపించింది. నా వెనకా బోల్డంత మంది స్వంత మనుషులున్నారనే ఫీలింగ్ కలిగింది. నీకంటూ ఆస్తులేం లేవని అనుకోవద్దు. మన ఇల్లుని పెదనాన్న, తాతయ్య, నాన్నమ్మా, నాన్నా అందరూ కలిసి కట్టుకున్నారు. ఇప్పుడది నా ఒక్కడిదే అవుతుందని నేను అనుకోను. నీ భాగంకేసి చూస్తుంటే పెదనాన్నా, పెద్దమ్మ, మీరందరూ గుర్తొస్తారు. వేసవికాలం సెలవుల్లో పెద్దమ్మని, వదినా, పిల్లల్ని తీసుకుని నువ్వు రా. నేను కూడా

రావటానికి ప్రయత్నం చేస్తాను. మన తరంలోనైనా ఇదివరకటి దూరాన్ని తగ్గించుకుందాం" అన్నాడు. వాడు కూడా చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యాడు.

కొంచెం దూరం నడిచాక– "ట్రైన్ ఎన్ని గంటలకి" అన్నాను.

"ఇప్పుడెక్కడ ఇంకో మూడుగంటలకిగాని రాదు. బస్ వస్తే వెళ్ళువుగాని" అన్నాడు.

ట్రైన్‌కి వెళ్ళాలంటే మూడు మైళ్ళ దూరం వెళ్ళాలి. చిన్నప్పుడు జట్కాబళ్ళుండేవి. మొన్నమొన్నటిదాకా కూడా ఓ గుఱ్ఱపుబండి వుండేది. ఇప్పుడు రిక్షాలో వెళ్ళాలి.

చిన్నప్పటి ప్రయాణం ఇప్పటికీ గుర్తే. నా జీవితంలో నాకు అమితమైన ఆనందం కలిగించేది ఆ రైలు, రైలులో ప్రయాణం. రైలు స్టేషన్ దగ్గర కూర్చుని గంటల తరబడి ఎదురుచూడటంలోని బాధా... తియ్యదనం అరుదుగానే అయితేనేం ఎప్పుడూ మర్చిపోను.

ఎప్పటికో దూరంగా చుక్కలా కనిపించి, స్టేషన్ దగ్గరకొచ్చేటప్పటికి భయం పుట్టేంతగా పెరిగిపోవటం ఎప్పుడూ వింతే.

బస్‌కూడా ఎంతకీ రావటంలేదు. నాకేసి అక్కడ కూర్చున్నవాళ్లు చూస్తున్నారు. అప్పుడు ఆరంభం అయింది అనుమానం. వాళ్ళు చూస్తున్నది నన్నా, నా సూట్‌కేసునా... నాసూట్‌కేస్‌లో డబ్బులుంటాయని వారికి తెలుసు. ఇప్పుడు నా వెనకాల ఎవరన్నా వస్తారా?

ఇలాంటి అనుమానాల్లో నేనుండగా దూరంగా కారు రావటం కనిపించింది. మావాడు అటు  వెళ్ళాడు. కారు ఆగగానే కొంతమంది దిగారు. మావాడు అతన్తో ఏదో మాట్లాడాడు. నా దగ్గరకొచ్చి చెప్పాడు–

"అది పేపర్ కార్... రెండు గంటల ప్రయాణం చేస్తే టౌన్‌లో దిగొచ్చు. అక్కడి నుండి బస్ వుంటే బస్‌కెళ్ళు. లేదా ట్రైన్స్ వుంటాయేమో చూడు" అన్నాడు.

సూట్‌కేస్ తనే అందుకున్నాడు.

"డిక్కీలో పెడతారా" అన్నాడు డ్రైవర్.

"ఎందుకు నా దగ్గరే వుంటుంది" అన్నాను.

"ఇరుగ్గా వుంటుందేమో సరే రండి" అని డోర్ తెరిచాడు. లోపల ఇంకొకాయన వున్నాడు. నేను లోపల కూర్చున్నాక సూట్‌కేస్‌ని మోకాళ్ళమీద పెట్టుకున్నాను.

"వెళ్ళాక ఉత్తరం రాస్తావుగా" అన్నాడు.

"తప్పకుండా" అన్నాను.

వాడు డ్రైవర్ చేతిలో డబ్బు పెడుతుంటే– "అదేంటిరా" అన్నాను.

"ఏం లేదు. డబ్బులిచ్చేశాను"

"నువ్వెందుకివ్వటం"

"పెద్దమ్మనీ, వదినా, పిల్లల్ని అడిగానని చెప్పు"

"సరే"

టాక్సీ కదిలింది. చేతులూపుతున్నాడు తమ్ముడు.

నా పక్కనున్నతను నాకేసి విచిత్రంగా చూశాడు.

"అతను అలా చూడటం నన్నా? నా సూట్‌కేస్‌నా" అని ఆగాడు.

"ఇంటర్వెల్" అన్నారెవరో.

అందరూ నవ్వుకుంటూ సిగరెట్లు వెలిగించుకుంటున్నారు.

"ఆత్మకథ చెప్పినట్లు చెప్పావుగా" అంటున్నారెవరో.

నేను రావ్ దగ్గర చేరగానే ఆయనన్న మొదటిమాట–

"మేం చదివితేగాని డైలాగ్స్ నచ్చవు వాళ్ళకి"

అదేంటో ఓ హీరో ముందు సీన్‌ని రావ్ చదివినప్పుడు అర్థమైంది. ఆ మాడ్యులేషన్, టైమింగ్‌తో ఆ డైలాగ్‌కి చాలా డెప్త్ వచ్చినట్లనిపించింది. నన్ను రెండు మూడుసార్లు డైలాగ్స్ చదవమన్నారు. మామూలుగా చదివాను.

"ఇలా చదివితే వాళ్ళకి ఎక్కదు. నువ్వెంత గొప్ప డైలాగ్ రాసినా పేలవంగా పలికితే జీవం వుండదు. తేలిపోతుంది. సో... ఇదో ఆర్ట్" అన్నారాయన.

అదొక అనుభవం అయితే ఓ హీరోకి కథ చెప్పేముందు నన్ను తీసుకువెళ్ళారు. ఆయన కథ చెప్పే తీరు నాకు పట్టుబడాలంటే ఎలా లేదన్నా రెండు సంవత్సరాలు పడుతుందనిపించింది.

"మీ రచయితల్లో చాలామంది ఫెయిల్ అయ్యేదిక్కడే. ఎంత గొప్ప కథయినా రాయండి. అది చెప్పే తీరులో ఎదుటివారిని నీలోకి ఈడ్చుకుపోవాలి... ఏమాత్రం ఆలోచించే సమయం వుండకూడదు. వాళ్ళ కళ్ళముందు దృశ్యం కనిపించాలి. అప్పుడు

ఇన్‌స్పైర్ అవుతారు" అన్నారు రావ్.

రామారావు కథ చెప్పే తీరులో అలాంటి పరిపక్వత కనిపించింది. వినేవాళ్ల ఎమోషన్స్‌ని తన గుప్పిట్లోకి తీసుకోవటం కూడా గొప్ప ఆర్ట్. చాలామందికున్న ఈ ఆర్ట్‌వలన ప్రమాదాలూ వున్నాయి.

నాకు ఆనందం కలిగించిన విషయం రామారావు గారికి కూడా రైలంటే ఓ అనుభూతి. అతను ఎంతగా నగర జీవితంలో కూరుకుపోయినా అంతరాత్మని ఇంకా కోల్పోలేదు.

ముసలాయనకేసి చూశాను. ఆయన తలూపి నవ్వారు.

ప్రపంచాన్ని అర్థం చేసుకున్న అనుభవజ్ఞుడు ఆయనలో కనిపించాడు.

"ఇంతకీ లక్షరూపాయలు ఇంటికి తెచ్చావా? లేదా? త్వరగా చెప్పు" అన్నారు.

రామారావు గొంతు సవరించుకున్నారు. కథ తిరిగి ఆరంభం అయింది.

"నీకు శ్రమ తెలియకుండా వుండేందుకు ఓ కథ చెబుతాను విను" అని భేతాళుడు అన్నట్లు టాక్సీడ్రైవర్ మాట్లాడటం మొదలుపెట్టాడు.

"ఆయన మీకేమవుతారండి"

"తమ్ముడు"

"చూట్టానికి వచ్చారా?"

"అవును"

"అయివేజు తీసుకెళ్ళటానికి వచ్చారనుకున్నాను. ఇక్కడిది మామూలేనండి. ఏ ఊర్లో వుంటారు?"

"హైదరాబాద్‌లో"

"ఉద్యోగవాండి"

"అవును" అని ఎందులోనో కూడా చెప్పాను.

"అనుకున్నాన్లెండి. ఈ చుట్టుపక్కల అంతా వైజాగూ, హైదరాబాద్ ఎల్లిపోతన్నారు. అయితే ఉద్యోగాలూ, లేకపోతే బిజినెస్సులూ. బిజినెస్‌లు చేసేవాళ్లు ఉద్యోగాలు చెయ్యరు గానీ, ఉద్యోగాలు చేసేవాళ్ళు మాత్రం బిజినెస్‌లు చేసేత్తారండి. ఈ టాక్సీకూడా ఉద్యోగస్థుడిదేనండి" అన్నాడు.

నాకు గాలి పీల్చుకుంటూ ప్రకృతిని చూడాలనుంది.

దుమ్ము విపరీతంగా వస్తోంది. అందుకని కుదరదు. ఇతనేమో అతిభాషిలా వున్నాడు. సూట్‌కేస్ చూడగానే అందులో జత బట్టలూ, కేషూ వున్నాయండి అనేసేలా వున్నాడు.

నేను "అలాగా" అన్నాను.

"మొత్తం అయిదుబళ్ళు వున్నాయండి. ఈ జిల్లా అంతటికీ వార్తలు చదివించేది ఆయనగారేనండి"

"ఈ పాసింజర్స్ ఇచ్చే డబ్బు ఆయనకే ఇవ్వాలా?" అన్నాడు పక్కనాయన.

"ఇచ్చేస్తే పుచ్చేసుకుంటారుగానీ మేమేం చెయ్యాలండీ" అన్నాడు.

"జీతం ఇవ్వడా?"

"ఎందుకివ్వరండి. గుళ్లో ప్రసాదం తింటే కడుపు నిండుద్దాండి" అన్నాడు లాజికల్‌గా. నేనేం మాట్లాడలేదు.

"ఎంతమందండి పిల్లలు?"

"ఇద్దరు"

"ఆడా, మగానాండి"

"లేదు. ఇద్దరూ మగపిల్లలే"

"అదృష్టవంతులండి. ఆపరేషన్ చేయించేశారు కదండి"

"ఆఁ"

"మీరు చేయించేసుకున్నారాండి. ఆమ్మగారికి చేయించారా?"

"ఆవిడకే" అన్నాను విసుగ్గా.

"మంచిపని చేశారండి. మా ఇంటిది నన్ను చేయించుకోమంటంది. ఇంజన్ దగ్గర ఏడి కదండి. చెబితే అర్థంకాదు" అన్నాడు.

ఎదురుగా పెద్ద గుంట. బండి స్లో చేసి ఆ గుంటని దాటించాడు. ఆ మాత్రానికే శరీరం కదిలిపోయింది.

"ఇట్టాంటి రోడ్లమీద మనం ఆపరేషన్ చేయించుకుంటే 'కూసాలు' కదిలిపోవాండి. అదిగదిగో ఆ కనపడతందే ఇల్లు. ఆయనగోరు ఈ ఊరి మోతుబరండి. కడుపుకి

తినడంటారండి. వందెకరం చేశాడండి. ఎకరాకి అయిదేలు చొప్పున సంవత్సరానికి అయిదు లక్షలు అయివేజండి. ఇద్దరబ్బాయిలండి. ఒక్కోడికి పాతిక తక్కువ పుచ్చుకోడండి" అతని మాటలు ప్రవాహంలా సాగుతున్నాయి. బండి మాత్రం మెల్లగా వెళ్తోంది.

పక్కనే కాలవ. ఏమాత్రం స్లిప్ అయినా కాలవలోకి దొర్లిపోతుంది.

"జాగ్రత్త... అసలే రూట్ బాగుండలేదు" అన్నాడు పక్కతను.

"సమస్యే లేదండి. స్టీరింగ్‌ని విష్ణుచక్రంలా పట్టుకుంటానండి. ఫుల్ కాంసేట్ చేత్తానండి. అయినా ముఖం మీద రాసుంటే మనమేం చెయ్యగలవండి. మొన్న బస్సు దొర్లిపోయి పదిమంది పోయారు కదండి"

పక్కనాయన నాకేసి చూశాడు.

ఇంక మాట్లాడలేదతను.

డ్రైవర్ మాట్లాడుకుంటున్నాడు.

"ఈయన గోరికి కనీసం ఇరవైలక్షలు క్యాష్‌గా వుంటుందండి. బంగారం సెపరేటండి. నాలుగైదు ముద్దలు దొరుకుతాయండి. ఒక్కోటి కిలో వుంటందండి. జనం నెత్తిన టోపీలెట్టాడండి... ఈ ఇల్లు చూశారుగా... దొంగనోట్లు అమ్ముకున్నాడంటారు. పాపం పుణ్యం దేవుడికెరుకండి"

అలా ఒక్కో ఇంటిని చూసినప్పుడు ఒక్కో కథ చెప్పుకుంటూ వచ్చాడు. అయిదు, పది నిముషాల ప్రయాణంలోనే ఒక్కో ఊరు ఎదురౌతుంది. ఆ ఊరిలో ఎవరికెంత ఆదాయం వుందో లెక్కలు చెబుతున్నాడు. మొదట అతను కొంచెం ఎక్కువ మాట్లాడుతున్నాడేమో అనిపించింది గాని, అతని ధోరణి చూస్తుంటే ఏదో అర్థమవుతున్నట్లుగా వుంది.

"ఆయనింట్లో డబ్బుమీద గడ్డి మొలుస్తుందండి. మూడు పెళ్ళిళ్ళండి. ఇద్దరు ఎందుకు చచ్చిపోయారో తెలియదండి. మూడో ఆవిడ కూడా త్వరలో ఎందుకు చచ్చిపోద్దో తెలవదండి.

పొలాలు, ఇళ్ళూ, స్థలాలు ఇవి చాలక వడ్డీ యాపారాలండి, హోటళ్లండి, సిన్మాహాళ్లండి, పెట్రోల్ బంకులండి, సొమ్మే సొమ్మండి"

అతను నవ్వుతూ మాట్లాడుతున్నా- అతనిలో తెలియకుండా ఓ ద్వేషం డెవలప్ కావటం గమనించాను. అనేక మందిలో ఇతనొకడు. ఇతని లాంటివారు కొన్ని వందల మంది, లక్షల మంది ఇదే ఆలోచనలకు వస్తే ఏం జరుగుతుంది...

అల్లర్లు జరిగిన సందర్భాల్లో కొంతమందిని ప్రత్యేకంగా ఎంచుకొని వారి ఆస్తుల్ని ఎందుకు ధ్వంసం చేసుంటారో అర్థం అవటం మొదలుపెట్టింది. ఇన్‌కమ్‌టాక్స్ వాళ్లు గమనించినా లేకున్నా ఇలాంటివారు మాత్రం తప్పకుండా అంచనాలు వేస్తుంటారు. అది నిరాశకు లోనుచేస్తే లేదా ఇంకోరకం భావం కలిగిస్తే అది క్రైమ్ అవుతుంది. మొత్తంగా జనంలో చైతన్యం వస్తే అది ఉద్యమం అవుతుంది" రామారావు మళ్ళీ ఆగాడు.

"ఇది మాత్రం చాలా కరెక్ట్. మనం ఏం చేస్తున్నాం అనే దానికన్నా పక్కవాడికి ఎటునుంచి వస్తుందా అనే ఆరాటం రోజురోజుకీ పెరుగుతోంది"

"ఈ ప్రయాణం ఇంతటితో అయినట్లేనా?"

"లేదు. దారిలో మనుషుల్ని ఎక్కించుకుంటున్నాడు. ఒకతన్ని చూడగానే నాకు ఎందుకో అనుమానం వచ్చింది. అతని కళ్లు చాలా తీక్షణంగా వున్నాయి. కొద్దిపాటి గడ్డం వుంది. నన్నూ, నా సూట్‌కేస్‌ని మార్చిమార్చి చూశాడు. డ్రైవర్ మాట్లాడుతుంటే బయటకు చూస్తూ దేని గురించో ఆలోచిస్తున్నాడు. తనతోపాటు ఎలాంటి లగేజ్ తెచ్చుకోలేదు. ఇంకొంత దూరం పోయాక నా పక్కనతను దిగిపోయాడు.

వెనకాల నేనూ, అతను మాత్రం వున్నాం.

జేబునుండి ఏ రివాల్వరో తీసి, పెట్టె ఇవ్వమంటే 'తీసుకెళ్లండి' అని ఇచ్చేయటం మించి ఏం చేయలేననిపించింది. అతను మెల్లగా సీట్ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

అతన్ని క్రీగంట చూశాను.

ఎక్కడో చూసినట్లనిపించింది. గుర్తురావటంలేదు. దాదాపు నా వయసే వుండొచ్చు. నాతోపాటు చదువుకున్నాడా? సీనియరా? జూనియరా? మనసంతా కేంద్రీకరించి గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నించాను. లాభంలేదు. గుర్తురావటంలేదు. కొంతమంది మనుషుల్ని చూస్తే అలా అనిపిస్తారు.

నేను కూడా సీటు వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను.

నిద్రపట్టింది.

ఎందుకో మెలకువ వచ్చి చూస్తే అతని తల నా భుజం మీద వుంది. నాకు ఇబ్బందిగా వుంది. కానీ అతన్ని లేపాలంటే మనసు రావటంలేదు. ఎక్కడెక్కడ తిరిగి వచ్చాడో, ఎన్ని రోజులైందో నిద్రపోయి అనిపించింది. కొద్దిసేపటి తర్వాత అతనే లేచాడు.

"సారీ" అన్నాడు.

కళ్ళు ఎరుపురంగుకి మారాయి. నిద్రలేమి వల్లనే అలా కావటం!

ఫర్వాలేదన్నట్టుగా నవ్వాను.

దూరంగా ఎవరో నిలబడి కారుని ఆపమని సైగ చేస్తున్నారు. కారు ఆగింది. అప్పుడు కనిపించాడు పోలీస్. భుజానికి తుపాకీ వేలాడుతోంది. డోర్ తెరిచాడు. అతను ముందు కూర్చున్నాడు. కారు కదిలింది.

డ్రైవర్ అతన్తో పరిచయం వున్నట్లుగా మాట్లాడుతున్నాడు.

నేను నా పక్కనున్నతన్ని పరిశీలించాను.

అతను పోలీసుకేసి తీవ్రంగా చూస్తున్నాడు. నాకు తిరిగి టెన్షన్ బిగినైంది. ఏదో జరగబోతూందని మనసు హెచ్చరిస్తోంది. చాలా మార్పులు వచ్చేశాయి ఈ ప్రాంతాల్లో. గతానికీ, ఇప్పటికీ మనుషుల్లో వారి మనస్తత్వాల్లో పెనుమార్పులు కనిపిస్తున్నాయి.

ఏదో ఊరు వచ్చేసింది. పోలీసు దిగుతూ మాకేసి చూశాడు. ఎందుకో ఆగి నా పక్కనతని కేసి గుచ్చిగుచ్చి చూశాడు. భుజానున్న తుపాకీ సవరించుకున్నాడు. వాడు ఎంత తొందరగా వెళ్లిపోతే అంత బాగుండుననిపించింది.

ముఖ్యంగా ఈ మధ్యకాలంలో గన్‌మేన్‌ల వ్యవహారం పెద్ద తలనొప్పిగా తయారైంది. ప్రతి చోటా మోటా నాయకుడి దగ్గర్నుండి అందరికీ గన్‌మేన్ వుండి తీరాలి. వాళ్ల చేతిలో ఎ.కె.47గన్స్. వాళ్ళకు ప్రాణాపాయం వుందో లేదోగాని వీళ్లవల్ల జనాలు చావటం జరుగుతోంది. లోడ్‌చేసిన గన్ నుండి తూటాలు వెలువడి కొంతమంది పోయారని ఆ నడుమ వార్తలు. అలాగే గన్ శుభ్రం చేసుకుంటుండగా పేలి ఒకతను చచ్చిపోయాడు.

అందుకే అతను వెళ్ళిపోయిందాకా గుండె గుబగుబలాడుతూనే వుంది. కారు తిరిగి ముందుకు కదిలింది.

"ఈ పోలీసులింతే సార్. డబ్బులు ఇవ్వరు" అన్నాడు.

"అలాంటప్పుడు ఎందుకు ఎక్కించుకోవాలి"

"ఇంకా నయం. వాళ్ళని కాదంటే ఇంకేమైనా వుందా? ఈ రూట్లో టాక్సీ నడపటం సాధ్యం అవుతుందా" అన్నాడు.

బండి ఇంకొంత దూరం పోగానే పెద్ద గొయ్యి. దాన్ని తప్పిస్తుంటే అటూ ఇటూ ఊగిపోయి, కొంతదూరం దడదడలాడుతూ వెళ్ళి ఆగిపోయింది. రెండు మూడుసార్లు స్టార్ట్ చేయాటానికి ప్రయత్నం చేశాడు. కదలనని మొరాయిస్తోంది. కొంపతీసి అందరం కలసి ముందుకు నెట్టాలేమో అనుకున్నాను.

ఆ మాటే అడిగితే–

"అవసరం లేదండి. మా ఓనర్‌నాకొడుకు బండిని బాగు చేయించమంటే చేయించడండి. పుష్పకవిమానవండి. నడవాలేగాని నీళ్ళు పోసి నడిపిచ్చేత్తాడండి. కొంచెంసేపు సిగరెట్ కాల్చుకోండి. నేను రిపేర్ చేస్తాను" అని టూల్‌బాక్స్ అందుకున్నాడు.

నా పక్కనతను డోర్ తెరుచుకుని దిగాడు.

నేను సూట్‌కేసు సీటుమీద పెట్టి ఈ పక్కగా దిగాను.

ముందు బాయ్‌నెట్‌ని పరిశీలించి, ఏవేవో సరిచేశాడు. తర్వాత కారు కిందకి దూరిపోయాడు. అతను సిగరెట్ వెలిగించి పొగ గాల్లోకి వదులుతూ ఆలోచిస్తున్నాడు. ఇంతవరకు బస్సు జాడ లేదు. చుట్టుపక్కల మనుషులెవరూ కనిపించటంలేదు. అసలు ఈ ప్రయాణం సజావుగా జరుగుతుందా లేదా అనే అనుమానం వచ్చేసింది. ఇంత డబ్బుతో, సూట్‌కేస్ బరువుతో నడిచి ప్రయాణం చేయటం ఎలా అనిపిస్తోంది.

చిరాకు. 'ఛ... ఈ పల్లెటూర్లు రాకూడదు' అనుకున్నాను. సిటీలో ఆ పొల్యూషన్, వేగం, ఇవన్నీ చూస్తూ బోర్ కొట్టినప్పుడు అనుకునేవాడ్ని... ఇంకెంత పదిసంవత్సరాలు, తర్వాత ఇక్కడనుండి పారిపోవటమే అని. ఎక్కడి సమస్యలు అక్కడున్నాయి.

అతను కిందకి వంగి అన్నాడు– "ఇంకెంతసేపు పడుతుంది?"

"అరగంట పట్టొచ్చండి"

"ఆ తర్వాతైనా సరిగ్గా వెళ్తుందా?"

"ఏం చెయ్యమంటారు చెప్పండి. మనుషులు నడవటానికే పనికిరాని రోడ్లండి. ఇంక బళ్ళు ఎట్టా నడుస్తాయండి"

అతను డబ్బులు అందిస్తూ చెప్పాడు– "నేను వెళ్తున్నాను. దారిలో కనిపిస్తే ఆగి ఎక్కించుకుని వెళ్ళు" అనేసి వెళ్ళిపోతున్నాడు.

అతను తిరిగి కారు కిందకి వెళ్ళిపోయాడు. సరిగ్గా అరగంట తర్వాత కారు స్టార్ట్‌చేశాడు. దడదడమంటూ కదిలింది.

"మా ఓనర్‌కి నేనే డ్రైవర్నీ, మెకానిక్కునండి. జీతం మాత్రం నయాపైస పెంచడండి" అన్నాడు.

"గడ్డం ఆయన కనిపిస్తే చూడండి. ఎక్కించుకుందాం" అన్నాడు.

తర్వాత తన కుటుంబ బాధలు చెప్పుకున్నాడు. అతనికి ఎక్కువ మాట్లాడకపోతే తోయదో, నిద్ర రాకుండా వుండటానికి మాట్లాడుతున్నాడో తెలియదు. ముందో పాసింజర్, నేనూ వింటూ కూర్చున్నాం.

"సారూ... గడ్డపాయన ఇంక కనిపించడనుకుంటా. ఎక్కడో రోడ్డుకి అడ్డంబడి వెళ్ళిపోయుంటాడు" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"ఆయనగోర్ని చూస్తే మీకేమనిపించిందండి" అన్నాడు.

"అంటే" అన్నాను.

"నాకైతే అనుమానం వచ్చేసిందండి. అప్పుడప్పుడు ఈ రూట్లో ఇట్టా నా బండిలో కొంతమంది ఎక్కుతుంటారండి" అన్నాడు.

నేను ఏమీ మాట్లాడలేదు. దాంతో ఏమనుకున్నాడో కేసెట్ తీసి పెట్టాడు.

నా చిన్నప్పటి పాటలు. ఘంటసాలగారి మధురమైన స్వరం వినిపిస్తుంటే అలా నిద్రలోకి జారిపోయాను.

ఇతను చేసిన మంచిపనేదైనా వుంటే ఈ పాటలే అనిపించింది.

"సార్ లేవండి" అనటంతో మెలకువ వచ్చింది.

డబ్బులిచ్చి దిగాను. నన్నూ, నా సూట్‌కేస్‌ని నవ్వుతూ చూశాడు. బహుశా రేపటి జర్నీలో ఇలా చెబుతాడేమో అనిపించింది.

'నిన్నో సిటీ మాష్టారు కారు ఎక్కారు. సూట్‌కేస్‌లో కట్టలుండి వుంటాయి. క్షణమైనా సూట్‌కేస్ వదిలిపెడితే అడగండి'

నాకు నవ్వొచ్చింది. ఈ ప్రయాణం తర్వాత నాకు కొత్త జ్ఞానం ఏదో వచ్చినట్లనిపించింది. ముఖ్యంగా 'క్రైమ్' దేశం నలుమూలలకి ఎలా పాకుతుందో అర్థం అయింది. 'పావర్టీ' మనుషుల్ని ఎటు లాక్కుపోతుందో తెలిసింది. మనం వున్న చోటులో కూర్చుంటే ఈ ప్రపంచం అర్థం కాదు. 'జర్నీ' చేయాలి. ఈ ప్రయాణంలోనే నిన్న, నేడు అర్థం అవుతాయి. రేపుని కొంతవరుకు మనం ఊహించుకోవచ్చు" అన్నాడు.

"సో హ్యాపీ ఎండింగ్" అన్నారెవరో.

"ఇంతకీ ఆ గడ్డం మనిషి ఎవరైవుంటారు?" అడిగారెవరో.

"కథయితే కొసమెరుపు చెప్పవచ్చు. బట్ ఇది నా అనుభవం, కొన్ని కొన్ని సంఘటనలు, వ్యక్తులు, వీళ్ళని లేదా వీటిని లోతుగా చర్చించకూడదు. అలా వదిలేయాలి. అప్పుడు ఆ జ్ఞాపకాలు లైవ్‌లీగా వుంటాయి"

ఎంత బాగా చెప్పాడనిపించింది. తర్వాత కూడా వారందరూ మాట్లాడు కుంటున్నారు. నాకు మాత్రం వినిపించటంలేదు. 'జర్నీ' అనే మాట గుర్తొస్తోంది. కొన్ని జ్ఞాపకాల్ని లోతుగా తవ్వుకోవటం మంచిది కాదా... జ్ఞాపకాల విషయం అలా వుంచినా అతను చెప్పినట్లు కొందరు వ్యక్తుల్ని దూరం నుండి చూస్తేనే బాగుంటుంది. దగ్గరగా వెళ్తే వారిమీద మనకున్న ఆరాధన, గౌరవం తగ్గిపోవచ్చు. అలాగే ప్రతి సంఘటన వెనకనున్న రీజన్ తెలుసుకోవటం అవసరమేగాని, కొన్ని సంఘటనల లోతుల్లోకి వెళ్ళకపోవటమే మంచిదేమో. అవి మనకు ఆనందాన్ని కలిగించకపోగా తీరని బాధకి లోనుచేయొచ్చు.

"ఏంటి ఆలోచిస్తున్నారు?" అన్నారు ముసలాయన.

"జీవితం గురించి"అన్నాను.

ఆయన నవ్వారు.

"మీరు మద్రాసుదాకా వస్తున్నారా?" అన్నాను.

"అవును. అక్కడినుండి ఓ పల్లెటూరు వెళ్లాలి. అక్కడ మా అమ్మాయి వుంది" అన్నారాయన.

"అలాగా" అన్నాను.

"చాలా సంవత్సరాల తర్వాత ఆ అమ్మాయిని చూస్తున్నాను" తనలో తాను అనుకుంటున్నట్లుగా అన్నారు.

అంటే వీరి వెనక కూడా ఏదో కథ వుండి వుంటుంది. అవును. ప్రతి మనిషిదీ ఓ కథే... ప్రతి అనుభవమూ అంతులేని ఓ పేజీనే. రైలు ప్రయాణాల్లో లభించే స్నేహాలూ, పరిచయాలు తాత్కాలికం కావచ్చునేమోగాని అవి అపూర్వమైనవి. జీవితాల్ని వెలిగించేవి కావచ్చు.

మన ఎదురుగా, పక్కన కూర్చున్న వాళ్ళెవరో తెలియదు. జీవితంలో మరలా కలుసుకుంటామో లేదో తెలియదు. అయినా మనం ఆప్తులకు చెప్పుకోలేని విషయాలగురించి కూడా వారి దగ్గర మాట్లాడుకుంటాం. మన ఫీలింగ్స్‌ని చెప్పుకుంటాం. బాధనీ, అనుభూతినీ, సంతోషాన్నీ ఓ అపరిచితుడు లేదా అపరిచితురాలితో పంచుకోవటంలో ఓ అనిర్వచనీయమైన తృప్తి లభిస్తుంటుంది.

అందుకే ప్రయాణం అనేది సజీవమైన అంశం. మానవ జీవనానుభవాల కావ్యం. త్వరత్వరగా అనుకున్న గమ్యం చేరుకుంటే జీవితాన్ని ప్రయాణంగా మార్చుకోవాలి.

ముసలాయన తన జీవితపుటల్ని తెరుస్తున్నారు.

భారతంలో మరో కథని ఆవిష్కరిస్తున్నారు.

"మా అమ్మాయి పేరు కావేరి. గలగల పారే సెలయేరులా వుండేది. నా కూతురని కాదు. అందంగా వుండేది. దాంతో పాటు తనలో ఆ అమాయకత్వం వుండేది. నలుగురితో చనువుగా వుండేది. ఇంటికి పెద్దపిల్ల. స్వేచ్ఛగా పెరిగింది. వాళ్ళమ్మ తనమీద చాలా ఆశలు పెట్టుకుంది. ఆమె ఇష్టాన్ని కాదని కావేరిని చదివించాను.

నాకూ కావేరిమీద ఎన్నో ఆశలుండేవి. తను ఏదో ఒక రంగంలో ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదగాలి. నా ఆరాటం అదే. అలాంటి 'గోల్'ని టార్గెట్‌గా పెట్టుకోమని చెబుతుండేవాడ్ని... అంతా అలానే జరుగుతున్నట్లనిపించేది. ఏమైందో తెలియదు.

సడన్‌గా దాని జీవితంలో మార్పు వచ్చేసింది.

ఓ తమిళ కుర్రాడు పరిచయం అయ్యాడు. అతని ఆకర్షణలో పడిపోయింది. మిగతా విషయాల్ని పట్టించుకోవటం మానేసింది. అతన్ని పెళ్ళిచేసుకుంటానంది. నా భార్య అంగీకరించలేకపోయింది. ముందు భాషవేరు, కులంవేరు. వాళ్ళెవరో తెలియదు. వద్దంటే వద్దంది.

నేను ఎటూ మాట్లాడలేను. 'పెళ్ళి' కావేరి జీవిత గమ్యం కాకూడదు. తను ఎంతో ఎదగాలి. ఆ విషయమే చెప్పాను.

కానీ కావేరి అర్థం చేసుకోలేదు. తన దృష్టంతా వయసు తెస్తున్న ఆకర్షణల మీదే వుండుంటుంది. తన జీవితాన్ని తాను నిర్ణయించుకోగలనని చెబుతోంది. చెప్పవలసింది చెప్పాను. అంతకంటే చేయటానికి మనకి అధికారం లేదనిపించింది.

కుర్రవాడు బాగానే వున్నాడు. అదొక్కటే చాలదు. నా భార్య మాత్రం రాజీపడలేక పోయింది. తన పెంపకం మీద ఆమెకు బోల్డంత నమ్మకం. మనం కొంత వరకే చేయగలం అంటే వినిపించుకునేది కాదు.

కావేరి అతన్తో వెళ్ళిపోయిన రాత్రి నా గుండెల మీద వాలిపోయి భోరున ఏడ్చింది. నాకు జాలి కలిగింది. ఆడపిల్లల్ని కన్నవారికి ఈ ఏడుపు తప్పదు. కాకపోతే అంపకాలప్పుడు పిల్లల్ని కౌగిలించుకుని బావురుమంటారు. ఇప్పుడు నన్ను కౌగించుకుని బాధని వెళ్ళగక్కుతోంది.

తర్వాతెప్పుడూ కూతురు గురించి అడగలేదు. గుర్తుచేసుకోవటానికి కూడా ఇష్టపడేది కాదు. మనసును జయించగలదా... ఏకాంతంలో వరదలా తోసుకువచ్చే జ్ఞాపకాలను తిరస్కరించగలదా? తొమ్మిది నెలలు కడుపులో బిడ్డచేసిన అల్లరిని మర్చిపోతుందా. తన తొలిప్రసవం నాటి బాధనూ, అనుభూతినీ దూరం చేసుకోగలదా... మనిషికీ మనిషికీ నడుమ బంధం బలపడాల్సిందే తప్ప విచ్ఛిన్నం కాదు. కాకూడదు. ఇది నా నమ్మకం. ఈ లోగా మనుషులు జయించాల్సింది అహాన్ని.

మొదట్లో కావేరి ఉత్తరాలు రాసింది. తనకి మొదటి కాన్పు అయ్యాక మాత్రమే మాకు రాసింది. ఈ విషయం ఆవిడ్ని మరింత గాయపరిచింది. నిజానికి ఇలాంటి పనులు అన్నీ ఆమె చేయాలి. పిల్లల్ని చూడాలనిపించేది. కానీ దూరం పెరిగిపోయింది.

నా వరకు బయట ప్రపంచం వుంది. అందులో మునిగిపోయాను. ఇంటి దగ్గర బాధంతా ఆవిడది.

ఇన్ని సంవత్సరాల తర్వాత ఏం బాధ కలిగిందో, 'నాన్నా ఒక్కసారి మీరిద్దరూ కలసి రాకూడదూ. నేను మీతో కొన్ని విషయాలు మాట్లాడాలనుకుంటున్నాను' అని ఉత్తరం రాసింది. ఇద్దరం కలసి వెళ్ళాలనే ఆలోచన. 'వస్తావా' అన్నాను. ఆమె తల అడ్డంగా ఊపింది. 'నేను వెళ్ళిరానా' అన్నాను. అభ్యంతరం చెప్పలేదు.

ఇప్పుడు బయలుదేరాను. అక్కడ ఏ సమస్యల్లో వుందో తెలియదు. వాళ్ళిద్దరూ ఇంకా కలిసే బతుకుతున్నారా? విడిపోదామనుకుంటున్నారా? ఇంకేమైనా జరిగిందా? పిల్లలు ఏం చేస్తున్నారు? ఈ విషయాలు వెళ్తేగాని తెలియవు. 'మీ తాతగారు' అని పరిచయం చేస్తుందో తమిళంలో చెబుతుందో తెలియదు. కొత్త బంధనాలు చుట్టుకోబోతున్నాయనేది నిజం" అన్నారాయన.

నా కళ్ళముందు కొన్ని ప్రశ్నలు... ఆలోచనలు...

తిరిగి ఆయన మాట్లాడటం మొదలుపెట్టారు.

"మా జీవితంలో మీకు ఇంకో భాగం గురించి చెప్పాలి. ఆ భాగం పేరు 'భరత్'" అన్నారాయన.

" 'భరత్' మా అబ్బాయి. చిన్నతనం నుండి వాడికి స్వేచ్ఛనిచ్చాం. నాకంటే ఆమె మరింతగా ప్రేమించింది. అందులోనూ కూతురు దూరం అయ్యాక ఆశలన్నీ కొడుకు మీదే వుంచింది. వాడికి ఏ లోటూ రాకూడదు. సమయానికి ఏది కావాలంటే అది అందించాలి. అంతకుమించి వేరే ప్రపంచం లేదు.

నేను కావేరి విషయంలో ఓడిపోయాను. అందుకని భరత్‌కి గొప్ప లక్ష్యాలు నిర్ణయించలేదు. వాడి జీవితంలో నా జోక్యం ఏ రూపంలోనూ వుండకూడదను కున్నాను. కనీసం సలహాలు కూడా. ఏం చదువుతున్నాడో... ఏం చేస్తున్నాడో కూడా నేను పట్టించుకోవటం మానేశాను.

ఈ విషయంలో అప్పుడప్పుడు ఆమె నిరసన వ్యక్తం చేసేది. నేను మౌనంగా వుండేవాడిని. భరత్ కూడా ఈ అవకాశాల్ని వినియోగించుకున్నాడు. దేనిమీదా మనసు లగ్నం చేసేవాడు కాదు. వాడు రకరకాల ట్యూషన్లలో చేరేవాడు. ఎప్పుడూ

కొత్తబట్టల పిచ్చి. ఎవరు ఏ కొత్త డ్రెస్ వేసుకున్నా వాళ్ళమ్మని పీడించి కొనుక్కునేవాడు.

అల్లరికి లెక్కలేదు. సినిమాలకి, షికార్లకి కొదవ లేదు. ఇంటర్ దగ్గరకొచ్చేసరికి ఇంకో మనిషిగా తయారయ్యాడు. మొదటిసారిగా కులం గురించి వాళ్లమ్మతో మాట్లాడటం నేను విన్నాను. తర్వాత కాలేజీ గొడవల్లో తలదూర్చటం మొదలుపెట్టాడు. ఒకడి తల బద్దలు కొట్టాడు. రెండురోజులు జైల్లో కూర్చున్నాడు. విడిపించుకు రమ్మంది. వాడే వస్తాడని చెప్పాను. ఆ తర్వాత కులం లీడర్ అయ్యాడు.

ఇంకోపక్క నుండి గొడవలు ఆడపిల్లల నుంచి రావటం మొదలుపెట్టాయి. వాడు కూడా ఎవర్నో ప్రేమించి ఇంటికి తీసుకువస్తాడేమో అనుకునేవాడ్ని. నిజానికి వాడి దృష్టి అటువుండేది కాదు.

"మనవాళ్ళ ఆడపిల్లల్ని గొడవ చేయటానికి ఎంత ధైర్యం" అనేవాడు.

వాడు అభిమానం పెంచుకున్న 'కులం' అమ్మాయిలమీద చిన్న కామెంట్ని భరించేవాడు కాదు– వాళ్ళని నిజంగా ప్రేమించినా. వాళ్ల తల్లిదండ్రుల కంటే వీడికే ఆవేశం వచ్చేది.

వీడు ఇలా ఎందుకు తయారవుతున్నాడా అనే అనుమానం వచ్చేది. బహుశా నా భార్య కారణం అయుంటుంది.

తన కూతురు పరభాషా వ్యక్తితో వెళ్ళిపోవటాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. తన పిల్లవాడు కూడా అలాంటి పని చేస్తాడని 'స్లో పాయిజన్' గా వాడిలో 'కులం' పట్ల అభిమానాన్ని పెంచి పోషించింది. ఇతర భాషల పట్ల, ముఖ్యంగా తమిళుల పట్ల ద్వేషాన్ని కూడా రగిలించుంటుంది.

గ్రాడ్యుయేషన్దాకా మాతోనే వున్నాడు. సడన్గా వాడిలో మార్పు ఎందుకు వచ్చిందో తెలియదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఢిల్లీలో చేస్తానన్నాడు. నేను అభ్యంతరం చెప్పలేదు. వాళ్లమ్మకే ఇష్టంలేదు. "అంత దూరం ఎందుకు మా కళ్ళముందుండు" అంది.

"కాదమ్మా. నేను వెళ్ళాల్సిందే" అన్నాడు.

అంగీకరించింది.

వెళ్తూ నా దగ్గరికొచ్చి "వెళ్తున్నా" అన్నాడు. తల ఊపాను. అదే వాడిని చివరిసారి

చూడటం... నాకు గుర్తురావటంలేదు గానీ ఒక్కసారనుకుంటాను. అవును. ఒక్కసారి మాత్రం చూశాను. నేను లేనప్పుడు రెండుసార్లు వచ్చాడు. వాళ్ళమ్మ తన దగ్గర దాచుకున్న డబ్బులిచ్చి పంపింది.

ఢిల్లీ వెళ్ళటంతో వాడి జీవన విధానమే మారిపోయింది. కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. అక్కడి మనుషులు వేరు. భాషలు వేరు. కల్చర్ వేరు. తనూ, తన దుస్తులూ, కులమూ అన్నీ ఎంత ఇరుకుగా వున్నాయో అర్థం చేసుకున్నాడు.

నేను చూసేటప్పటికి వాడికి కళ్ళజోడు వచ్చింది. గడ్డం పెంచాడు. చూపులోకి ఓ రకమైన తీక్షణత కనిపించింది. అన్నింటికీ మించి వాడిలో వుండే పిచ్చికోపం మాయం అయిపోయింది. అందుకు నాకు సంతోషం కలిగినా వాడి అమ్మకు అంతులేని బాధ మిగిలిపోయింది.

"వాడిలో చాలా మార్పు కనిపిస్తుందండి" అంది మొదటిసారి వచ్చినప్పుడు.

"మార్పు సహజం కదా" అన్నాను.

"ఎత్తు పెరగటం, మీసాలు రావటం కాదు. అసలు ఇంట్లో గంటన్నా కూర్చున్నాడనుకున్నారా... బలవంతం చేస్తే భోంచేశాడు. ఈసారి అది కావాలని అడగలేదు. నాలుగు మెతుకులు కొరికి లేచిపోయేవాడు. ఇదివరకు ఎన్ని రకాల రంగులు... అదేంటో మాసిపోయిన బట్టలు తొడుక్కున్నాడు.

'అదేంట్రా' అంటే నవ్వుతాడు. ఎక్కువ మాట్లాడడు. ఏవేవో పుస్తకాలు తెచ్చి చదువుకున్నాడు"

ఇలా ఆమె గమనించిన విషయాలు చెప్పుకుపోయింది. వాడికి మొదటినుండి ఉత్తరాలు రాసే అలవాటు లేదు. ఎప్పుడన్నా ఒకటో అరో డబ్బులు పంపించమని రాసిన ఉత్తరాలొచ్చేవి. క్రమంగా ఆ ఉత్తరాలు కూడా రావటం లేదు. ఈవిడ మాత్రం ఉత్తరాలు రాస్తుంది. అవి చేరుతున్నాయో లేదో తెలియదు. ఉత్తరాలు అందుతున్నాయా? నీ అడ్రస్ మారిందా అని కూడా రాసినా ఫలితం లేదు.

నేను చెప్పాను కదా... ఒకరోజు వచ్చాడని. ఆ రోజు వాడే మాట్లాడాడు. నేను శ్రోతగా వింటుండిపోయాను.

నాకు ఒక్కసారిగా ఎవరో గొప్పవ్యక్తిని కలుసుకున్న అనుభూతి కలిగింది. ఈ

కొద్దికాలంలో నేను ఊహించనంత మార్పు. టోటల్‌గా ఇండియన్ ఎకానమీ, రాజ్యం, హింస, నిరుద్యోగం, అరిస్టోక్రసి వీటన్నింటి గురించి మాట్లాడాడు. ఈ కంట్రీకి భవిష్యత్ లేదన్నాడు. అగ్రరాజ్యాల కుప్పతొట్టిగా ఇండియా మారుతోందన్నాడు. ఈ దేశంలో యువకులు ఈ పరిస్థితుల మీద యుద్ధం చేయకపోతే మళ్ళీ బానిసత్వం తప్పదన్నాడు.

నాకు వాడు చెప్పే విషయాలకన్నా ఆ చెబుతున్న తీరు బాగుంది. అందులో నాకు నచ్చని అనేక విషయాలున్నా నేను మాట్లాడలేదు.

ముఖ్యంగా ఈస్థటిక్ విజన్ వాడిలో లేదు. ప్రతి విలువనీ రాడికల్ దృష్టితో చూడటంవల్ల కొన్ని సమస్యలు తలెత్తుతాయి. జీవితమంటే పత్రికల్లో ఆర్టికల్స్ రాసినంత సులభం కాదు. కానీ వాడి ఆవేశానికి మూలం వుంది.

"నా గురించి మీరు ఎదురుచూడకండి" అన్నాడు.

"అర్థమయ్యేలా చెప్పు" అన్నాను.

"ఇంక నేను తరచుగా రావటం కుదరదు. అసలు వస్తానో రానో కూడా చెప్పలేను. మేం యుద్ధంలో వున్నాం"

"ఎవరిమీద"

"విత్ కాపిటలిజమ్, ఇంపీరియలిజం అండ్ ఎగైనెస్ట్ ది స్టేట్. అందుకే సాధారణమైన మర్యాదల్ని ఆశించవద్దు. అలాగని మీరు ఆశిస్తున్నారని అర్థం కాదు. ఇప్పటి వరకూ నన్ను నా మార్గంలో వదిలేశారు. ఇక ముందు కూడా అలాగే వుంచండి"

నేను మాట్లాడలేదు.

"ఈ విషయాలు మీకు తెలియనివి కాదు. అమ్మకు నేను చెప్పలేను. మెల్లగా మీరు నచ్చచెప్పండి. ఉద్యోగాలు చేయటం, డబ్బు కూడబెట్టడం, కన్స్యూమరిజం ఇవి నాకు సరిపడవు"

"అంటే పెళ్ళికూడా చేసుకోవా?"

"నో బారియర్స్. పెళ్ళి అవసరం అని నేననుకోవటం లేదు. చేసుకున్నాక పిల్లలు పుట్టడం, వారికోసం రాజీపడటం ఇదంతా చూస్తున్నదే. దానికి భిన్నంగా

వుండాలనుంది. మిమ్మల్ని డబ్బులు పంపమని నేను అడగను. ఉన్నది మీ ఇద్దరికీ సరిపోతుంది. కాకపోతే ఒకందుకు మీరు క్షమించాలి. మీ చివరిరోజుల్లో మీకు సేవలు చేయలేకపోతున్నాను. మీ కోసం నేను డబ్బులు పంపించలేను. వీటిని అర్థం చేసుకుంటే చాలు''

నేను తలూపాను.

దుఃఖం వెల్లువలా పొంగుకొస్తోంది. నేను వాడితో మాట్లాడకుండా నా గదికి వెళ్ళిపోయాను. ఏడవాలనుకుంటాను. కన్నీళ్ళు ఎంతకూ రావు. ఈ ప్రపంచంలో మావంటూ ఏమైనా వుంటే వాళ్ళు పిల్లలే. వారిద్దరూ ఎవరి దోవ వారు చూసుకుంటున్నారు.

ఆ రాత్రి వాడు వెళ్ళిపోయాడు. ఆ తర్వాత వాడినుంచి జవాబు లేదు. తిరిగి రాలేదు. 'బాబు ఎక్కడున్నాడండి' అని అడుగుతుంటే ఏం చెప్పాలో అర్థంకాదు.

నేను ఇంగ్లీష్ పత్రికలు ఆరాటంగా చూస్తుంటాను. వాటిల్లో వెతుక్కుంటాను. ఎప్పుడైనా నా భరత్ ఫోటో కనిపిస్తుందేమోనని. అరెస్ట్ చేశారనో లేదా ఎన్‌కౌంటర్‌లో చంపేశారనో వార్తలు చూడాల్సివస్తుందేమోననే ఆలోచన వెంటాడుతుంటుంది. వాడు ఎక్కడున్నాడో తెలియదు. ఇంతకూ భరత్ బతికి వున్నాడంటావా?''

నేను ఉలిక్కిపడ్డాను. అభాగ్యుడైన ఆ తండ్రికి సమాధానం ఏమని చెప్పాలి? ఏం చెప్పినా అది వాస్తవం కాకపోవచ్చు.

"తప్పకుండా బతికున్నాడు. తన మార్గంలో ఎక్కడో యుద్ధరంగంలోనే వున్నాడు'' అన్నాను.

ఆయన విరక్తిగా నవ్వాడు.

"నాకో అనుమానం వుంది. అడగమంటావా బాబూ''

"అడగండి''

"యుద్ధం చేసేవారికి అమ్మా, నాన్న అవసరం లేదా? కుటుంబం అవసరంలేదా?''

అది నన్ను అడిగినట్లుగా నేననుకోలేదు.

"బాబూ నువ్వేమైనా చెయ్యి. నీకు కొన్ని బాధ్యతలున్నాయి. వాటిని మాత్రం మరిచిపోకూడదు. మేం కూడా వాడిని వదిలేసివుంటే ఏం చేసేవాడు. స్వేచ్ఛ ఇవ్వటం

వేరు. నేను వాడికి స్వేచ్ఛగా పెరిగే అవకాశం ఇచ్చాను. అది సరైంది కావచ్చు లేదా పొరపాటు కావచ్చు. కానీ బాధ్యతల నుండి పారిపోలేదు. కన్నతల్లికి ఉత్తరం ముక్క రాయలేనంత గొప్ప యుద్ధం చేస్తున్నాడా? నీకింకో సంగతి చెబుతా. మా పక్కింటి వాళ్లబ్బాయి అమెరికా వెళ్ళాడు. బాగా సంపాదిస్తున్నాడు. అమ్మ చచ్చిపోయింది, వచ్చి తలకొరివి పెట్టు బాబూ అంటే కుదరదన్నాడు. మా వాడికీ వాడికీ తేడా లేదని నేనంటాను. కాదంటావా?"

"అవి రెండూ ఒకటంటారా?" అన్నాను.

"ఎందుకు కావు. వాడూ అమెరికాలో యుద్ధమే చేస్తున్నాడంటారు. అయినా అమ్మానాన్నలు తన ఆశయానికి అడ్డు అనుకునేవాడు ఇంత పెద్ద దేశాన్ని ఎలా మార్చగలడు. ఎలా పాలించగలడు... ఇదంతా ఆవేశం అంటాను" అన్నారాయన.

నేనేమీ మాట్లాడలేకపోయాను. నాకు కొన్ని అభిప్రాయాలున్నా భరత్‌గానీ, అలాంటి వాళ్ళు గానీ వాటిని అంగీకరించకపోవచ్చు.

"ఇన్ని సంవత్సరాలు ముందుకొచ్చాం. ఈ రోజున దేశంలో ముసలివారి పరిస్థితి ఏమిటి? వారందరూ ఏకాంతంలో మగ్గి చావాలా? అసలు ఇంత వయసు వచ్చాక చచ్చి పోవాలని ఓ శాసనం ఎందుకు చేయకూడదు"

ఆయనకు తన బాధను వ్యక్తం చేసుకోవటానికి నేను కనిపించాను. అంతకంటే ఇలాంటి సమస్యలు పరిష్కారం కావాలంటే పెనుమార్పులేవో రావాల్సుంటుంది.

కొంతసేపటి తర్వాత ఆయన మామూలు ప్రపంచంలోకి వచ్చారు.

"నా కథంతా చెప్పి విసిగించానా?"

"అబ్బే అదేం లేదు. నేనే మీ ప్రశ్నలకి జవాబు చెప్పలేదు"

"దాందేముంది బాబూ... ఈ ప్రపంచం ఎలా నడవాలో అలా నడుస్తుంది. మనమూ అంతే. మన టైమ్ ప్రకారం ఎలా రాసుంటే అలా నటించి వెళ్ళిపోవటమే. ఏదీ మన చేతుల్లో లేదని తెలుసు. అయినా మనుషులం కదా... అందుకే కొంచెంసేపు ఆక్రోశం... చాలా సంతోషం నాయనా... నీకు నిద్ర వస్తే వెళ్ళి పడుకో" అన్నారాయన.

"నిద్ర రావటంలేదు. మీరు పడుకోండి" అన్నాను.

"పడుకోవటమా... కళ్ళు మూసుకోవటమే గాని నిద్ర రాదు. నేను నిద్రపోవటం

అంటే ఇంక లేవకపోవటమే"

'ఎచటకి పోతానీ రాత్రికి' అన్న శ్రీశ్రీ గుర్తొచ్చారా క్షణం.

'ఆవలిగట్టుకి' అని ఆయన సమాధానం చెప్పుకున్నా ఆవలిగట్టుకు చేరటం మనిషికి సాధ్యపడుతుందా? నిద్రపోవటం అంటే మరణించటమే అంటున్న ఈ అభాగ్యుడైన తండ్రికి ఏ సమాధానం ఓదార్పునివ్వగలదు? వచ్చేముందు ఆయనతో అన్నాను–

"నిరాశపడకండి. మీ భరత్ ఎక్కడున్నా తిరిగి వస్తాడు. అతను ఒకానొక భావావేశంలో వున్నాడు. జీవితానుభవం వెనక్కి తిరిగి చూసుకునేలా చేస్తుంది. అప్పుడు తను ఏం కోల్పోయాడో తెలుసుకుంటాడు. ఆశయం అంటే అన్నింటినీ విడిచిపెట్టడం కాదని గ్రహించాక ఏం చేయాలో నేర్చుకుంటాడు. తప్పకుండా నేర్చుకుంటాడు"

ఆయన కళ్ళు మెరిశాయి!

* * *

భూమి గుండ్రంగా వున్నట్లు తిరిగి నేను నాబెర్త్ దగ్గరకి వచ్చాను. మనిషికి అవసరమైన వాటిల్లో 'నిద్ర' కూడా ఒకటి కదా! అందులోనూ ఈ దేశంలో చాలామందికి కష్టాల వల్లా, రకరకాల దురాశల వల్లా నిద్రపట్టదు. వారికి నిద్రపట్టించటాన్ని వ్యాపారంగా స్వీకరించిన మందుల కంపెనీలు ఎన్నో వున్నాయి.

కుర్రవాళ్ళిద్దరూ ఇంకా కబుర్లు చెప్పుకుంటూనే వున్నారు. నన్ను చూసి నవ్వు ముఖాలు పెట్టారు.

బెర్త్‌మీదకి ఎక్కి పడుకున్నాను. లైటు వెలుగుతూనే వుంది. కిందకు వంగి చెప్పాను–

"బాబూ లైట్ తీసేద్దామా"

"అలాగే" అని ఒకతను స్విచ్ ఆఫ్ చేశాడు.

కళ్ళు మూసుకున్నాను.

'నిదురపోరా తమ్ముడా' అనే పాట గుర్తొచ్చింది.

ఆ పాటంటే నాకెంతో ఇష్టం. ముఖ్యంగా నా భార్యకు పాట పాడటం రాదుగానీ, ఆమె ఆ పాట పాడుతుండగా వినాలనేది నా తీరని కోరిక. ఈ పాటికి పిల్లలు ఇంటికి వచ్చుంటారు. చిన్నిగాడైతే 'మద్రాసు వెళ్ళారా' అనడుగుతాడు. 'ఈసారన్నా

మాకేమన్నా తెస్తారా' అనంటాడు. తను నవ్వుతుంది.

'మీ నాన్నగారి సంగతి తెలుసుగా. అయినా ఆయనకు బయటకు వెళ్ళడం కుదురుతుందో లేదో' అంటుంది. అప్పుడు వాడు బుంగమూతి పెడతాడు. అప్పుడు తను పెద్ద పోజు పెడుతుంది.

"ఉండండయ్యా మీ నాన్నగారు కూడా బోల్డన్ని డబ్బులు సంపాదిస్తారు. అప్పుడు మీకు ఏం కావాలంటే అది కొనిపెడతారు. అయినా మీకేం కావాల్రా నాలుగు జతల బట్టలు. అంతేగా? ఇకనుండి ప్రతి పండక్కీ మీకు కొత్తబట్టలు శాంక్షన్ చేస్తాం"

"అవున్లే. ఒక జత కొంటారు. నేనూ అన్నయ్య వాటిని తొడుక్కోవాలి"

"అలా కాదు. ఎవరి బట్టలు వారికే"

"ఇంకా ఏం చేస్తారు?"

"నెలకోసారి అందరం బయటకు వెళ్తాం. మంచి హోటల్లో భోజనం. ఎవరికేది కావాలంటే అది తినేయటమే. ఐస్‌క్రీమ్‌లూ, ఫ్రూట్‌సలాడ్లూ మీ ఇష్టం" అంటుంది.

నమ్మలేనట్లు చూస్తాడు.

"ఇంక మీకేం కావాలో అడగండి. మేమిద్దరమయితే దేశమంతా తిరిగివస్తాం"

"మేమూ వస్తాం"

"మీకు చదువులు పాడవుతాయి"

"అమ్మా ఇవన్నీ కాదు. మనకి కావలసింది ఒకటే"

"ఏంటిరా"

"ఇల్లు"

ఓ క్షణం ఆమె ముఖంలో ఆలోచన.

"అది ఇప్పుడే కాదయ్యా... చూద్దాం. అయినా ఆ ఇల్లు కట్టుకునే పని మీరు చూసుకోండయ్యా. మమ్మల్ని ఇంతటితో వదిలేయండి" అంటుంది.

"అదేం కుదరదు. మనం ఎప్పటికైనా ఇండిపెండెంట్ ఇల్లు తీసుకుందాం లేదా కట్టుకుందాం. మన ఇంటి ముందు మంచి గార్డెన్ వుండాలి. అందులో రకరకాల క్రోటన్స్ వుండాలి"

చిన్ని చెప్పుకుపోతుంటాడు. "అందులో పిట్టలకోసం చిన్నచిన్న మట్టిపాత్రల్లో నీళ్ళు వుంచాలి".

ఇలాంటివే వాడికి రకరకాల కలలున్నాయి. అవన్నీ ఎప్పుడు అమలు జరుగుతాయా అని ఎదురు చూస్తుంటాడు. నేనే అన్నీ గాలిమేడలు కడతాననుకుంటే నాకంటే ఎక్కువ కడతాడు వాడు.

బండి వేగంగా పరుగులు తీస్తోంది.

సమయం ఎంతకీ గడవటం లేదు. కొన్ని గంటలు గడవటానికి ఇంతసేపు పడుతుంటే రోజులూ, సంవత్సరాలూ ఎలా గడుస్తాయి? అదలా వుంటే... చిన్నతనంలో ఆ రోజులన్నీ ఎందుకంత త్వరత్వరగా కరిగిపోయాయి. నా ఆలోచనలు తిరిగి మా బాల్యం మీదకు పాకుతున్నాయి.

* * *

అరుపులూ, కేకల్తో మెలకువ వచ్చింది. ఉలిక్కిపడి లేచాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. ఏదో స్టేషన్‌లో ఆగింది. జనం అంతా నిద్రపోతున్నట్లున్నారు. దిగే వాళ్లు మాత్రం తమ సామాన్లు తీసుకొని వెళ్తున్నారు. నాకు కిందకి దిగాలనిపించింది.

బయటకు వెళ్ళాను. కోలాహలంగా వుంది. ఓ కంపార్ట్‌మెంట్ దగ్గర కుర్రవాళ్లు కనిపిస్తున్నారు. "బయటకు రావాలి" "బయటకు రావాలి" అని అరుస్తున్నారు. ఎవరినో అర్థం కాలేదు. ఏ రాజకీయనాయకుడినైనా ఘెరావ్ చేస్తున్నారా లేక నిరసన ప్రకటిస్తున్నారా అనుకున్నాను.

అటుగా వస్తున్న ఒకాయన్ని ఆపి "ఏంటి సార్ గొడవ" అన్నాను.

"అదా ఎవరో సినిమా యాక్టర్ ఆ పెట్టెలో వుందట" అనేసి వెళ్ళిపోయాడు.

ఇంత రాత్రి సమయంలో అంతమందికి ఆ తార గురించి ఎలా తెలిసిందో అర్థం కాలేదు. సాధారణంగా లిస్ట్‌లు చదివి, పేర్లు కనిపిస్తే ఒకరొకరుగా చేరుతుంటారు. ఈ చుట్టుపక్కల ఎక్కడో షూటింగ్ జరుగుతుందేమో. సిగ్నల్ ఇచ్చారు. ఇంకా పెద్దగా అరుస్తున్నారు. నేను రైలు ఎక్కాను. రెండు నిముషాలకు బండి కదిలింది.

తలుపులమీద బాదుతున్నారు.

ఈలలూ, కేకలూ, బీభత్సం. నిద్రపోతున్న వారంతా ఏం జరిగిందోనని కంగారుగా

లేచారు. పక్కవారిని అడిగి తెలుసుకున్నారు. బండి ఆ గోలని అధిగమించి ముందుకు సాగిపోయింది.

"బంగారం లాంటి నిద్ర చెడగొట్టారు. అమ్మా బాబూ సంపాదించి పెడుతుంటే తిన్నది అరక్క స్టేషన్లెంబట పడ్డారు. రేపు ఉద్యోగం, సద్యోగం లేక ముష్టెత్తుకోవాల్సి వచ్చినప్పుడు తెలుస్తుంది" తిడుతున్నారెవరో.

"సినిమావాళ్లంటే చాలా వేలం వెర్రి. ఈ దరిద్రం పోయేదాకా ఈ దేశం బాగుపడుదు" ఎవరికి తోచిన వ్యాఖ్యానం వారు చేస్తున్నారు. వీటన్నింటితో ఏమీ సంబంధం లేనట్లుగా బండి ముందుకు పోతూనే వుంది. తిరిగి నిద్ర రాదు. ఏంచేయాలో తెలియదు.

ఆలోచనలు... ఆలోచనలు...

జ్ఞాపకాలు... జ్ఞాపకాలు...

ఎటునుండి ఎటు పోతాయో తెలియదు. ఈ రాత్రి త్వరగా కరిగిపోతే బాగుంటుంది. ఇలాకాదు కొత్తకథ గురించి ఆలోచిస్తే బాగుంటుందా? ఇప్పటికిప్పుడు అంత మంచి ఆలోచన రాగలదా?

ఈ విషయంలో ఇంగ్లీషు సినిమాల పద్ధతి బాగుంటుంది.

ఓ చిన్న విషయం తీసుకుని కథ చెప్పేస్తారు. కథను ఎంత బాగా చెప్పటమా అనేది ఆలోచిస్తారు తప్పించి, అడుగడుగునా మలుపుల కోసం తాపత్రయ పడరు. ఓ గంట జీవితాన్ని సినిమాగా తీయగల ధైర్యం వుంది. అందరికీ అన్నీ అని వారు అనుకోరు. కేవలం ఓ దీర్ఘ కవితను సినిమాగా తీసి ప్రయోగం చేశారు. డాక్యుమెంటరీల్లోనూ ప్రయోగాలు చేశారు.

అలాంటి మంచిమార్పు ఎప్పుడైనా వస్తుందో రాదో... రావాలి. లేకపోతే సినిమాలు మారవు. మారకుంటే జనం చూడరు. అందుకే కొన్ని కథలకోసం ప్రయత్నం చేయాలి. రోజువారీ కథలకు అవి భిన్నంగా వుండాలి. ముందు అలాంటివి తయారుచేసి పెట్టుకుంటే ఏదో రోజు ఆ టేస్టున్న వ్యక్తులు దొరుకుతారు.

మళ్ళీ ఆ కుర్రాళ్ళు గుర్తొచ్చారు. రైలుని బాదటం గుర్తొచ్చింది. మేమూ అంతే. రెండుసార్లు మాత్రం రైలు మీద దాడిచేశాం. ఆరోజు 'బంద్' పిలుపిచ్చారు. బంద్

అనగానే రైలుకి అడ్డంగా పడుకోవాలి. అద్దాలు పగలగొట్టాలి. ఇంకా సీట్లు విరగొట్టాలి. మరింత ఉత్సాహం వస్తే నిప్పుపెట్టాలి. రెండుసార్లూ రెక్కలు తెగిన పక్షిలా మిగిలింది రైలు.

మా మాస్టారు అలాంటి పని చేసినందుకు తిట్టారు. బాధపడ్డారు. “ఇలాంటి దుర్మార్గం చేయటానికి మీకు చేతులెలా వచ్చాయి” అన్నారు.

ఎవరూ మాట్లాడలేదు. ఈసారి అలా చేయకూడదని మాత్రం అనుకున్నాం. కానీ బంద్ అంటే బద్దలుకొట్టాల్సిందే. షాపులు కట్టేయని వారిమీద పడి అందినవాడు అందినట్లు లాక్కుపోవలసిందే.

దొంగతనంలో ఆనందముందో, అలా తేవటంలోని ధైర్యానికి ఆనందం కలుగుతుందో తెలియని స్థితి ఆనాటిది.

చాలా ముందుకొచ్చాం. ఇప్పుడు మరింత ఎక్కువగా రైళ్ళూ, బస్సులూ అందరి విధ్వంసానికి గురవుతున్నాయి. ఎవరూ ఈ విషయాల గురించి సీరియస్‌గా ఆలోచించటంలేదు. బహుశా అనవసరం అనిపిస్తుందేమో!

ఎవరిదో గురక వినిపిస్తోంది. అదృష్టవంతుడు. లోకుల నిద్ర చెడగొట్టి తను మాత్రం హాయిగా నిద్రపోతున్నాడు. చల్లటి గాలి సందుల్లో నుంచి వస్తూనే వుంది.

విమానంలో వచ్చుంటే ఈ పాటికి మద్రాసు చేరిపోయేవాడ్ని. విమానం ఎప్పుడైనా ఎక్కడం సాధ్యపడుతుందా? ఆ మేఘాల్లోంచి దూసుకుపోతూ... సముద్రాల్నీ, మనుషుల్నీ, పర్వతాల్నీ చూడగలనా?

ఇంతకూ రేపు ఉదయం విమానం సరిగ్గా లాండవగలదా?

వానలు కురుస్తున్నాయి కాబట్టి వెనక్కి మళ్ళిస్తారా?

ఎవరైనా హైజాక్ చేస్తారేమో. రావ్ రేపు మద్రాసు రావటానికి కుదరదు. నేను కొత్త. ఒక్కడ్నీ అక్కడుండి చేయగలిగేదేం వుండకపోవచ్చు. అదే జరిగితే ఆ అనుభవాన్ని మంచి సినిమాగా రావ్ మలచగలరు. నాకు ఇలాంటి సంఘటన గురించి ఎవరో చెప్పిన జ్ఞాపకం. అది సినిమానా, ఆంగ్ల నవలా అనేది గుర్తురాలేదు.

అదో అందమైన ప్రాంతం. అక్కడికి ఎందరెందరో వస్తుంటారు. అదో పెద్ద వంతెన. దానిమీద నుండి చూస్తుంటే ఆ అందాలన్నింటినీ ఎంజాయ్ చేయవచ్చు.

ఆ రోజు కూడా అనేకమంది వచ్చారు. అందాల్ని తిలకిస్తున్నారు. అకస్మాత్తుగా ఆ వంతెన కూలిపోయింది. చాలామంది చచ్చిపోయారు.

అయితే అంతకుముందు అటునుండి ఓ కారు వెళ్ళింది. అందులోనుండి ఓ మిలియనీర్ దిగాడు. వంతెన కొలాప్స్ కావటాన్ని చూస్తూనే వున్నాడు. క్షణంసేపు మాటలు రాలేదు. మృత్యువుకీ, జీవితానికీ నడుమ తేడా కొద్ది ఘడియలు.

చనిపోయినవారందరూ అందాల్ని చూడటానికి వచ్చినవారు. అందమైన అమ్మాయిలు, అప్పుడే జీవితంలోకి ప్రవేశిసున్నవారు, ముక్కుపచ్చలారని పిల్లలు. శవాలన్నింటినీ పడుకోబెట్టారు. ఆ మిలియనీర్ లేదా రచయిత ఈ సంఘటనకి చలించిపోయాడు. అతనికి మరణించిన వారందరి గురించి తెలుసుకోవాలనిపించింది.

ఆ క్షణంలో వారందరూ అక్కడ వుండటానికి ప్రేరేపించిన అంశాలేమిటి? మృత్యువుని వెతుక్కుంటూ వాళ్ళు ఎందుకు వచ్చారు? ఈ కాకతాళీయ సంఘటన వెనక అర్థం కాని సూత్రం ఏమైనా వుందా? ఇలాంటి సంఘటనే ఓ గుడిలో జరిగిందని ఆయన చెప్పారు. విపరీతమైన రద్దీలో గర్భగుడిలో జరిగిన తొక్కిసలాటలో ఇరవై మందికి పైగా చనిపోయారు.

ఏ కర్మ వారినిలా లాక్కువచ్చింది. వారి జీవితాల్లోకి వెళ్ళాలి. అవన్నీ తెలుసుకుంటే గొప్ప రచన చేయవచ్చు. కాకుంటే రచయిత చాలా కష్టపడాలి. ఎక్కడెక్కడి నుంచి వచ్చారో ఆ ప్రాంతాలకు వెళ్ళాలి. ఆ మనుషుల్ని కలుసుకోవాలి. ఇందుకు సమయం కేటాయించాలి. ఖర్చులు భరించగలగాలి. ఇలాంటి ప్రయోగాలు అక్కడ చేయగలరు. అప్పటికీ నేను కొంతమందికి చెప్పాను. ఎవరూ పెద్ద ఉత్సాహం చూపించలేదు. ఖర్చులు నేను భరిస్తానని కూడా చెప్పాను అన్నారాయన.

నిజమే. ఈ సంఘటన ఇలానే ఎందుకు జరగాలి. వారికే ఎందుకు జరగాలి. చిటికెలో పరిస్థితులు ఎందుకు మారిపోవాలి. స్థూలంగా చూస్తే ఓ రకంగా అనిపిస్తుంది. సూక్ష్మంగా వెళ్తే అందులో ఏదో వుండి వుంటుంది. అది జీవితపు గొలుసు. జాగ్రత్తగా వెతుక్కుంటే ఆ 'లింక్' దొరుకుతుందేమో.

ఎక్కడ మొదలై ఎక్కడికి చేరుకుంటున్నాయి ఆలోచనలు. నదిలా ఆరంభమై, అలా పరుగులు తీసుకుంటూ, పంటపొలాల్ని తడుపుకుంటూ, భూమితో పులకిస్తూ,

సంగీతం వినిపిస్తూ, అంతిమంగా సముద్రంలో విలీనం అయినట్లు ఆధ్యాత్మికతలోకి వెళ్ళిపోతున్నానా… మనిషి అక్కడికి రాక తప్పదా… ప్రయాణంలో చిట్టచివరి స్టేషన్ అదే అయుంటుందా?

తిరిగి కళ్ళు మూతలుపడుతున్నాయి.

ఆలోచనల్ని దూరం చేయటానికి ప్రయత్నం చేస్తున్నాను. మనసుని కేంద్రీకరించి ఇంకెలాంటి ఆలోచనలు రాకుండా శూన్యం చేయాలనే వెర్రి తపన. సాధన చేయకుండా ఇవన్నీ ఎలా పట్టుబడతాయి? నిస్సహాయంగా కళ్ళుతెరచి చూస్తూండిపోయాను.

అలా ఎంతసేపో తెలియదు. మెల్లమెల్లగా నిద్రా, వాస్తవం, రకరకాల ఆలోచనల నడుమ మాగన్నుగా నిద్రపట్టింది…

గడియారం ముళ్ళు కదులుతున్న చప్పుడు…

ఉలిక్కిపడ్డాను.

రైలు ముందుకు పోతూనేవుంది. టైమ్ చూశాను.

రెండు గంటలు…

అంటే తేదీ మారింది.

'డిసెంబర్ 6'

తిరిగి నిద్ర పట్టలేదు. జరిగిపోయిన సంఘటనల్ని మెదడు కళ్ళముందు పేర్చుకుంటూ పోతోంది. ఆ సంఘటన జరిగినప్పుడు నేను హైదరాబాద్‌లో లేను. వాటి ప్రకంపనలు మేమున్న ప్రాంతంలో స్వల్పమే. కానీ అందరిలోనూ ఏదో జరిగిపోతుందనే భావన. అది ఆవేశమో, ఆక్రోశమో ఇంకే భావమో తెలియదు.

ఉదయమే పేపర్ల నిండా వార్తలు…

అటు తర్వాత బొంబాయిలో జరిగిన బాంబ్ విస్ఫోటనాలు.

మనుషులంతా పరుగులు తీస్తున్న దృశ్యం.

"ఈ నగరాలు మాకొద్దు. ఈ విద్వేషాలు మాకొద్దు. కడుపుకు పిడికెడు ముద్ద కోసం జీవితాల్ని పణంగా పెట్టాం. వధ్యశిలల మీద నిలబడ్డాం. వెన్నెముకలు విరుచుకుంటున్నాం. పగలూ, రాత్రీ ఈ పాడుజీవితం కోసమే సిగ్గునీ, అభిమానాన్నీ చంపుకుంటున్నాం. అయినా జానెడు స్థలం దొరకటం కష్టంగా వుంది. బతుకు

భారంగా వుంది. ఏ క్షణమైనా ముక్కుమూసుకుని కట్టెలా బిగుసుకుపోవాలనుంది. నగరాలూ, భూములూ–మీకు ఏవీ చాలటం లేదు. మనుషులు ఇలా బతకటం కూడా ఇష్టంలేని కొంతమంది దురాశకు లక్షల–కోట్లు నడుస్తున్న శవాలయ్యారు.

బాబులూ... ఏలుకోండి నగరాల్ని... పంచుకోండి దేశాన్ని. మీలో మీకు బేరసారాలు కుదరాలి. మా శరీరాల్ని ముక్కలు చేసి తలో అంగం అమ్ముకోవాలి. మేం వెళ్ళిపోతాం. మాకంటూ మిగిలిన రెక్కల సాక్షిగా చెబుతున్నాం.

అమ్మకీ, నాన్నకి పుట్టినవాళ్ళే మీరు. తల్లిపాలు తాగి ఎదిగినవాళ్ళే మీరు. బాల్యంలో మీ ముఖాల్లో ఇంత కాఠిన్యం లేదు. అమాయకమైన అందమైన ముఖాలే. ఇప్పుడెందుకు మీలో రాక్షసత్వం పాకిందో తెలియదు. 'రాజకీయం' పేరెందుకు పెట్టుకున్నారో తెలియదు. మాకు మీలో మృగాలు కనిపిస్తున్నాయి. ఎంత నీచానికైనా సిద్ధపడుతున్న మీ అందరికీ దూరంగా వెళ్ళిపోతాం. భవనాలూ, ఫ్యాక్టరీలూ, భూములూ సర్వస్వం మీరే స్వంతం చేసుకోండి. పరిపాలించండి"

చెవుల్లో కొన్ని వేల కంఠాల ఘోష. భయానకమైన ఆ రాత్రుల గురించి ఏ భాషా నేర్వని అమాయక ప్రజల కథనంలో గుండెలు పిండించే విషాదం. ఎవరు నోరు తెరిచినా ఓ ఎలిజీ. ఓ దుఃఖగీతం. వారి కన్నీళ్ళకి శపించే శక్తుంటే ఈ సమస్త దుష్టరాజకీయాలు అంతం అయిపోతాయి. చరిత్రపుట వెనక ఈ నీచ, నికృష్ట రాజకీయాలు కాసిన్ని సీట్ల కోసం బ్యాంక్ ఎకౌంట్ల కోసం, అభద్రతతో కోట్లు కోట్లు వెనకేసుకోవటానికి కులాన్ని, మతాన్ని పెంచి పోషించిన పారసైట్లుగా కప్పబడిపోతారు.

ఎవరో అరుస్తున్నారు.

"రేయ్... మీకంటే ముందు ఎందరెందరో ఈ ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలనుకున్నారు. యుద్ధం అందుకు శరణ్యం అనుకున్నారు. మానవ కంకాళాల మీద నడిచారు. మనిషి నిర్మించుకున్న వాటన్నింటిని కూలదోసుకుంటూ పోయారు. అలెగ్జాండర్లు, హిట్లర్లు, ముస్సోలినీలు, తెల్లవాళ్ళు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎవరు మిగిలారు. చరిత్ర పెంటకుప్పలమీద గబ్బుకొడుతున్న అశుద్ధంలా మిగిలారు. ఈ ప్రపంచంనుండి వెళ్తూ పట్టుకుపోయేదేం లేదన్న అలెగ్జాండర్ చేతులు చూడండి. నేలమాళిగలో సిగ్గుతో, అవమానంతో చితికిన హిట్లర్ తనని తాను చంపుకోవటాన్ని

చూడండి. మీ బతుకుల పరిష్కారాలూ అవే..."

ఉక్కపోస్తూంది. తలుపులు తీయాలంటే సంకోచం. ఓ ప్రచండ మారుతంలా గాలి చొరబడుతుంది. ఆదమరిచి నిద్రపోతున్న అందరినీ అల్లకల్లోలం చేస్తుంది. వారు ధ్యానం నుండి, కలల నుండి, ఆశల నుండి, కోర్కెల నుండి ఉలిక్కిపడి లేస్తారు.

ఇంక వారి కళ్ళు మూతలుపడవు. మండుతున్న కళ్ళతో శూన్యంలోకి చూస్తూ కూర్చుంటారు.

మానవ జన్మ సర్వోత్కృష్టమని ఎవరు ప్రవచించారో తెలియదు. మనిషి ఇంకే మాత్రం మనిషిగా మిగలకపోవటమే నాగరికతగా మారిపోయిన క్షణాలివి...

ఉద్వేగం క్రమంగా తగ్గుముఖం పట్టింది. 'నిద్రా... నిద్రా కొన్ని గంటలు నన్ను తాకిపోవా' అనుకున్నాను.

"ఆలోచనాపరులకు నిద్రలేని రాత్రులే కానుకలు. వాటినుండే గమ్యాలు. వాటినుండే కొత్త అడుగులు. కవీ... ప్రపంచమంతా నిద్రిస్తున్నప్పుడు కాపలాకాయవలసిన వాడివి. మేల్కొనవలసిన వాడివి నువ్వు... మేల్కొనటం నీకు చేతనైతే మేల్కొలుపుతావ్..."

'ఎవరు మాట్లాడుతోంది. ఎవరది. నా ఎదురుగా రండి' అరవాలనుకున్నాను. సాధ్యంకావటంలేదు. ఎవరో నా నోటిని బలవంతంగా మూశారు. ఊపిరాడటంలేదు. కనుగుడ్లు బయటకు వస్తున్నాయి. చిట్టచివరి ప్రయత్నంగా బలవంతాన విసిరికొట్టాను. రక్తం పరుగందుకున్న భావన. లేచి కూర్చున్నాను.

చెమటలు...ఎందుకిలా అవుతోంది.

ఏదో జరగబోతోంది?

ఏమిటది?

రాబోయే తుఫానుని జంతువులు ముందుగానే పసికట్టినట్లు ఎక్కడినుండో సంకేతాలు అందుతున్నాయి. ప్రమాదం ముంచుకు రాబోతూంది. అదెటునుండో అర్థంకావటంలేదు. ఇప్పుడేమిటి చేయటం. అందరూ గాఢనిద్రలో వున్నారు. మేల్కోండి అంటే వింటారా? వినరు.

తమ బంగారు నిద్రనీ, రంగుల కలల్నీ ధ్వంసం చేశావంటారు. దుమ్మెత్తిపోస్తారు.

ఏమైనా జరగనీ ముందు ఈ ప్రమాదాన్ని ఆపాలి. చైన్ లాగితే ఎలా వుంటుంది. ఒక్కసారి గొంతు చించుకుని అరిస్తే అందరూ లేస్తారా... 'రండి మైదానాల్లోకి పారిపోదాం' అంటే అందరూ వస్తారా... రైలును ఏకాకిని చేసి రావటానికి అంగీకరించరు.

నాకింక పడుకోవటం, పడుకోవటానికి ప్రయత్నించటం నేరం అనిపించింది. కిందకి దిగాను. తలుపు దగ్గిరికి నడుస్తున్నాను. ముసలాయన కేసి చూశాను. నిద్రపోతున్నారు. అక్కడే నిలబడ్డాను.

'నిద్రంటే మరణమే' అన్న ఆయన మాటలు గుర్తొస్తున్నాయి.

'నిద్రే' అయితే అదృష్టవంతుడు.

'భరత్' గురించిన ఆశాభావం ఆయనకి ఆ ప్రశాంతతనిచ్చి వుంటుంది.

మరణం అయితే–

కావేరి దురదృష్టవంతురాలు. ఆమె వివాదాస్పద జీవితం మరింత వివాదం అవుతుంది. ఆ అమ్మాయి తల్లి మరింతగా ద్వేషిస్తుంది. 'నీ మూలంగా నా మాంగల్యం తెగింది' అంటుందేమో. ఆయన జేబులు వెతికితే 'కావేరి' చిరునామా దొరుకుతుందేమో... ఆయన మరణమే నిజమైతే నేనేం చేయాలి? ఆ అమ్మాయిని వెతుక్కుంటూ వెళ్ళాలి.

"అమ్మా మీ నాన్న చివరిమాటలు చెబుతున్నాను. మనిషికీ మనిషికీ నడుమ సంబంధాలు ధ్వంసం కాకూడదు. నీ పిల్లలకి ఈ ముక్కలు చెబుతావని ఇంత దూరం వెతుక్కుంటూ వచ్చాను" అని వచ్చేయాలి.

ఆయన్ని మేల్కొలిపితే బాగుంటుంది. ఆయన నా మాట వింటాడనే నమ్మకముంది. నిజంగానే ఇన్ని సంవత్సరాల తర్వాత ఆయనకు తృప్తిగా నిద్రపట్టి వుంటుంది. 'భరత్' విషయంలో ఆయనకి ఓ నమ్మకం కలగటంతో పాటు కావేరిని కలుసుకోవటం అనే విషయం ఆయన్ను నిస్సందేహంగా సంతోషపెడుతుంది.

నేను తలుపులు తీస్తాను. ఆయన్ది నిద్రకాకపోతే వాతావరణంలో మార్పుని వెంటనే గ్రహిస్తారు.

తలుపులు తీశాను. చల్లగాలితోపాటు రెండు చినుకులు ముఖాన్ని తాకాయి.

వాన రాబోతుందా? ఆకాశం కేసి చూశాను. నల్లటి మేఘం కనిపించింది ఏక్షణమైనా నేను దాడిచేస్తానన్నట్లుగా...! ఎక్కడినుండో కొద్దిపాటి వెలుగు. ప్రకృతంతా విషాదంలో మునిగి పోయినట్లుగా వుంది.

నేనలా చూస్తుంటే రవీంద్రుడు తలపుకొచ్చాడు.

'గీతాంజలి' గుర్తొచ్చింది.

'ఎక్కడ అసమానత వుండదో... ఎక్కడ కులమూ, మతమూ మనిషి వికాసానికి అడ్డంగా వుండవో... ఎక్కడ బతుకు భయం వుండదో, ఎక్కడ అందరూ చేతులు కలిపి 'మానవీయ' విలువలకై హారంగా బారులు తీరతారో, ఓ ప్రభువా మమ్మల్ని అక్కడ పుట్టించు. దేవుడా మా మొర ఆలకించు... అల్లా దయాకరో'

నా మనుసులో అక్షరాల వెల్లువ.

'టు మై కంట్రీ విత్ లవ్' నేనో గీతం రాయాలి. ఏభై సంవత్సరాల స్వేచ్ఛ తరువాత తలవంచి అభివాదం చేయాలి.

ఎవరు స్వతంత్రం నా జన్మహక్కని ప్రకటించారో...

ఎవరు స్వేచ్ఛకోసం ఉరికంబాలు ఎక్కారో

ఎవరు దేశంకోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేశారో

ఎవరు అహింసా పరమోధర్మః అన్నారో

ఏ ప్రజలు తమ బిడ్డలకోసం జీవితాల్ని అగ్నితో పునీతం చేసుకున్నారో వారందరికీ ఇవే మా శతకోటి కృతజ్ఞతాభివందనాలు.

వృధాకాదు వృధా కాదు మీ త్యాగం...

దేశం ముద్దుబిడ్డలను ఎన్నటికీ మరువదు...

సగర్వంగా... సమున్నతంగా నినదిస్తాను.

'ఐ లవ్ మై ఇండియా'

మెల్లగాపెదవులు విచ్చుకుంటున్నాయి.

ఒకరు... ఇద్దరు ... వందలు... వేలు... లక్షలు... కోట్లు కంఠస్వరాలు

ఒక్కసారిగా ఎలుగెత్తి... కోరస్‌గా...

'ఉయ్ లవ్ అవర్ ఇండియా'

ఒక్క క్షణం అర్థం కాలేదు.

భూమి బద్దలయిందా...

ఆకాశం రెండుగా చీలిపోయిందా...

వెయ్యి పిడుగులు వర్షించాయా...

ఓ విస్ఫోటనం... వెనక్కి విరుచుకుపడ్డాను...

"అమ్మా" అని అరిచాను.

తల తలుపుకి గుద్దుకుని చిట్లిన శబ్దం...

ఆ తలుపు తీసివుంటే అమాంతం విసిరివేయబడి వుండేవాడినేమో!

స్పృహ తప్పుతుందా?

తలమీదకు చేయి వెళ్తోంది. బుస్సున పొంగినట్లు బుడిపె తగిలింది. చేతులకు రక్తపు చార... అక్కడ గడ్డకట్టి పోయిందా... మెదడింక పనిచేయదా...

చెవులు రిక్కించాను. బండి కీచుమంటూ ఆగింది.

గోలగోలగా అరుస్తున్నారు. పరుగులు తీస్తున్నారు. ఎవరో నా కాలుని తొక్కి తలుపు లాగారు. 'అమ్మో' అని అరిచానా...! లేచి కూర్చున్నాను.

కంపార్ట్‌మెంట్‌లో కిందపడినవారూ... నిద్రనుండి లేచి ఏం జరిగిందో అర్థం కాని వారూ... 'పానిక్' అయిపోయారు.

బతుకు భయం అంటే ఏమిటో అప్పుడే అర్థమౌతోంది.

ఇంతకూ ముసలాయన లేచారా?

బలవంతంగా లేచాను. నన్ను నెట్టేస్తున్నారు.

"పదవయ్యా ట్రైన్ నిండా బాంబులు పెట్టారు. బ్లాస్టవుతున్నాయి" అరిచారెవరో.

అంటే... అనుకున్నంతా అయింది.

నేను ముసలాయన దగ్గరకెళ్ళాను. కింద కూర్చున్నాడు. అయోమయంగా చూస్తున్నాడు.

"సార్. రండి బయటకు వెళ్దాం"

మాట్లాడలేదు.

భుజాలు పట్టుకుని ఊపేశాను.

జీవంతోనే వున్నాడు. చంకల్లో చెయ్యి వేసి పైకి లేపాను. ఇద్దరు ముగ్గుర్ని బలవంతంగా నెట్టేసి ఆయన్ని కిందకు దించాను. అది స్టేషన్‌కాదు. స్టేషన్ ఎంత దూరంలో వుందో తెలియదు. ఓ చోట కూర్చోబెట్టి తిరిగి రైలు ఎక్కాను. ఆయన బ్యాగ్ అందుకున్నాను. నా బెర్త్ దగ్గరికి వెళ్ళాను.

సూట్‌కేస్ ఓ మూలనుంది. బ్యాగ్‌కూడా. వాటిని అందుకున్నాను. దిగివచ్చి ఆయన్ని కదిపాను.

ఇంకా దిగ్భ్రాంతి నుండి ఆయన కోలుకోనేలేదు.

జనం దూరంగా పారిపోతున్నారు.

ఇప్పుడేమిటి చెయ్యటం?

ఇంకా బాంబులున్నాయా?

అవి పేలతాయా?

ఎందుకైనా మంచిదని ముసలాయన్ని బలవంతాన కదిలించాను. దూరంగా తీసుకెళ్ళి కూర్చోబెట్టాను.

అప్పుడు గమనించాను.

రెండు బోగీలు ధ్వంసానికి గురయ్యాయి.

ముసలాయనకి చెప్పాను–

"సార్ వీటిని చూస్తుండండి. నేను అక్కడికి వెళ్ళొస్తాను"

ఆయన తలూపాడు.

నేను అటు నడిచాను.

"ఏం జరిగిందండి" అన్నాను ఎదురుగా వస్తున్నవారిని.

"బాంబ్ బ్లాస్టింగ్"

"జనం చచ్చిపోయారా?"

"ఆఁ... అక్కడ శవాలు భయంకరంగా పడున్నాయి"

"ఎంతమంది పోయుంటారు..."

"ఏమో... కనీసం ఓ వందమంది"

అందుకేనా అంత విస్ఫోటనం...

అప్పుడు గుర్తొచ్చింది శివశంకరి...

అదే కంపార్ట్‌మెంట్ అయుంటుందా? అయితే తను కూడా!

భోరున ఏడ్చేయాలనిపించింది. ఇంక ఆగలేకపోయాను. పరుగు తీసుకుంటూ అక్కడికి చేరుకున్నాను.

చేతులూ... కాళ్ళూ... మొండెందాకా తెగిపోయినవారు కనిపిస్తున్నారు. ఇలాంటి భయానక దృశ్యం ఎన్నడూ చూడలేదు. ఇదే మరో స్థితిలో అయితే ఈ చుట్టుపక్కలకు వచ్చివుండేవాడ్ని కాదు.

'ఆజాదీ భారత్ యాత్ర' చేస్తానన్న నా స్నేహితురాలు ఎ్కడ? కనిపించదేమిటి?

ఆగిపోయాను...

నవ్వుతూ 'ముంతాజ్'!

ముంతాజేనా? అలానే కనిపిస్తుంది. పాలవెన్నెల లాంటి రంగు. ఏ కలలు కందో... కంటూ నిద్రపోయిందో... ఇంకా ఆ నవ్వు చెదరలేదు. మొండెం నుండి శరీరం లేదు.

ముంతాజ్... అవును. ఆమెలో నాకు ముంతాజే కనిపిస్తోంది. నన్ను చూడగానే భయంతో ఆ ముఖం కుంచించుకుపోవటం గుర్తొచ్చింది. ఎంతటి యాదృచ్ఛికం... నాకు అదే బెర్త్ కన్‌ఫర్మ్ చేసుంటే ఈ పాటికి నేను సైతం ఖండఖండాలుగా మిగిలిపోయేవాడ్ని.

నాకు వంతెన కూలిపోయిన సంఘటన, గర్భగుడిలో మరణించినవారూ గుర్తొస్తున్నారు. ఏ కర్మ ఇలా నడుపించుకొచ్చింది. ఎందుకని మృత్యువు నన్ను తాకినట్లే తాకి దూరంగా వెళ్ళిపోయింది. నేను మరో రెండు అడుగులు ముందుకు వేశాను.

షాక్ తిన్నాను.

ఎవరినైతే నేను అనుమానించానో అతను. ఆకాశంలోకి చూస్తున్నాడు. ఆ కళ్ళలో ఎవరి మీదనో ఆగ్రహం కనిపిస్తోంది. అతను ఆడుకున్న కంప్యూటర్ పక్కన పడుంది.

అతను పాడిన పాట ఇంకా పెదవులమీద పలుకుతూనేవుంది.

'ఈ బండి మద్రాసుకి ఎప్పుడు చేరుకుంటుంది' అని అడుగుతున్నట్లే వుంది.

'మిత్రమా ఈ బండి మద్రాసు ఎప్పటికి చేరుకుంటుందో తెలియదు. తిరిగి ఈపెట్టెలు పట్టాలు ఎక్కుతాయో లేదో తెలియదు. ఒక్కసారి కళ్ళు తెరుచుకు చూడు. అదిగో రైలు బావురుమంటోంది'

రైలుకేసి చూశాను.

అవును రైలు ఏడుస్తోంది. పట్టాలు బాధతో వంకరలు తిరిగిపోయాయి. ఎవరు చేశారీ దుర్మార్గం... మెల్లగా ఆరంభమైంది కసి... ఛ... వీళ్ళు మనుషులు కాదు. వీళ్ళని తిట్టటానికి పదాలు లేవు.

'పాడు నేస్తం... నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నానంటూ పాడుకున్నావ్ కదా. అరెభాయ్... ఈ దేశం నీదీ నాదీ కాదు. దొంగలది. లుచ్చాలది. రక్తపు కూడు తినే కసాయిగాళ్ళది. అధికారం కోసం ఈ దొంగ... ఎంతైనా తెగిస్తారు. దేశపు శరీరం మీద గజ్జి కురుపులు. పాడు మిత్రమా సరికొత్త పాటపాడు. నీ గీతం ప్రజలందరూ అందుకునేలా పాడు. నిన్ను అనుమానించటం నా నేరం కాదు. మనిషికీ మనిషికీ నడుమ వున్న ప్రేమపూర్వకమైన వాటినన్నింటినీ ధ్వంసంచేసి అనుమానాన్ని, అభద్రతని పెంచినవారందరినీ...

బాబూ... అమ్మా... మీ తండ్రులే ఈ నికృష్టులైతే వారిని వెలెయ్యండి. వీళ్ళే మీ భర్తలైతే మంగళసూత్రాల్తో కొట్టండి. మీ అన్నలో, తమ్ముళ్ళో అయితే గాండ్రించి ఉయ్యండి... రేయ్- మానవ మృగాల్లారా... మీరన్నా వుండండి. మీ ఛాయలు మాకు సోకకుండా మమ్మల్నైనా వుండనివ్వండి. ఇంక మిమ్మల్ని భరించగల స్థితి దేశానికీ, దేశప్రజలకు లేవు'

హృదయఘోష... అవును కేవలం ఘోష. మానవ చైతన్యం ఉవ్వెత్తున పొంగిపొరలేదాకా ఇదుత్త ఘోష. పత్రికల సంపాదకీయాలు, వార్తలు, మేధావుల కవిత్వాలూ, ఉపన్యాసాలూ, కథలూ వీటిని ఆపగలిగితే ఈ దేశం మరోలా వుండేది.

అతను సరే... శివశంకరి ఎక్కడ?

కనిపించదే?

శరీరం గుర్తులకందకుండా ముక్కలైపోయిందా?

వెతుకుతున్నాను. కనిపించటంలేదు. ఎవరెవరో ఏడుస్తున్నారు. అందరూ తమ

వాళ్ల కోసం వెతుక్కుంటున్నారు.

యుద్ధరంగంలా వుంది...

"దాహం... దాహం" అంటున్నారెవరో.

అటూ ఇటూ చూశాను. దూరంగా మంచినీళ్ళ బాటిల్. అడుగున ఎక్కడో వున్నాయి. అతని నోటికి అందిస్తే తాగి భోరున ఏడ్చాడు...

"నేను చచ్చిపోతాను సార్... నా అమ్మ బతకదు... బతకదు..."

ఇంకెవరో దాహం అంటున్నారు.

పరిగెత్తుకుంటూ వెళ్ళాను. ఇంకా నీళ్ళున్నాయి. అందులో పట్టాను. ముందు వారి గొంతు తడవాలి. ఇంతకూ ఈ ప్రమాదం గురించి ఎలా తెలుస్తుంది? పక్క స్టేషన్ వారికి అనుమానం రావాలి. బండి ఎందుకు రాలేదో తెలియాలి. ఇలా కాదు. ముందు పరిగెత్తుకుంటూ వెళ్ళి ఎవరికన్నా ఈ వార్త చెప్పాలి. ఇంక ఆలస్యం చేయలేదు.

అతనికి మంచినీళ్లు తాగించి పరుగులు తీశాను.

ఆయాసం... రొప్పు వస్తూంది. వైద్యసహాయం అందితే కొంతమందినైనా కాపాడుకోవచ్చు. శరీరం నుండి వెచ్చటి పొగలు వస్తున్నట్లనిపించింది. ఆగిపోయాను. గుండె చప్పుడు వినిపిస్తోంది. కర్చీఫ్ తిరిగి నోట్లో పెట్టుకున్నాను.

పరుగు ఆరంభం. నాకా శక్తి ఎలా వచ్చిందో తెలియదు. దూరంగా ఇళ్ళు కనిపిస్తున్నాయి. ఆకాశంలో నల్లటి మేఘం మెల్లగా కదులుతూనే వుంది.

ఓ ఇంటిముందుకెళ్ళాను. దడదడమంటూ తలుపు తట్టాను. విసుగ్గా వచ్చి తలుపు తీశారు.

"సార్! రైలు ప్రమాదం జరిగింది. అక్కడ జనం బాధతో విలవిలలాడుతున్నారు. వాళ్ళని హాస్పటల్లో చేర్చాలి"

"ఎప్పుడు జరిగింది?"

చెబుతున్నాను. చుట్టుపక్కల ఇళ్ళల్లో లైట్లు వెలిగాయి. ఒక్కొక్కరే వస్తున్నారు. ప్రశ్నలమీద ప్రశ్నలు...

నాకు రొప్పు వచ్చేస్తోంది. మాట్లాడలేకపోతున్నాను. ఒకరినుండి మరొకరు ఆ

కబురు అందుకున్నారు. ఎక్కడో బండి స్టార్టయిన శబ్దం. నేనలా కూలబడిపోయాను. ఎవరో మంచినీళ్లు అందించారు. కుర్రాళ్ళు పరుగులు తీస్తున్నారు. ఆ గ్రామం మేల్కొంది.

కదలలేనివారూ, ఆడవారూ ఆగిపోయారు.

గుండెదడ కొంచెం కొంచెం తగ్గుతోంది.

"ఇప్పుడు చెప్పు నాయనా ఏం జరిగింది?" అంది ఒకావిడ.

"రైల్లో బాంబు పేల్చారు"

"బాంబా!" ఆమె కళ్ళలో భయం.

"అవును"

"ఎవరైనా పోయారా?"

"అవును. ఎంతమందో తెలియదు"

వాళ్ళు ముక్కున వేలేసుకున్నారు.

"కలికాలం వచ్చేసింది. బ్రహ్మంగారు ఎప్పుడో చెప్పారు. మనుషుల్ని మనుషులే అడ్డంగా నరుక్కునే రోజులొచ్చేశాయి" అంటున్నారు.

ఎవరో శాపనార్థాలు పెడుతున్నారు.

"వస్తానమ్మా" అంటూ లేచి బయలుదేరాను.

'మధు' గుర్తొచ్చింది.

'మద్రాసు నుండి ఏం తెస్తున్నారు'

'బహుశా గొప్ప అనుభవాన్ని'

మామూలు మాటలుగా అనిపించేవి ఇలాంటి సందర్భంలో శక్తివంతంగా మారతాయి. నేను లేకపోయుంటే ఈ మాటల గురించి మధు జీవితాంతం చెప్పుకుంటూనే వుంటుంది.

రావ్ గుర్తొచ్చారు. క్లైమాక్స్ అయిపోయిందా?

నవ్వొచ్చింది.

ఫిజికల్ క్లైమాక్సా? ఎమోషనలా?

ఫ్లైట్ లాండవుతుందా? హైజాక్ చేస్తారా?

'ఆజాదీ భారతయాత్ర' మొదలవుతుందా? రద్దవుతుందా?

ఈ దేశానికి స్వతంత్రం వచ్చిందా? రాలేదా?

వస్తే అది ఎవరికి?

కొడుకులూ, కూతుళ్ళూ అమ్మా నాన్నల మాటలు వింటారా? విడిచివెళ్తారా?

ఊర్మిళా? మహిమాచౌదరా?

వందేమాతరమా? 'భల్లేభల్లే'నా?

మల్టీమీడియానా? సాఫ్ట్‌వేరా?

అమెరికానా? ఆస్ట్రేలియానా?

గూడా? కూడా?

సృజనా? విధ్వంసమా?

అధ్యక్షపాలనా? పార్లమెంటరీ ప్రజాస్వామ్యమా?

బి.జె.పీనా, యు.ఎఫ్ఫా...

కాంగ్రెస్సా... ప్రాంతీయపార్టీలా?

వ్యక్తులా... సంస్థలా?

లెఫ్టా? రైటా?

ఇటా? అటా?

మరణమా? జీవితమా?

సెర్చ్... సెర్చ్ యువర్‌సెల్ఫ్...

యుద్ధమా? శాంతా?

అందమా? అసహ్యమా?

పెరిగిపోతున్నాయి... ప్రశ్నలు...

శ్వేతపత్రాలు ప్రచురించేవారూ... ఛార్జిషీట్లు పెట్టేవారూ...మైకులు విసిరేవారూ, పిడిగుద్దులు గుద్దేవారూ, ధర్నాలు చేసేవారూ, అందలాలు ఎక్కేవారూ, లాగేవారూ, ఎక్కాలనుకున్నవారూ...

అందరూ...

ఈ గడ్డపై ప్రభవించిన ప్రతి ఒక్కరూ...

శ్వేతపత్రం ప్రకటించండి...

ఇది బతుకా? చావా?

ఇంతకూ మనం ఎవరు?

మననేమందురు?

జనాన్ని కంట్రోల్ చేస్తున్నారు. క్షతగాత్రుల్ని పక్కకు తీసి తరలించే ఏర్పాట్లు మెల్లగా జరుగుతున్నాయి.

నా భుజంమీద చెయ్యి పడింది.

వెనక్కి తిరిగి చూశాను.

శివశంకరి!

"నువ్వా...? మీరా...!" అన్నాను.

ఆమెకు అర్థం కాలేదు.

"మీ కోసం వెతికాను. ఆశలు వదులుకున్నాను"

"నేను అంతకు ముందు టాయిలెట్‌కి వెళ్దామని లేచాను. లోపల ఎవరో వున్నారు. పక్క కంపార్ట్‌మెంట్ చివరకి వెళ్ళాను. బయటకు రాబోతుండగా జరిగిపోయింది"

శివశంకరి కళ్ళలో నీళ్ళు...

"నేను అతన్ని చూశాను" అంది తలవంచుకొని.

"నేనూ చూశాను"

"అతని మీద కోపం వచ్చిన మాట నిజం. కానీ ఇప్పుడు అతనంటే గౌరవం పెరిగింది. అతను లేచి ఆ పాట పాడితే పాదాభివందనం చేయాలనుంది"

"కరిగిపోయిన కాలం తిరిగిరాదు" అన్నాను.

"ఈ వార్త ప్రపంచానికి తెలిసిపోయుంటుంది" అంది.

"అవును. మరికొందరి గుండెలు ఆగిపోవాలిగా"

"మనకు ఫోన్ దొరికితే బాగుంటుంది"

అవును. మధుకి చెప్పాలి.

రావ్‌గారికి ఫోన్‌చేసి చెప్పాలి. ఇంతకూ ఫ్లైట్‌కి బయలుదేరేముందు ఈ వార్త

తెలుస్తుందా? తెలిసే అవకాశాలుండవు. పేపర్లో రాదు. న్యూస్ చెబుతారేమో? వింటారో? లేదో?

ఇంతకూ కొత్త సినిమా కథ తయారుచేస్తామా? లేదా?

వెనక్కి వెళ్ళటమా? ముందుకా?

నాకు ముసలాయన గుర్తొచ్చారు.

"రండి వెళ్దాం" అన్నాను.

శివశంకరి నాతో నడిచి వచ్చింది.

ఆయన ఇంకా అలానే కూర్చున్నారు.

"మీరు నడవగలరా?" అన్నాను.

"తప్పదుగా"

"ఇదంతా ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. మనకి ఏదో వెహికల్ దొరికేంత వరకూ నడవక తప్పదు"

ఆయన తలూపి శివశంకరి కేసి చూసారు.

వాళ్ళమ్మాయి గుర్తొచ్చివుంటుంది.

"మనం బయలుదేరుదామా?" అన్నాను.

శివశంకరి తలూపింది.

వెళ్ళేముందు మరోసారి ఆ దృశ్యం చూశాం.

ఎటుచూసినా జనం. కొంతమంది కాందిశీకుల్లా తరలిపోతున్నారు. ఎందుకో సినీతార గుర్తొచ్చింది.

ఆ కంపార్ట్మెంట్కేం కాలేదు. ఆమె ఇక్కడే వుంటుందా? బయలుదేరి వస్తుందా? రేపటినుండి ఆమెకి చెందిన వార్తలు ప్రముఖంగా వస్తాయి.

నడుస్తుంటే తిరిగి అదే ఆలోచన.

మరణించిన వారందరినీ ఇలా ఈ రైల్లోకి తీసుకొచ్చిన సంఘటనలేమిటి?

ఇది కర్మా?

మృత్యువుని భగవంతుడు ముందే రాశాడా?

నో... వంతెన ప్రమాదంలో మరణించటాన్ని అర్థం చేసుకోవచ్చు. మనిషి చేసే పొరపాటువల్ల ఎదురయ్యే ప్రమాదాలను జీర్ణం చేసుకోవచ్చు...

ఇది కేవలం కొందరు మనుషులు చేసింది.

మేం ముగ్గురం అడుగులు ముందుకు వేస్తున్నాం.

రావ్‌గారితో మాట్లాడాక నా ప్రయాణం ఎటు అనేది నేను నిర్ణయించుకుంటాను.

బహుశా ఆయన బయలుదేరక ముందే నేను మాట్లాడగలననుకుంటున్నాను.

శివశంకరి ఆగి, వెనక్కి తిరిగి రైలుని చూసింది.

నేనూ ఆగిపోయాను.

ఆమె ముఖం గంభీరంగా వుంది.

కొద్దిక్షణాల తర్వాత తిరిగి నడక మొదలైంది.

"శివశంకరిగారూ మిమ్మల్ని ఒకటడగాలనుకుంటున్నాను"

"అడగండి"

"ఆజాదీ భారత్ యాత్రలో మీరు పాల్గొంటున్నారా?"

కొంచెంసేపు ఆలోచించింది.

"తప్పకుండా. నేను సెలక్ట్ అయితే"

"ఆ ప్రోగ్రామ్ వుంటుందా?"

"ఖచ్చితంగా వుంటుంది... ఇలాంటివన్నీ పిరికివాళ్ళు చేసే పనులు. వీళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ దేశం ముక్కలు కాదు. ప్రజలే చరిత్ర నిర్మాతలు. వీళ్ళందరూ సముద్రంపైన తేలే మురికితెట్టలవంటివారు. సముద్రం, దేశం, జీవితం, జనం మురికిని బయటకు నెట్టేస్తూనే వుంటారు"

ముసలాయన శివశంకరిని అభినందన పూర్వకంగా చూసాడు.

"మళ్ళీ చెబుతున్నాను. మీరు సెలక్ట్ అవుతారు. మీరు 'ప్రయాణం' చేస్తారు"

ఆమె ముఖంలో వెలుగు...

తమిళంలో ఏదో అంది.

"అదేంటో చెప్పరూ" అన్నాను.

"మరణించిన నేస్తమా...
ఉయ్ లవ్ అవర్ ఇండియా!
"మా తుజే సలామ్" అన్నాను.

**అయిపోయింది**

TO MY COUNTRY WITH LOVE

by P. chandra sekhara azad



డిసెంబర్ అయిదున రైలు ప్రయాణం ఆరంభం

ఆరుతో ముగిసింది

మధ్యలో ఏం జరిగింది?

తరువాత ఏం జరుగుతోంది?

ఈ ప్రయాణం ఎటు?

జానకి - అజాద్

ప్రచురణలు